విషమకాలం





గిద్దలూరు మండలం బురుజుపల్లికి చెందిన టి.మనోజ్ అనే చిన్నారి రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఈనెల 2వ తేదీన కట్లపాము కరిచింది. పిల్లాడి ఏడుపు విని తల్లి పరిశీలించింది. బుగ్గపై పాము కాటును గుర్తించి వెంటనే వైద్యశాలకు తీసుకెళ్లింది. కానీ అప్పటికే చిన్నారి మృతి చెందాడు.

తర్లుపాడు మండలం సూరేపల్లికి చెందిన పుల్లయ్య పొలం పనులు చేసుకుంటుండగా గతనెల 30న రక్తపింజరి కాలిపై కాటేసింది. దీంతో భయాందోళనకు గురైన ఆయన ఊర్లోకి వెళ్లి బంధువులకు విషయం తెలిపాడు. వారు ఆటోలో మార్కాపురం వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఎక్కువ సమయం గడవడంతో వైద్యశాలలో చికిత్స అందిస్తున్న సమయంలోనే పుల్లయ్య మృతి చెందాడు.

యర్రగొండపాలెంకు చెందిన ప్రసాద్‌ను అక్టోబరు 12న ఇంట్లోనే పాము కాటేసింది. విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన ఆయన స్థానిక వైద్యశాలకు వెళ్తే మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రికి వెళ్లమని సూచించారు. దీంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరాడు. అక్కడ నాలుగు రోజులపాటు వైద్యం అందించారు. ప్రాణాపాయం తప్పినా రూ.2.50లక్షల వరకు ఖర్చయింది.

- గ్రామాల్లో పెరిగిన సర్పాల సంచారం
- గుడ్లు పొదిగే సమయం కావడమే కారణం
- అజాగ్రత్తతో కాటుకు గురవుతున్న ప్రజలు
- గ్రామీణ వైద్యశాలల్లో అందుబాటులో లేని యాంటీ వీనమ్ ఇంజక్షన్
- వైద్యానికి భారీగా అవుతున్న ఖర్చు



ఓ కళాశాల ఆవరణలో కొండచిలువను పట్టి తీసుకెళ్తున్న స్నేక్ క్యాచర్ (ఫైల్)



పాము కాటుకు మృతి చెందిన మనోజ్ (ఫైల్)

వర్షాలు సమృద్ధిగా కురవడం, ప్రస్తుతం సర్పాలు గుడ్లు పొదిగే కాలం కావడంతో జిల్లాలో పాముకాటు కేసులు ఎక్కువవుతున్నాయి. సకాలంలో వైద్యశాలకు చేరుకుని చికిత్స చేయించుకున్న వాళ్లు ప్రాణాపాయం నుంచి బయటపడుతున్నారు. కొద్దిగా అజాగ్రత్తగా ఉన్నవాళ్లు ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంత వైద్యశాలల్లో యాంటీ వీనమ్ ఇంజెక్షన్ అందుబాటులో లేకపోవడం కూడా పాము కాటు మరణాలకు కారణమవుతోంది. కొన్ని పెద్ద వైద్యశాలల్లో మాత్రమే ఇది లభిస్తోంది. దీంతో అప్రమత్తంగా ఉండటం మినహా చేయగలిగేదేమీ లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాము కాట్లు పెరిగాయి. ప్రధానంగా మార్కాపురం డివిజన్‌లోని అటవీ సమీప ప్రాంతాల్లో విషసర్పాల సంచారం ఎక్కువైంది. గతంతో పోల్చితే కొన్నేళ్లుగా పాము కాటుతో మృతి చెందుతున్న కేసులు అధికమవుతున్నాయి. మార్కాపురం డివిజన్‌లో గతేడాది 150కిపైగా కేసులు నమోదైనట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటికే 231మంది పాముకాటుకు గురైనట్లు చెబుతున్నారు. వీరిలో మరణాలు 10శాతానికిపైనే ఉంటున్నాయి. వాస్తవానికి అటవీ సమీప గ్రామాల్లో విషసర్పాల కాటు కేసులు ఎక్కువగా ఉంటున్నా, అవి వెలుగు చూడటం లేదు. సకాలంలో వైద్యం అందకపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయి. దీంతోపాటు నాటువైద్యం కూడా మరణాల శాతం పెరగడానికి కారణమవుతోంది. ఎక్కువగా సంచరించే సర్పాల్లో విషపూరితమైనవి, ప్రమాదకరమైనవి మూడు రకాలే. వాటిల్లో రక్తపింజరి, నాగుపాము(తాచు), కట్లపాము మాత్రమే విషపూరితమైనవి. ఇవి కాటేస్తే ప్రాణాలకు ముప్పే. వాటిల్లో కూడా రక్తపింజరి అత్యంత ప్రమాదకరమైనది. దీని కోరలు పెద్దవి కావడం, లోతుగా కాటేయడం వలన ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తాచు, కట్ల పాములు కూడా విషపూరితమైనవే అయినా రక్తపింజరితో పోల్చితే తక్కువే. మిగిలిన వాటిల్లో కొండ చిలువలు, జెర్రిపోతులు, మట్టిపాములు, నీరుకట్టు పాములు తదితరాలు ఉన్నా వాటితో ప్రాణాపాయం ఉండదు. అవి కాటేసినా హైపర్ టెన్షన్, గుండె జబ్బులు ఉన్నవాళ్లే మరణిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం తప్పినట్లే

ఇతర సమయాల్లో కంటే పాములు గుడ్లు పొదిగే సమయంలోనే ఎక్కువగా వాటి సమీపానికి వెళ్లే జీవిపై కాటేస్తుంటాయి. అవి పొదిగే గుడ్లకు ప్రమాదం సంభవిస్తుందన్న భయంతోనే ఆ సమయంలో

మిగతా 6వ పేజీలో

గ్రామీణ వైద్యశాలల్లో లేని యాంటీ వీనమ్ ఇంజెక్షన్

విషసర్పాల కాటుకు గురైన వాళ్లకు ఎంత వీలైతే అంత తొందరగా యాంటీ వీనమ్ ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదీ కూడా ఏ రకం పాము కరిచిందో వైద్యులకు తెలియజేయాలి. పేషెంట్ కండిషన్‌ను, పాము రకాన్ని బట్టి వైద్యులు ఎంత మోతాదులో ఇంజెక్షన్ ఇవ్వాలో నిర్ణయిస్తారు. ఈ ఇంజక్షన్ పెద్ద వైద్యశాలల్లో మినహా చిన్నపాటి పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండటం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చి వైద్యం చేయించుకునేలోపే చాలామంది మృత్యువాత పడుతున్నారు. పాము కరిచిన తర్వాత గంటలోపు వైద్యశాలకు చేరుకుంటే తప్పక బతికే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత సమయం గడిచే కొద్దీ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అటవీ సమీప పీహెచ్‌సీల్లో యాంటీ వీనమ్ ఔషధాన్ని జూలై నుంచి జనవరి వరకు తప్పక అందుబాటులో ఉంచేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



శ్మశాన వాటిక ప్రాంగణంలో మహా శివలింగానికి రంగులు వేస్తున్న కూలీలు

మరుభూమి మరో శివాలయమే

- రూ.కోటితో శ్మశాన వాటిక అభివృద్ధి
- పర్చూరు వాసుల చొరవతో పనులకు శ్రీకారం
- నాడు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి
- నేడు అన్ని వసతులతో రూపుదిద్దుకుంటున్న వైనం

7



పంటల బీమా.. రైతుకు ధీమా

- కరువు, విపత్తుల్లో ఉపయోగం
- గ్రామగ్రామాన అవగాహన కల్పిస్తున్న అధికారులు
- 15తో ముగియనున్న దరఖాస్తు గడువు
- వరికి నెలాఖరు దాకా అవకాశం

7



విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సందర్భంగా సీఎం చంద్రబాబుతో కలెక్టర్ అన్సారియా

విజన్ డాక్యుమెంట్ పీపీపీలో ద్వితీయ స్థానం

- కలెక్టర్ అన్సారియాను అభినందించిన సీఎం చంద్రబాబు
- విజయవాడకు వెళ్లిన డ్వాక్రా మహిళలు, వివిధ సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విజన్ డాక్యుమెంట్-2029కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ప్రశంసలు అందాయి. స్వర్ణాంధ్ర-47 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్న ప్రభుత్వం జిల్లాల వారీగా ప్రణాళికలను కోరింది. ఈ నేపథ్యంలో అమరావతిలో రెండు రోజులపాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో రెండోరోజైన గురువారం జిల్లాలో అభివృద్ధికి ఉన్న అవకాశాలు, రంగాల వారీ దృష్టి సారించాల్సిన అంశాలు, వాటి సాధనకు చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వితీయ స్థానంలో నిలిచింది. దూరదృష్టితో ఈ డాక్యుమెంట్‌ను సమగ్రంగా రూపొందించారంటూ కలెక్టర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రత్యేకంగా అభినందించారు.

స్వర్ణాంధ్ర విజన్‌లో మనం

విజయవాడలో శుక్రవారం జరిగిన స్వర్ణాంధ్ర విజన్-2047 సభకు జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి భారీగా తరలివెళ్లారు. నగరంతోపాటు సమీప గ్రామాలకు చెందిన బీసీ సంఘాల నాయకులు, స్వయం సహాయక సంఘాల మహిళలతోపాటు వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన నిష్ణాతులు

మిగతా 6వ పేజీలో

పది నెలల బాలుడు కిడ్నాప్

- పొరుగింటి మహిళపైనే తల్లిదండ్రుల అనుమానం
- ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు



కిడ్నాప్‌నకు గురైన బాలుడు మహీర్ సునాని (ఫైల్)

ఒంగోలు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఉన్న పది నెలల బాలుడిని ఓ మహిళ కిడ్నాప్ చేసింది. శుక్రవారం నగరంలోని ప్రగతినగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు ఒడిశాకు చెందిన ప్రదీప్ సునానీ మూడేళ్లుగా ఒంగోలు కార్ కేర్‌లో పనిచేస్తున్నాడు. స్థానిక ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఒడిశాలో ఉంటున్న భార్య ఊర్వశి, పది నెలల కుమారుడు మహీర్‌ను నెల క్రితం ఒంగోలు తీసుకువచ్చాడు. వారి పక్కింట్లోనే దయామణి అనే మహిళ నివసిస్తోంది. నిత్యం ఆమె బాలుడిని ఆడిస్తుంటుంది. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం మహీర్‌ను ఆడించేందుకు తీసుకెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తీసుకురాలేదు. దీంతో తల్లిదండ్రులు పిల్లాడి కోసం వెతకగా ఇద్దరూ కనిపించలేదు. దయామణికి సంబంధించిన దుస్తులు, వస్తువులు కూడా ఆమె ఇంట్లో లేవు. దీంతో బాలుడిని కిడ్నాప్ చేసిందని అనుమానించిన తల్లిదండ్రులు ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో ఐదు బృందాలు బాలుడి కోసం గాలిస్తున్నాయి. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీని సేకరిస్తున్నాయి. దయామణి ఎవరు? ఎక్కడి నుంచి వచ్చింది? అన్న కోణంలో కూడా పరిశీలన చేస్తున్నారు. కాగా తమ కుమారుడు కనిపిస్తే చెప్పండి అంటూ మహీర్ తల్లిదండ్రులు బాలుడి ఫొటో చూపిస్తూ నగరంలోని వీధుల వెంట తిరుగుతున్నారు.

సాగునీటి సమరం

- 342 సంఘాలు.. 2.05లక్షల మంది ఓటర్లు
- నేడు డబ్ల్యూయూఏలకు, 17న డీసీలకు ఎన్నిక
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- 3,068 మంది సిబ్బంది నియామకం
- ఎన్నికల నిర్వహణకు రూ.20లక్షలు మంజూరు
- తుది ఏర్పాట్లపై 'కాడా' కమిషనర్ సమీక్ష
- ఇప్పటికే ఏకగ్రీవంపై టీడీపీ స్పష్టత
- బహిష్కరిస్తున్నట్లు వైసీపీ ప్రకటన

ఒంగోలు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికలకు వేళైంది. జిల్లాలోని 342 సంఘాల(డబ్ల్యూయూఏల) ఎన్నికలు శనివారం జరగనున్నాయి. మొత్తం ఆయా సంఘాల పరిధిలోని 2.05 లక్షల మంది ఓటర్లు నీటిసంఘాల ప్రాదేశిక నియోజకవర్గ(టీసీ) సభ్యులను ఎన్నుకుంటారు. సదరు టీసీలు సమావేశమై డబ్ల్యూయూఏ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకునేలా షెడ్యూల్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఐదేళ్ల పదవీ కాలం ఉండే డబ్ల్యూయూఏల పరిధిలోనే నీటి వనరుల నిర్వహణ, మరమ్మతులు, ఇతరత్రా అన్ని పనులు ఉంటాయి. గత టీడీపీ హయాంలో 2015లో ఈ ఎన్నికలు జరగ్గా గడువు పూర్తికి ముందే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దుచేసి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. నీటి వనరుల పర్యవేక్షణను గాలికొదిలేసింది. కాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించింది. సెప్టెంబరులోనే షెడ్యూల్ ఇచ్చినా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చాయి. ఎట్టకేలకు శనివారం జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మేజర్, మీడియం, మైనర్

మిగతా 6వ పేజీలో



ఎన్నికలపై చర్చిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, డీఎస్ఈ రామకృష్ణ, నోడల్ అధికారి సతీష్



వర్క్‌షా‌ప్‌లో మాట్లాడుతున్న చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీ హర్ష

దొంగ మస్టర్లను అరికట్టాలి

- ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం కల్పించాలి
- పంచాయతీరాజ్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ భవానీహర్ష ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో దొంగ మస్టర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.భవానీహర్ష ఆదేశించారు. స్థానిక డ్వామా కార్యాలయంలో ఏపీవోలు, టీఏలతో శుక్రవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. అర్హులైన కూలీలకు పనులు కల్పించాలన్నారు. పనులకు రాకపోయినా దొంగ మస్టర్లు వేసి కూలి పొందుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఉపాధి పనులు చేసే కూలీలకు కనీస వేతనం రూ.300 రావాల్సి ఉండగా జిల్లాలో సరాసరిన రూ.209 మాత్రమే లభిస్తున్నదన్నారు. కూలి పెరిగేందుకు తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించారు. అంతకు ముందు ఆయన చీమకుర్తి మండలం ఇలపావులూరులో జరుగుతున్నఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ పి.ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న వైసీపీ నాయకులు

రైతులను ముంచారు

- వెంటనే రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలి
- సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి
- ఒంగోలులో వైసీపీ నేతల నిరసన ర్యాలీ
- డీఆర్వోకు వినతిపత్రం

6

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి
- బేస్తవారపేట మండలంలో రోడ్ల మరమ్మతుల పరిశీలన
- పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

6



కోనపల్లె రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, పక్కన గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

'విష'మకాలం

(5వ పేజీ తరువాయి)

పాములు విచక్షణారహితంగా కాటేసేందుకు సిద్ధమవుతాయి. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభమైన తర్వాతనే కలిసే సమయం. తర్వాత అక్టోబరు నుంచి నవంబరు వరకు గుడ్లు పెడతాయి. జనవరి వరకు పొదిగే సమయం ఉంటుంది. ఈ సమయంలోనే అవి అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. వాస్తవానికి పాములు ఇతర సమయాల్లో ఆహార సేకరణకు ఉపయోగపడే జీవులపై మాత్రమే కాటేసి వాటిని చంపిన తర్వాత తింటాయి. మనుషులను అవి కాటేసేందుకు ప్రయత్నించవు. మనుషుల అలికిడిని శబ్దగ్రహణం ద్వారా గ్రహించి దాదాపు పక్కకెళ్లిపోతాయి. పెద్దపాములకంటే చిన్నపాటి పాములతోనే ఎక్కువ ప్రమాదం ఉంది. పెద్దపాములు ఎంత విషం వదలాలో విచక్షణతో వ్యవహరించి కాటు వేస్తాయి. అదే తక్కువ వయసున్న పాములు భయంతో అవి ఎక్కువ మొత్తంలో విషాన్ని కాటులో చిమ్ముతాయి. మృత్యువాతపడటానికి ఇది కూడా ఒక కారణమే.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పాము కరిచిన వాళ్లను మాట్లాడించకూడదు. అంతేకాక వైద్యశాలకు వెళ్లేలోపు ఎక్కడా పడుకోబెట్టకూడదు. కూర్చోబెట్టి మాత్రమే వాహనంలో వైద్యశాలకు చేర్చారు.
- పాము కాటు వేసిన తర్వాత చాలామంది తెలియక రక్తసరఫరా ఆపేందుకు తాడుతో కట్టడంలాంటివి చేస్తుంటారు. అలా చేయడం వలన ఆ కింది ప్రాంతమంతా వేగంగా విషం రక్తనాళాల్లో చేరి విషపూరితమై ఆ అవయవాన్ని తీసేయాల్సి వచ్చే పరిస్థితులు ఏర్పడతాయి.
- చేతులకు, కాళ్లకు కాకుండా ఉదరం భాగం నుంచి తల వరకు ఎక్కడ కాటేసినా అత్యంత త్వరగా వైద్యశాలకు చేర్చాల్సి ఉంటుంది.
- పాములు చెత్తాచెదారంతో కూడిన మురుగు ఎక్కువగా ఉండే ప్రాంతాన్ని ఎంచుకుంటాయి. కాబట్టి ఇంటి పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి.
- పాములకు ప్రధానాహారం కప్పలు, ఎలుకలు. కాబట్టి వాటిని ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలి.
- పాము సంచరిస్తుందని తెలియగానే వాటిని పట్టే నిపుణులకు వెంటనే సమాచారం ఇవ్వాలి. విషపూరితమైనవే అయినా జీవవైవిధ్యం దృష్ట్యా చంపే ప్రయత్నం చేయకూడదు.

సాగునీటి సమరం

(5వ పేజీ తరువాయి)

విభాగాల వారీ డబ్ల్యూయూఏలను విభజించి ఎన్నికలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో 342 సంఘాలకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. మేజర్(ఎన్నెస్పీ) నీటి విభాగంలో 88 డబ్ల్యూయూఏలు, మీడియం విభాగంలో 14, మైనర్ విభాగంలో 240 సంఘాలు ఉన్నాయి. మీడియం, మేజర్ సంఘాల పరిధిలో ఒక్కో దానిలో 12 టీసీలు, మైనర్ సంఘాల పరిధిలో ఒక్కో దానిలో ఆరు టీసీలు ఉన్నాయి. అలా అన్ని సంఘాలు కలిపి 2,651 టీసీలు ఉన్నాయి. ఆయా సంఘాల పరిధిలో తొలుత టీసీ సభ్యులను ఓటర్లుగా ఉండేవారు సమావేశమై ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లను ఎన్నుకుంటారు. ఆయా విభాగాల పరిధిలో మొత్తం 2,05,768 ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉన్నారు. వారిలో మేజర్ విభాగంలోని ఎన్నెస్పీ పరిధిలో 1,16,421 మంది, మైనర్ ఇరిగేషన్‌లో 75 వేలు, మీడియం విభాగంలో మరో 35 వేల మంది ఉన్నారు. అలాగే మొత్తం ఓటర్లలో మహిళలు 61వేల మందికిపైగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల నిర్వహణకు మొత్తం 3,068 మంది వివిధ స్థాయిల్లోని సిబ్బందిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఒక్కో డబ్ల్యూయూఏకి ఒక ఎన్నికల అధికారి, మరొక అసిస్టెంట్ ఎన్నికల అధికారి, మూడు టీసీలకు ఒక పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. ఖర్చుల కోసం ప్రభుత్వం జిల్లాకు రూ.20లక్షలు మంజూరు చేసింది.

ఉత్సాహం చూపని వైసీపీ

ఎన్నికల ప్రక్రియ శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం వరకు సాగనుంది. మధ్యాహ్నం వరకు నామినేషన్ల దాఖలు, పరిశీలన, మధ్యాహ్నం తర్వాత అవసరమైతే పోలింగ్, సాయంత్రం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. తుది ఏర్పాట్లపై రాష్ట్రప్రభుత్వ ఆయకట్టు అభివృద్ధి సంస్థ (కాడా) కమిషనర్ రామసుందర్‌రెడ్డి శుక్రవారం అన్ని జిల్లాల ఇరిగేషన్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి ఎస్‌ఈ వరలక్ష్మి, డిప్యూటీ ఎస్‌ఈ రామకృష్ణ, నోడల్ అధికారి ఎస్‌వీ.సతీష్ పాల్గొన్నారు. అనంతరం వారు సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఇదిలా ఉండగా సాగునీటి సంఘాలన్నింటిని కైవసం చేసుకునేలా అధికార తెలుగుదేశం నేతలు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల పర్యవేక్షణలో ఇప్పటికే ఆయా సంఘాల అధ్యక్షుల ఎంపిక ఒక కొలిక్కి వచ్చింది. అదేసమయంలో ఈ ఎన్నికల నుంచి వైదొగులుగుతున్నట్లు వైసీపీ ప్రకటించింది. ఆ మేరకు అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. అయితే జిల్లాలో అధినేత ప్రకటనకు ముందే వైసీపీ నేతలు పోటీకి ఎవ్వరూ ఉత్సాహం చూపిన పరిస్థితి కనిపించలేదు.

పీపీపీలో ద్వితీయ స్థానం

(5వ పేజీ తరువాయి)

హాజరయ్యారు. విజయవాడలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో జరిగిన ఈసభలో స్వర్ణాంధ్ర విజన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. కాగా ఒంగోలులోని డీఆర్‌ఆర్‌ఎం హైస్కూలు నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి 10 బస్సులు, 56 కార్లలో 717మంది వెళ్లారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం స్వర్ణాంధ్ర-47 డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విజయవాడ వెళ్లిన వారిని సమన్వయం చేసేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కంట్రోలు రూంను కూడా ఏర్పాటుచేశారు. డీఆర్‌ఆర్‌ఎం స్కూలులో నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేసు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మునిసిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచారు!

● వెంటనే రూ.20వేలు పెట్టుబడి సాయం అందించాలి ● సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలి ● ఒంగోలులో వైసీపీ నేతల ర్యాలీ ● డీఆర్వోకు వినతి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను నట్టేట ముంచారని వైసీపీ నాయకులు ఆరోపించారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇది స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు సాగింది. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పెట్టుబడి కోసం సాయం చేసిందన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏటా రూ.20వేలు ఇస్తామన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తల్లడిల్లిపోతున్నారన్నారు. వెంటనే గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ధ్వజమెత్తారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి చినఓబులేసును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కె.నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిలు చుండూరి రవిబాబు, నారాయణయాదవ్, నాయకులు జూపూడి ప్రభాకర్, కాకుమాను రాజశేఖర్, కొమ్మూరి కనకారావు, చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, వైఎం.ప్రసాద్‌రెడ్డి, లంకపోతు అంజిరెడ్డి, ఆళ్ల రవీంద్రారెడ్డి, కఠారి శంకర్ పాల్గొన్నారు.

శింగరకొండలో వైభవంగా హనుమత్ వ్రతం

ఇరుముడులు సమర్పించిన ఆంజనేయస్వామి దీక్షాధారులు

అద్దంకి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం వైభవంగా జరిగింది. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది ఆంజనేయస్వామి దీక్షాధారులు ఇరుముడులు సమర్పించి దీక్షా విరమణ చేశారు. ఉదయం దీక్షాధారులు ఆలయ ప్రదక్షణ చేశారు. ఇరుముడులలో ఉన్న పూజా ద్రవ్యాలతో ఉత్సవమూర్తులకు అభిషేకం చేశారు. ఈవో తిమ్మానాయుడు, ఉభయదాతలు ధూళిపాళ్ల రామగోవింద కుటుంబసభ్యులు, పూజారులు పంపాపూజ నిర్వహించి హనుమత్ వ్రతం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరకొండ ప్రాంతం కిటకిటలాడింది. దీక్షా భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు.



పూజలలో పాల్గొన్న దీక్షాధారులు

నేడు మాధవస్వామి దేవాలయం విమాన శిఖర గోపుర ప్రతిష్ఠ

అద్దంకి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని మాధవస్వామి దేవాలయం విమాన శిఖర గోపుర పునఃప్రతిష్ఠ శనివారం ఉదయం 8-04 గంటలకు జరగనుంది. బుధవారం ప్రారంభమైన పూజా కార్య క్రమాలు 3వ రోజైన శుక్రవారమూ జరిగాయి. ఉదయం పారాయణం, పంచామృతాభిషేకం, హోమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అయప్ప శరణు ఘోషతో మారు మోగిన ఉప్పుమాగులూరు

బల్లికురవ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామం శుక్రవారం అయప్ప శరణుఘోషతో మారుమోగింది. నలబై ఒక్క రోజుల నుంచి అయప్ప దీక్షలు తీసుకున్న 15 మంది స్వాములు తమ దీక్షను విరమించేందుకు ఇరుముడిని గురుస్వామి చే కట్టించుకొని గ్రామోత్సవంతో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. టీడీపీ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా దత్తాత్రేయ స్వామి కల్యాణ మహోత్సవం

వేటపాలెం/చీరాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : దత్త జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం దత్తాత్రేయ స్వామి క్షేత్రంలో అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామి లీలా కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. పురోహితులు కారంచేటి చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.



కళ్యాణ మహోత్సవంలో భక్తులు

వాలీబాల్ జట్టుకు సెయింట్‌ఆన్స్ విద్యార్థుల ఎంపిక

చీరాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ వాలీబాల్ టీంకు సెయింట్‌ఆన్స్ కళాశాల విద్యార్థులు ఇరువురు ఎంపికయినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు జి.తేజ, ఆర్.రమణలను వారు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజరు ఆర్.వి. రమణమూర్తి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలు

చినగంజాం, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం జరిగే స్వర్ణాంధ్ర 2047 పది సూత్రాల కార్యక్రమానికి మండల పరిధిలోని స్వయం సహాయక గ్రూపు సభ్యులు, వీవోఏలు విజయవాడ బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించనున్న ఈ డాక్యుమెంట్ కార్యక్రమానికి చినగంజాం మండల సమాఖ్య అధ్యక్షురాలు సుశీలమ్మ ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులు అధ్యక్షులు, వీవోఏలు, సీసీ వెంకటస్వామిలు బస్సులో విజయవాడ వెళ్లినట్లు ఏపీఎం గద్దె సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో కీలకంగా వ్యవహరించాలి

చీరాలటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ విద్యార్థిదశలో పాల్గొనే పోటీల్లో కీలకంగా వ్యవహరించాలని చీరాల రెడ్డిజన సేవాసమితి ప్రతినిధులు చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన త్రిపురం వేదశ్రీ గత నెల తమిళనాడులో నిర్వహించిన దక్షిణ భారత అండర్- 17 బాలికల పవర్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్య పతాకాన్ని సాధించి మూడవ స్థానంలో నిలిచింది. ఈసందర్భంగా శుక్రవారం సమితి ఆధ్వర్యంలో ఘనంగా వేదశ్రీను సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు గోపాలకృష్ణరెడ్డి, అనీల్‌కుమార్‌రెడ్డి, భరత్‌రెడ్డి, బత్తుల బ్రహ్మారెడ్డి, షణ్ముఖరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ రక్షణలో బాలుడు

యద్దనపూడి/మార్టూరు, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడేళ్ల వయసు ఉన్న బాలుడ్ని శుక్రవారం సాయంత్రం ఒక వ్యక్తి యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాడు. యద్దనపూడి మండలంలోని పూనూరు-గన్నవరం రోడ్డులో తిరుగుతున్నాడని, అమ్మ కావాలని ఏడుస్తున్నాడని, తల్లిదండ్రుల పేర్లు చెప్పలేకపోతున్నాడని, స్టేషన్‌కు తీసుకొచ్చానని ఆ వ్యక్తి పోలీసులకు తెలిపారు. పోలీసులు ఆ బాలుడ్ని ఏమి అడిగినా చెప్పలేకపోతున్నాడు. దీంతో ఆ బాలుడ్ని ఐసీడీఎస్ వారికి అప్పగించినట్లు ఎస్ఐ రత్నకుమారి తెలిపారు. బాలుని వివరాలు తెలిస్తే 9121102153 నంబర్‌కు తెలియచేయాలని ఎస్ఐ కోరారు.

ఓవర్‌లోడుతో వెళ్తున్న ఆటోడ్రైవర్‌లపై కేసు

చీరాలటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పరిమితికి మించి ప్రయాణికులతో వెళుతున్న రెండు ఆటోలను ఈపూరుపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల మండలం పిన్నిబోయినవారిపాలెంకు చెందిన గోనబోయిన వెంకట యాదవ్, వెదుళ్లపల్లికి చెందిన దేవర రాజేష్‌లు ఓవర్ లోడు ప్రయాణికులతో ప్రయాణిస్తుండగా బాపట్ల - చీరాల రోడ్డులోని ఈపూరుపాలెం వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

నేడు కొత్తపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట(చీరాల), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఐఎల్‌టీడీ కాలనీ, వడ్డె సంఘం, సంపత్‌నగర్, రోశయ్య కాలనీ, రామాపురం, పాపాయిపాలెం, వాకవారిపాలెం, వాడరేవు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పర్చూరులో...

పర్చూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : పర్చూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ రమేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు, ఉప్పుటూరు, వీరన్నపాలెం, నాగులపాలెం, నూతలపాడు, యర్రంవారిపాలెం, గర్నెపూడి, పెద్దివారిపాలెం, అన్నంబొట్లవారిపాలెం, అగ్రహారం తదితర గ్రామాలకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

15న జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

చినగంజాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో, పాకల జడ్పీహెచ్‌ఎస్‌లో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్లకు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, వై.పూర్ణచంద్రరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాగుంట సుబ్బరామిరెడ్డి కళాశాలలో బాలుర జట్టును, పాకలలో బాలికల జట్టును ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. బాలుర విభాగంలో 70 కేజీలలోపు బరువు, బాలికల విభాగంలో 65 కేజీలలోపు బరువు ఉండాలని, 2005 సంవత్సరం తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఈ నెల 22, 23, 24, 25 తేదిలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరగనున్న 50వ ఆంధ్ర రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ బాలర, బాలికల టోర్నమెంట్‌లో ఎంపికైన జిల్లా జట్లు పాల్గొనన్నుట్లు పేర్కొన్నారు. బాలురు.. వివరాల కోసం 9700600996, బాలికలు.. వివరాల కోసం 9848606573 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి కృషి

బల్లికురవ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రైతుల సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ రవినాయక్ చెప్పారు. శుక్రవారం మండలంలోని గుంటుపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా రైతులు తమ సమస్యలపై తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళిక అవసరం

బల్లికురవ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ప్రణాళిక అవసరం అని ఎంపీడీవో కె. కుసుమకుమారి చెప్పారు. శుక్రవారం గ్రామాలలో ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ జరిగింది. ఈవోఆర్డీ సుమతి మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ వై కోటేశ్వరరావు(బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం

వేటపాలెం, చీరాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో వస్తున్న అర్జీలను పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ పార్వతి చెప్పారు. మండల పరిధిలోని పుల్లరిపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

రెవెన్యూ సమస్యలన్నీ చక్కదిద్దుతాం : తహసీల్దార్

మేదరమెట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరంగా రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని తహసీల్దార్ సుబ్బారెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని తమ్మవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 13 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు.

44 అర్జీలు అందజేత

ఇంకొల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యల పరిష్కారానికి రైతులు 44 అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు వెంకటరత్నం తెలిపారు. తహసీల్దారు వెంకటరత్నం, గ్రామసర్పంచ్ లుధియమ్మ, దేవదయశాఖ మీనిశెట్టి శ్రీనివాసరావు, సర్వేయర్ లోకేశ్, పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఎస్‌ఎస్‌సీ 2025 పుస్తకంతో ప్రయోజనం

చీరాలటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్‌ఎస్‌సీ 2025 మోడల్ పుస్తకంతో 10వ తరగతి పరీక్షల్లో హాజరయ్యే విద్యార్థులకు ప్రయోజనమని పలువురు ప్రతినిధులు చెప్పారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సంబంధిత పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారిన సిలబస్ ఆధారంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో పుస్తకాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

హత్య కేసులో ఆరుగురికి జీవిత ఖైదు

పెద్ద దోర్నాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఆరుగురికి జీవితఖైదు, జరిమానాను విధిస్తూ మార్కాపురం నాల్గవ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయాధికారి శుభావాణి తీర్పునిచ్చారు. ఆ వివరాలను ఎస్సై మహేశ్ శుక్రవారం వెలువరించారు. దోర్నాల మండలం పెద్ద బొమ్మలాపురానికి చెందిన ఒంగోలు ఎఫ్రీమ్ సోదరి కెలీటాను పరిశపోగు దావీదు 15 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. 4 నెలలకు రైలు ప్రమాదంలో దావీదు మృతి చెందాడు. ఆ మృతికి కారణం ఒంగోలు ఎఫ్రీమ్ అయి ఉండొచ్చని భావించిన దావీదు సోదరులు పరిశపోగు కర్న, కరుణ కుమార్, జే రావు, ఆనందరావు, జాన్, నరేష్ కుమార్, విల్సన్‌లు ఎఫ్రీమ్‌పై పగ పెంచుకున్నారు. అవకాశం కోసం ఎదురు చూశారు. ఈ క్రమంలో 2015 సెప్టెంబరు 6వ తేదీన ఒంగోలు ఎఫ్రీమ్ కాలకృత్యాలు కోసం గ్రామం శివారుకు వెళ్లాడు. దావీదు సోదరులు ఇదే అదునుగా భావించి ఎఫ్రీమ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. గమనించిన స్థానికులు ఎఫ్రీమ్‌ను దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఎఫ్రీమ్ మృతిచెందాడు. ఈ నేపథ్యంలో దోర్నాల పోలీసు స్టేషనులో 90/2015 యూఎస్/143,148,326,302 ఆర్/డబ్ల్యు149 ఐపీసీ ప్రకారం కేసు నమోదైంది. అప్పటి ఎర్రగొండపాలెం సీఐ కే రవికుమార్ దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం మార్కాపురం నాల్గవ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి ఎం.శుభావాణి ఆరుగురి సోదరులకు జీవితఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

చైతన్య విద్యాసంస్థల డీన్‌పై దాడి

● ఆసుపత్రిలో మృతి

బెంగళూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎలక్ట్రానిక్ సిటీ విభాగం చైతన్య విద్యాసంస్థల డీన్ మనోహర్‌రెడ్డి(55)పై దాడి జరగడంతో ఆసుపత్రి పాలైన ఆయన మృతిచెందారు. ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన మనోహర్‌రెడ్డి కొన్నేళ్లుగా చైతన్య విద్యాసంస్థలలో పనిచేస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి కళాశాలకు వచ్చేసమయంలో ఎదురుగా ఎక్స్‌కవేటర్ రోడ్డుగా అడ్డుగా ఉంది. ఈ విషయమై స్థానికుడితో వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ నేపథ్యంలో దాడి జరిగినట్టు తెలుస్తోంది. కాసేపటి తర్వాత చైతన్య విద్యాసంస్థల ఏఓ, ప్రిన్సిపాల్‌కు సమాచారం చేరింది. వారు అక్కడికి చేరుకునేందుకు ప్రయత్నించారు. ఈలోగా తాను కళాశాలకు వస్తున్నానని, పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయదలిచినట్టు మనోహర్‌రెడ్డి తెలిపారు. అయితే మార్గమధ్యంలోనే కుప్పకూలడంతో స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు హెబ్బగూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

వైసీపీ నిరసనలో దొంగ చేతివాటం

● సుమారు రూ.40వేల నగదు చోరీ

ఒంగోలు క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఓ దొంగ చేతివాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమం జరుగుతున్న సమయంలో సందట్లో సడేమియా అన్నట్లుగా వైసీపీ నాయకుల జేబులను లూటీ చేశాడు. అయితే జేబు దొంగను గుర్తించిన లంకపోతు అంజిరెడ్డి తదితరులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. సుమారుగా రూ.40 వేల వరకు దొంగతనానికి పాల్పడ్డారు. దీంతో దొంగను పట్టుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు విచారిస్తున్న పోలీసులు నెల్లూరు జిల్లా కప్పత్రాలతిప్పకు చెందిన వ్యక్తిగా దొంగను గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

● రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి

● బేస్తవారపేటలో రోడ్ల మరమ్మతు పనుల పరిశీలన

బేస్తవారపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):'చంద్రబాబు అంటే అభివృద్ధికి అంబాసిడర్..ఆయన స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజల వద్దకే పాలన అందించే దిశలో ప్రభుత్వం పని చేస్తున్నదని' రోడ్లు భవనాలు,పెట్టుబడులు,మౌలిక సదుపాయల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బేస్తవారపేట మండలం కొత్తపల్లె గ్రామం వద్ద కోనపల్లె రోడ్డు మరమ్మతు పనులను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రోడ్ల మరమ్మతు పనులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చేయిస్తున్నదని అన్నారు. రోడ్ల మరమ్మతు పనులను తనిఖీ చేసేందుకు జిల్లాల వారీగా తాను పర్యటిస్తున్నానన్నారు. ఇప్పటికే అన్నమయ్య,బాపట్ల,కడప,కర్నూలు,నంద్యాల జిల్లాల్లో రోడ్ల పరమ్మతుల పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం జరిగిందన్నారు. సంక్రాంతి ఇంకా నెల రోజుల సమయం ఉన్నందున మరమ్మతు పనులను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే స్థానిక ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతున్న తీరును మంత్రి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ జితేంద్ర,ఎంపీడీవో రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో ఔషధ మొక్కలు కీలకం



మొక్కలు అందజేస్తున్న సుధాకర్‌రావు

అద్దంకిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కలు ఎన్నో శతాబ్దాలుగా మన ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉన్నాయని ఎంఈవో బి. సుధాకరరావు చెప్పారు. శుక్రవారం ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణలోని సత్రం బడి, మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆ వరణలో పలు రకాల ఔషధ మొక్కలను విద్యార్థులచేత నాటించారు.

వక్తృత్వ పోటీలో అమృత ప్రతిభ

అద్దంకిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా బాపట్లలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అద్దంకి అమృత పాల్గొని పొట్టి శ్రీరాములు అనే అంశంపై నిర్వహించి వక్తృత్వ పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే వ్యాసరచన పోటీలలో జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. అమృతకు బాపట్ల మండల విద్యాశాఖ అధికారి నిరంజన్, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, బాపట్ల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన అమృతను అద్దంకి మండల విద్యాశాఖ అధికారులు గంగాధరరావు, సుధాకరరావు అభినందించారు.

శ్మశానంలో చిల్లకంప తొలగించండి

పంగులూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భైట మంజులూరు గ్రామ శ్మశానవాటికలోని చిల్లకంపను తొలగించాలని, స్థలానికి సంబంధించిన హద్దుల నిర్ధారణకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పి.సింగారావు గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం స్థానిక నేతలు, సిబ్బందితో కలసి గ్రామంలోని శ్మశానవాటికను పరిశీలించారు. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలలో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



పర్చూరు హిందూ శ్మశాన వాటిక ప్రధాన ద్వారం

'మరుభూమి' ప్రతి వ్యక్తి జీవన ప్రస్థానంలో చివరి మజిలీ అది. బంధాలు బంధుత్వాలు కష్టసుఖాలు, కక్షలు కార్పణ్యాలు అన్నింటినీ వదిలి వెళ్లే స్థలమది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే కాబోలు మరుభూమిని మరో శివాలయంగా హిందువులు భావిస్తారు. అలాంటి పర్చూరు శ్మశాన వాటిక నిన్నమొన్నటి వరకు మృతదేహాలు సైతం ఈసడించుకొనేలా ఉండేది. డంపింగ్‌యార్డును తలపిస్తూ అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి ఉండేది. అంత్యక్రియలకు వచ్చిన బంధువులు, దాయాదులు ఈవైపు రాలేని పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలోనే పలువురు దాతలు ముందుకు వచ్చి ఇదీ మరో శివాలయమే అనేలా తీర్చి దిద్దుతున్నారు.

మరుభూమి మరో శివాలయమే

- రూ.కోటితో శ్మశాన వాటిక అభివృద్ధి
- పర్చూరువాసుల చొరవతో పనులకు శ్రీకారం
- నాడు అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి
- నేడు అన్ని సౌకర్యాలతో సిద్ధమవుతున్న వైనం


శ్మశాన వాటికలో రూపుదిద్దుకుంటున్న రెండు దహన వాటికలు

పర్చూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పర్చూరులో హిందూ శ్మశాన వాటిక రెండెకరాల విస్తీర్ణంలో నిండా చిల్లచెట్లు ముళ్లపొదలతో ఏడాది క్రితం వరకూ అడవిలా ఉండేది. వర్షం పడితే ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచి ఉండేది. అడుగుతీసి అడుగు వేసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో 'డంపింగ్ యార్డులా హిందూ శ్మశాన వాటిక' శీర్షికన గతేడాది నవంబరు 14న ప్రచురించిన కథనం స్థానికులను ఆలోచింపజేసింది. దీంతో పలువురు దాతలు మందుకు వచ్చారు. శ్మశాన అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. రూ.కోటి వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. దాదాపుగా పనులు పూర్తయ్యాయి. జనవరి 12న ఈ శ్మశాన వాటికను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● పూర్తిచేసుకున్న నిర్మాణాలు ఇవే..

ఈ శ్మశానంలో రెండు దహనవాటికలు పూర్తి చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మించారు. అంతర్గత రహదారులు ఏర్పాటు చేశారు. దీంతోపాటు లోపల ఉద్యానవనం, నీటి వసతి ఏర్పాటు చేశారు. ఇక క్షౌరశాల, ఇతర నిర్మాణాలు పూర్తి చేశారు. నియోజకవర్గ కేంద్రమైన పర్చూరులో భవిష్యత్తు అవసరాలకు తగిన రీతిలో నిర్మాణాలు పూర్తి చేశారు. ఇప్పటికే దాతలు చేకూర్చిన ఫ్రీజర్లనూ, మృతదేహాలను తరలించేందుకు మహాప్రస్థాన రథాన్నీ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. సొంత ఇల్లు లేనివారి కోసం కూడా వసతిగృహం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తద్వారా పర్చూరులో ప్రతి వ్యక్తి ఆఖరి మజిలీ కనీస గౌరవంతో చేసేలా దాతలు పనులు పూర్తి చేస్తుండడం ఇందుకు నిదర్శనం.


అంతర్గత రోడ్డుతో శ్మశాన వాటిక

కమిటీ ద్వారా అభివృద్ధి పనులు

సరిగ్గా ఏడాది క్రితం పర్చూరుకు చెందిన కఠారి రమేష్ నాయుడు డిప్యూటీ కలెక్టర్ హోదాలో అభివృద్ధికి ముందడుగు వేశారు. ఆయన సొంత నిధులతో తన తండ్రి కఠారి శ్రీకృష్ణ జ్ఞాపకార్థంగా అభివృద్ధి పనులకు నాంది పలికారు. ఆయన ఒక దహన వాటిక, శ్మశానం ప్రహరి, మహాప్రస్థానం ఆర్చ్, ఇతర నిర్మాణాలు చేపట్టారు. ఆయనతోపాటు గ్రామానికి కఠారి సురేంద్రబాబు, శ్రీనివాసబాబు తన తల్లిదండ్రులు ఆంజనేయులు, లక్ష్మీ ఆంజనేయమ్మ జ్ఞాపకార్థంగా రూ.10 లక్షలు విలువచేసే మరో దహనవాటిక ఏర్పాటు చేయటంతోపాటు, శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలను సమీకరించారు. ప్రముఖ వ్యాపారవేత్త నర్రా వెంకట్ రూ.10లక్షల వ్యయంతో పిండ ప్రదాన భవనానికి సహకారం అందించారు. గతంలో పర్చూరు ప్రాంతంలో న్యాయవాదిగా విధులు నిర్వహించి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నివాసం ఉంటున్న పల్లా గిరిజారాయుడు తన భర్త జ్ఞాపకార్థం రూ.10 లక్షల ఆర్థిక సహకారం అందించి పుణ్యస్త్రీ భవన నిర్మాణం చేపట్టి దాతృత్వం చాటుకున్నారు. ఈ క్రమంలోనే గ్రామస్థులు కమిటీగా ఏర్పాటై పూర్తిస్థాయిలో శ్మశానవాటికను అభివృద్ధి చేసేలా ముందుకు సాగారు. వీరిలో కఠారి సురేంద్రబాబు, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, మంగళగిరి కోటేశ్వరరావు, ఒగ్గిశెట్టి నరసింహారావు, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు తదితరులు కలిసికట్టుగా అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో పలువురు ప్రవాస గ్రామస్థులు సైతం విరాళాలు అందించి అభివృద్ధిలో భాగస్వాములు అయ్యారు. స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తనవంతు సహకారం అందించారు. శ్మశానికి వెళ్లే ప్రధాన రహదారికి నిధులు మంజూరు చేయించి నూతన హంగులకు స్వీకారం చుట్టారు.

అభివృద్ధిలో ప్రజల సహకారం హర్షణీయం



ప్రజల సహకారం ఉంటే గ్రామాభివృద్ధి సాధ్యం అనటానికి పర్చూరులో కోటి రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టిన హిందూ శ్మశాన వాటికే నిదర్శనం. గ్రామంపై ఉన్న మమకారంతో ఉద్యోగ వ్యాపారాల రీత్య ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారుసైతం ఆర్థిక సహకారం అందింటం వల్లే కనీస వసతులు లేక ఇబ్బందులు పడుతున్న శ్మశాన వాటిక సకల వసతులతో రూపుదిద్దుకుంది. **- గోవిందరాజులు, సీనియర్ న్యాయవాది**

కలిసికట్టుగా అభివృద్ధికి కృషి



ప్రభుత్వంతోపాటు, ప్రజల సహకారం ఉంటే గ్రామాలు మరింతగా అభివృద్ధి చెందుతాయనటానికి పర్చూరు ప్రాంతంలో గ్రామస్థులు చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలే నిదర్శనం. గ్రామస్థులు కలిసి కట్టుగా శ్మశాన వాటిక అభివృద్ధికి శ్రీకారం చుట్టడం అభినందనీయం. గతంలో దహన సంస్కారాలు నిర్వహించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉండేది.

- మురళీకృష్ణ, రాష్ట్ర సచివాయం ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు


శనగ పైరు (ఫైల్)

పంటల బీమా.. రైతుకు ధీమా

- కరువుతో పాటు విపత్తుల్లోనూ ఉపయోగం
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేపటితో ముగియనున్న దరఖాస్తు గడువు వరికి నెలాఖరు దాకా..



పీసీపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పేరుతో రైతులు సాగుచేసిన పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి ఈ పథకాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పథకంలో లబ్ధిపొందేందుకు సీఎస్‌సీ సెంటర్లు, మీసేవ పోర్టల్‌లలో ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు రైతులు సాగుచేసిన పంటలకు వాటాగా కింద కొంత నగదును చెల్లించి బీమా నమోదు చేయించుకోవాలి.

పథకంలో ప్రధాన అంశాలు

ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనలో రబీ సీజన్‌లో సాగుచేసిన ఆహార, నూనెగింజలైన శనగలు, మినుములు, మొక్కజొన్న, వరి, ఎండు మిరప, జొన్న పంటలన్నింటికీ ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ధర చెల్లించి బీమా చేయించుకోవాలి. అయితే పంట సాగుచేసిన తరువాత బీమా చేయించుకునేందుకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదై ఉండాలి. అవసరమైన పత్రాలు జతపరుస్తూ ప్రభుత్వం అనుమతించిన మీసేవ, సీఈసీ కేంద్రాల ద్వారా ఈ పథకంలో ఐచ్ఛికంగా చేరొచ్చు.

బీమా పొందేదిలా..

ప్రకృతి విపత్తుల వల్ల, చీడపీడలు, ఈదురుగాలుల వల్ల పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన జిల్లా, మండల, గ్రామాల యూనిట్ ప్రాతిపదికన బీమా చేయించుకున్న రైతులకు నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుంది. బీమా కోసం ఎంపిక చేసిన పంటలకు బ్యాంకుల నుంచి రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంకులు కూడా రైతులకు బీమాను నమోదు చేస్తున్నాయి. రుణాలు తీసుకోని రైతులు, కౌలు రైతులు ఫసల్‌బీమా చేసుకోవాలంటే దరఖాస్తు పూర్తిచేసి సంబంధిత పత్రాల ద్వారా సీఈసీలలో బీమా చేయించుకోవాలి.

పంట కోతల తర్వాత

పంట కోతల తర్వాత పొలంలో ఆరబెట్టిన పంటలకు వర్షాలు, తుఫాను, అకాల వర్షాల వల్ల పంటనష్టం జరిగినప్పుడు అంచనా వేసిన అధికారుల అంచనా మేరకు రైతులకు నష్టపరిహారం అందిస్తారు.

ఫసల్ బీమా ఎంతో ప్రయోజనం



కొన్నేళ్లుగా పంటల సాగులో ఒడిదుడుకులు ఎదురై నష్టపోతున్నాం. ఈ తరుణంలో ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. గత ప్రభుత్వ చర్యల వల్ల బీమా పొందలేక తీవ్రంగా నష్టపోయాం. ప్రస్తుతం ఫసల్‌బీమాపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రబీలో సాగుచేసిన మినుము తదితర పంటలకు బీమా చేయించాను.

- మూలె బుజ్జిరెడ్డి, రైతు, మూలెవారిపల్లి

అవగాహన అవసరం



2016లో ఈ పథకం వచ్చినా సరైన అవగాహన లేని కారణంగా ఇంకా చాలామంది రైతులు బీమా చేయించుకోలేదు. ప్రస్తుతం అధికారులు అవగాహన కల్పిస్తున్నా బీమా చేయించుకునేందుకు మరో 2రోజులే గడువు ఉందంటున్నారు. ఈ నెలాఖరు వరకైనా గడువును పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

-వేమూరి తిరుపతయ్య, రైతు, కమ్మవారిపల్లి

ప్రతి రైతూ బీమా చేయించాలి



పంటలు సాగుచేసిన ప్రతి రైతూ ఫసల్‌బీమా నమోదు చేయించుకోవాలి. ఈ బీమా రైతులకు ఎంతో ఉపయోగకరం. వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గినప్పుడు బీమా పొందవచ్చు.

కె.ప్రకాశరావు, ఎఓ, పీసీపల్లి

ఎకరానికి బీమా వివరాలు

పంట	రైతువాటా	ప్రీమియం(రూ.)	బీమా (రూ.)
శనగలు	1.15%	368	32,000
మినుములు	0.50%	103	20,500
మొక్కజొన్న	0.30%	105	35,000
వరి	0.40%	215	43,000
ఎండుమిర్చి	0.50%	525	1,05000
జొన్న	0.30%	60	19,800



సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యం ఖూనీ

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- చీమకుర్తిలో కదంతొక్కిన కామ్రేడ్స్
- పార్టీ జిల్లా మహాసభలు ప్రారంభం

చీమకుర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జమిలి ఎన్నికల నిర్వహణతో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యే ప్రమాదం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. ఆ పార్టీ జిల్లా మహాసభలు శుక్రవారం చీమకుర్తిలో ప్రారంభమయ్యాయి. ముందుగా పట్టణంలో నిర్వహించిన భారీ ప్రదర్శనలో పాల్గొన్న శ్రేణులతో గెలాక్సీపురం ఎరుపెక్కింది. మహిళల కోలాట ప్రదర్శన, డప్పు కళాకారుల విన్యాసాలు ప్రదర్శనలో హైలెట్‌గా నిలిచాయి. సమావేశానికి హాజరైన ముఖ్యనాయకులు ప్రదర్శనలో అగ్రభాగాన నిలిచారు. తదుపరి బీవీఎస్‌ఆర్ కల్యాణమండపంలో జరిగిన సభకు జిల్లా కార్యదర్శి ఎస్‌డీ హనీఫ్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర పభుత్వం చేపట్టిన జమిలి ఎన్నికల విధానంపై విరుచుకుపడ్డారు. దేశంలో అధ్యక్ష తరహా పాలనను తెచ్చే యోచనలో ప్రధాని మోదీ ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అదానీకి దోచిపెట్టడం ద్వారా అదానీప్రదేశ్‌గా మార్చి వేస్తున్నారని విమర్శించారు. మోదీ మాయల మరాఠి అని, గత పదేళ్లగా చెప్పిన ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చలేదని అన్నారు. మెగా డీఎస్సీపై తొలిసంతకం చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆరునెలలైనా ఫైల్ ముందుకు కదలకపోవటం నిరుద్యోగులను మోసం చేయటమేనని ఆయన ఆరోపించారు. స్మార్ట్‌మీటర్ల విషయంలో వైసీపీ బాటలోనే కూటమి ప్రభుత్వం కూడా నడుచుకోవటం దారుణమన్నారు. జమిలి ఎన్నికలకు టీడీపీ, వైసీపీ మద్దతు నిరాకరించాలని కోరారు. వెలుగొండకు అరకొర నిధులు కేటాయించటం వల్ల ఎప్పటికి పూర్తవతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అసమానతలు లేని సమాజం కోసం సీపీఎం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పట్టణంలో సీపీఎం శ్రేణుల ప్రదర్శన

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

- అన్ని చోట్లా తెలుగుదేశం వర్గీయులే
- అల్లూరులో పోటీకి సై అని వెనక్కి తగ్గిన వైసీపీ

కొత్తపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం మండలంలోని అన్ని సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. ఈ దిశగా తెలుగుదేశం పార్టీ నేతలు నడిపిన మంత్రాంగం ఫలించింది. కొన్నిచోట్ల పోటీకి తొలుత సై అన్న వైసీపీ నేతలు తీరా ఎన్నికలు ముందు రోజు వచ్చే సరికి కాడి కింద పడేశారు. దీంతో మండలంలోని అన్ని మేజర్, మైనర్ సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. ఇప్పటి వరకు అల్లూరు చాపాయి, చక్రాయి చెరువు సాగునీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైసీపీ నేతలు సిద్ధమయ్యారు. దీంతో టీడీపీ నాయకులు, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో పలుమార్లు చర్చలు జరిపారు. తీరా శనివారం ఎన్నికలు జరగనుండగా శుక్రవారం వైసీపీ నేతలు పోటీ నుంచి తప్పుకుంటున్నట్లుగా తెలుగుదేశం నేతలకు సమాచారం అందింది. అల్లూరు సాగనీటి సంఘం చైర్మన్‌గా టీడీపీ గ్రామ మాజీ అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరెడ్డి పేరును నాయకులు ఖరారు చేశారు. కొత్తపట్నం ఆల్లూరు సాగునీటి సంఘం చైర్మన్‌గా బంకా వెంకయ్య పేరును తెరపైకి తెచ్చారు. బంకా వెంకయ్య టీడీపీ జిల్లా నాయకుడు గేనం సుబ్బారావుకు సమీప బంధువు. ఇక పాదర్తి చెరువు సాగునీటి సంఘం చైర్మన్‌గా మూగ పోలురాజు పేరును టీడీపీ నేతలు ఖరారు చేశారు. ఆలూరు మేజర్ సాగునీటి సంఘం చైర్మన్‌గా కనుముది పుల్లారెడ్డిని ఎన్నుకోనున్నారు. ఈతముక్కల సాగునీటి సంఘం-1 , ఈతముక్కల సాగునీటి సంఘం-2 సంఘాలకు శుక్రవారం రాత్రి వరకు చైర్మన్ అభ్యర్థుల ఎంపికలో తలమునకలై ఉన్నారు. శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైసీపీ పోటీ నుంచి దాదాపు తప్పుకున్నట్లు కనిపిస్తోంది. దీంతో మండలంలోని అన్ని సాగునీటి సంఘాల చెరువుల చైర్మన్లు, డైరెక్టర్లు తెలుగుదేశం వర్గీయులే ఎన్నిక అయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

హత్య కేసులో అనూహ్య ట్విస్ట్

- ప్రియురాలి మర్డర్ కేసులో ప్రియుడి అరెస్టు
- ఆమె భర్త హత్యలోనూ అతనే నిందితుడు
- విచారణలో విస్తుగొలిపే విషయం వెలుగులోకి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో విచారణ చేస్తున్న పోలీసులకు గతంలో చేసిన పాత హత్య వెలుగులోకి వచ్చింది. చివరకు రెండు హత్యల్లో నిందితుడు ఆటోడ్రైవర్ అని తేలిన ఉదంతమిది. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య అదే ప్రియుడి చేతిలో హతమైన విషాదాంతమిది. పట్టణంలోని ఒక రెడీమేడ్ దుకాణంలో పనిచేస్తున్న పి.సుభాషిని (24) ఈనెల 6వ తేదీన హత్యకు గురైంది. రజక వీధిలో నివాసం ఉంటున్న సుభాషిణీని రాచర్లకు చెందిన ఆటోడ్రైవర్ శ్రీకర్ అలియాస్ నాని (24) కూరగాయలు కోసే కత్తితో సుభాషిని మెడపై దాడి చేశాడు. తప్పించుకోబోయిన సుభాషిణి చాతి, వీపుపై పొడిచాడు. రక్తపు మడుగులో ఉన్న ఆమెను ప్రాథమిక చికిత్స అనంతరం మార్కాపురం తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందింది. ఈ కేసులో నిందితుడైన శ్రీకర్‌ను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా సుభాషిణి భర్త హత్య వెలుగులోకి రావడంతో పోలీసులు నివ్వెరపోయారు. చివరకు సుభాషిణి భర్త బాలకృష్ణ హత్య కేసులో, సుభాషిణి హత్య కేసులో శ్రీకర్ నిందితుడుగా తేలడంతో పోలీసులు అరెస్టు చేశారు.

మొదట స్నేహితులు..ఆపై ప్రేమికులు

రాచర్లకు చెందిన సుభాషిణి, శ్రీకర్ ఒకే స్కూలులో 10వ తరగతి వరకు కలిసి చదువుకున్నారు. సుభాషిణీకి బాలకృష్ణతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న శ్రీకర్‌కు, పాత స్నేహితురాలు సుభాషిణీకి మధ్య మళ్లీ పరిచయం పెరిగింది. ఈ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. బాలకృష్ణకు విషయం తెలిసి సుభాషిణీపై అనుమానం పెంచుకున్నాడు. మద్యానికి అలవాటుపడి తరచూ ఆమెను కొట్టేవాడు. ఎలాగైనా బాలకృష్ణను అడ్డు తొలగించుకోవాలని భార్య, ప్రియుడు శ్రీకర్ కలిసి కుట్ర పన్నారు. గత ఏడాది ఏప్రిల్ 4వ తేదీన మద్యం తాగి ఇంటికి వచ్చిన బాలకృష్ణకు భార్య సుభాషిణి మజ్జిగలో నిద్ర మాత్రలు కలిపి ఇచ్చింది. బాలకృష్ణ మత్తులో ఉన్న సమయంలో ప్రియుడు శ్రీకర్‌ను ఇంటికి పిలిపించి ఊపిరాడకుండా గుడ్డతో ముఖంపై ఒత్తడంతో బాలకృష్ణ మృతిచెందాడు. అనంతరం ప్లాస్టిక్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించారు. దాంతో అందరూ బాలకృష్ణది ఆత్మహత్యగానే భావించారు. భర్త మరణం తరువాత సుభాషిణి తన పిల్లలను తల్లిదండ్రుల వద్ద ఉంచి ప్రియుడు శ్రీకర్‌తో కలిసి హైదరాబాద్ వెళ్లి కొంతకాలం సహజీవనం చేసింది. తరువాత సుభాషిణి మరొకరితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండగా ప్రియుడు శ్రీకర్‌తో గొడవలు మొదలయ్యాయి. సుభాషిణి శ్రీకర్‌ను అక్కడే వదిలి తల్లిదండ్రుల వద్ద ఉన్న తన పిల్లలను తీసుకుని గిద్దలూరులోని రజక వీధిలో నివాసం ఉంటూ ఒక షాపులో గుమస్తాగా పని చేస్తోంది. అయితే శ్రీకర్ సుభాషిణిపై ఉన్న ప్రేమను వదులుకోలేక ఆమెను కలవాలని ఎంత ప్రయత్నించినా కుదరలేదు. దీంతో ఆమె మరొకరితో వివాహేతర సంబంధం నెరపుతున్నదన్న అనుమానంతో ఈనెల 6వ తేదీన కూరగాయలు కోసే కత్తితో సుభాషిణిపై దాడి చేసి హత్య చేశాడు. ఈ విషయాన్ని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇందుకు సంబంధించి సుభాషిణి హత్య కేసులో నిందితుడైన శ్రీకర్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఆమె హత్య కేసును విచారిస్తుండగా ఆమె భర్త కూడా గతంలో హత్యకు గురైన విషయం వెల్లడైందని, మంచి మార్గం వైపు కాకుండా అక్రమ మార్గాల వైపు వెళితే చివరకు సుభాషిణి పిల్లలు అనాథలు మారాల్సి వచ్చిందని అన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ నాగరాజు



రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి



అధ్వానంగా ఉన్న రోడ్డు మార్జిను



ప్రమాదకరంగా ఉన్న రోడ్డు అంచు

గుంతలు బాబోయ్..!

కిమ్స్ సమీపంలోని హైవేపై గోతులు

ప్రతిరోజూ ప్రమాదాలు

వాహనదారుల భయాందోళన

ఒంగోలు నగరం కిమ్స్ వైద్యశాల సమీపంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఉత్తరంగా ఉన్న హైవే రోడ్డులో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో సుమారు అడుగులోతు గుంతలు ఉండటంతో వాహనదారులు ప్రతిరోజు ప్రమాదాల బారినపడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఇక రాత్రుల సమయంలో ఈప్రాంతంలో వీధిదీపాలు లేక పోవటంతో చీకట్లో వాహనదారులు పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

50మంది పేస్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు విద్య, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈసీఈ, ట్రిపుల్‌ఈ, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు చెన్నయ్‌కు చెందిన కేవైబీ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ సందర్భంగా 350 మంది విద్యార్థులు హాజరు కాగా ఆన్‌లైన్ టెస్టు, ముఖాముఖీ ఇంటర్వ్యూలు నిర్వహించి 50 మందిని గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీలుగా ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు రూ.2.40లక్షల వార్షిక వేతనం ఇస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఏటా సాఫ్ట్‌వేర్ కంపెనీలతో పాటు కోర్ కంపెనీల్లో కూడా ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ రూప అక్కేష్, సీవీ.సుబ్బారావు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

నాగులుప్పలపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జేబీరాణి సూచించారు. శుక్రవారం కనపర్తి గ్రామంలో జరిగిన రెవెన్యూసదస్సులో ఆమె రైతులు ఎదుర్కొటున్న సమస్యలను అర్జీల రూపంలో అందించాలని కోరారు. రెవెన్యూ సమస్యలపై 19 అర్జీలు అందించారని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ వాసుదేవరావు, ఆర్ఐ రమేష్, వీఆర్వో భాగ్యారావు పాల్గొన్నారు. అనంతరం శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలపై తన కార్యాలయంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఉచితంగా పశుగ్రాస విత్తనాలు : జేడీఏ



పశుగణనను పరిశీలిస్తున్న జేడీఏ బేబీరాణి

నాగులుప్పలపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు ఉచితంగా పశుగ్రాస విత్తనాలు అందిస్తున్నట్లు జేడీఏ బేబీరాణి సూచించారు. కనపర్తి గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా నూరు శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రాసం పశువులకు అందించడం ద్వారా మినరల్స్, విటమిన్లు పుష్కలంగా అంది తద్వారా పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఒక్కో రైతు వ్యక్తిగతంగా 10-50 సెంట్ల దాకా పశుగ్రాసం సాగుచేసుకోవచ్చని సూచించారు. తగిన ధ్రువపత్రాలతో గ్రామాల్లోని మీసేవా, పశువైద్యకేంద్రాలలో సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పశుగణన, గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఘనంగా క్రీడా వార్షికోత్సవం



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న అతిథులు

ఒంగోలుకార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐకాన్ గ్లోబల్ స్కూలు వార్షిక క్రీడా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక సుజాతనగర్‌లోని స్కూలులో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కాపా చిరంజీవి అధ్యక్షత వహించగా, అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కుర్రా భాస్కర్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఒలంపిక్ జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడా స్ఫూర్తి భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాల సాధనకు దోహద పడుతుందని చెప్పారు. అదేవిధంగా శరీరక దారుఢ్యం, మానిక ఉల్లాసం, ఆరోగ్యం, చురుకైన మనస్తత్వం అలవడతాయన్నారు. గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించడమే నిజమైన విజయం అన్నారు. అనంతరం ఖోఖో, బాస్కెట్‌బాల్, స్కేటింగ్, చెస్, పరుగుపందెం పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కాగా శనివారం ముగింపు పోటీలు జరుగుతాయని, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు ఎం.గిరిధర్‌బాబు చేతులమీదగా బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని ప్రిన్సిపాల్ చిరంజీవి తెలిపారు.

'అరవింద'లో కోత, కుట్టు లేని ఆపరేషన్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అరవింద హాస్పిటల్‌లో ఉదర సంబంధమైన వ్యాధులకు కోత, కుట్టులేని ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ నరేంద్ర వివరించారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 35 ఏళ్ల యువకుడు విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతూ అరవింద హాస్పిటల్‌లో వైద్యం కోసం వచ్చేసినట్లు తెలిపారు. దీంతో వైద్యపరీక్షలు చేయగా పాంక్రియాసిస్‌లో చీముపట్టినట్లు గుర్తించామని, దీంతో అధునాతనమైన ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ ఉపయోగించిన కుట్లు, కోత లేకుండా ఆపరేషన్ చేసినట్లు వివరించారు. దీంతో ప్రస్తుతం బాధితుడు ఆరోగ్యం బాగుపడి సంతోషంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో వైద్యులు వెంకటేష్, బ్రహ్మేశ్వరరావు, భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

రేపు పొట్టి శ్రీరాములు వర్ధంతి

ఒంగోలు నగరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఎ.అంజల శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూమ్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు హాజరుకావాలని ఆమె కోరారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

ఏడాది పాటు వీధి కుక్కలకు కు.ని. ఆపరేషన్లు

● కమిషనర్ వెంకటేశ్వరరావు



కుక్కలను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధి కుక్కల నియంత్రణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కొత్తమామిడిపాలెంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధికుక్కల సంరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందుకోసం అనుభవం కలిగిన పశువైద్యుల ఆధ్వర్యంలో ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో మొత్తం 4,600 వీధి కుక్కలను గుర్తించగా, ఇప్పటి వరకు 472 కుక్కలకు ఆపరేషన్లు చేసినట్లు వెల్లడించారు. గత నెల 15వ తేదీ నుంచి మొదలైన ఈ ప్రక్రియ ఏడాది కాలం పాటు సాగుతుందన్నారు. అలాగే వీధి కుక్కలను అదుపులోకి తీసుకునేటప్పుడు స్థానికుల నుంచి కొంత అభ్యంతరాలు ఎదురవుతున్నాయని, కుక్కలను ఎక్కడ పట్టుకుంటారో ఆపరేషన్ తర్వాత తిరిగి అదే ప్రాంతంలో విడిచిపెడతాయని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ బాబ్జి, పశువైద్య అధికారి డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

నేడు 37 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక లాంఛనమే

ఏకగ్రీవం చేయడంలో అధికార పార్టీ నేతలు సఫలీకృతం

కొండపి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న 37 సాగునీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నిక జరుగుతోంది. అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటిలో కొండపి మండలంలో 6, మర్రిపూడి మండలంలో 13, పొన్నలూరు మండలంలో 5, టంగుటూరు మండలంలో 3, జరుగుమల్లి మండలంలో 3, సింగరాయకొండ మండలంలో 7 సాగు నీటి చెరువులు ఉన్నాయి. మీడియం ప్రాజెక్టుగా ఉన్న పీబీ చానెల్ పరిధిలో జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట, సింగరాయకొండ మండలంలోని సోమరాజుపల్లి-1, పాకల-1, పాకల-2, బింగినపల్లి డబ్ల్యూయూఏలకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ చెరువుల కమిటీ అధ్యక్షులలో నుంచి పీబీ చానెల్ ప్రాజెక్టుకు ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకోవాల్సి ఉంది. ఇప్పటికే అన్ని చెరువుల ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎవరనేది అధికార పార్టీ నాయకులు ఏకాభిప్రాయంతో ఎంపిక చేశారని తెలిసింది. దీంతో ఎన్నిక లాంఛనప్రాయమేనని తెలిసింది. ఈక్రమంలో ఇందుకు సంబంధించి తగిన ఏర్పాట్లను చేశారు.

విదేశీ ఉద్యోగ ఏజెన్సీల పర్యవేక్షణపై మాగుంట ప్రశ్న

● కేంద్రమంత్రి వివరణ



నివాళులర్పిస్తున్న మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విదేశాలలో భారతీయులను పనుల్లో నియమించేందుకు దేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విదేశీ ఉద్యోగ నియామక ఏజెన్సీల పర్యవేక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర విదేశీవ్యవహారాలశాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్ సమాధానం ఇస్తూ విదేశాల్లో భారతీయులను పనులలో నియమించేందుకు దేశంలో 2,164 ఏజెన్సీలు నమోదు కాగా ఆంధ్రప్రదేశ్‌లో 35 ఏజెన్సీలు ఉన్నట్లు తెలిపారు. వాటి నియంత్రించేందుకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను ఇస్తున్నట్లు చెప్పారు. వలస చట్టం-1983 ప్రకారం చెల్లుబాటు అయిన సర్టిఫికెట్లు లేకుండా ఏ ఏజెన్సీ కూడా పనిచేయకూడదన్నారు. ఏదైనా ఫిర్యాదు వచ్చిన వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేస్తున్నామని, అందుకు ఏజెన్సీలు స్పందించకపోతే లైసెన్సులను కూడా రద్దు లేదా తాత్కాలికంగా 30 రోజుల పాటు నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని దేశాల చట్టాలను, మార్గదర్శకాలను విదేశీ ఉద్యోగులకు తెలియజేస్తున్నాయన్నారు. భావి వలసదారుల సంక్షేమానికి కేంద్రప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఏ ఏజెన్సీ కూడా నిర్ణయించిన దాని కంటే ఎక్కువ సర్వీసు చార్జీలు వసూలు చేయకూడదని, కనీస వేతనాలను ప్రభుత్వం నిర్ణయిస్తుందని కేంద్ర మంత్రి వివరణ ఇచ్చారు.

నివాళులు

దేశ పార్లమెంట్‌పై 2001 డిసెంబరులో ఉగ్రవాదుల చేసి దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుష్పాంజలి ఘటించారు.

రెడ్డిపాలెం డొంకను పునరుద్ధరించాలి

రైల్వే ట్రాక్ కోసం దారిని అడ్డంగా తవ్విన వైనం

పొలాల్లోకి వెళుతున్న వర్షపునీరు

పంటలు సాగు చేసుకోలేక పోతున్న రైతులు

సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి



రోడ్డును తవ్విన ప్రదేశంలో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

ఒంగోలు(రూరల్), డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది రెడ్డిపాలెం నుంచి కొప్పోలు వెళ్లే డొంక రోడ్డును రైల్వే కాంట్రాక్టర్ అడ్డంగా తవ్వడం గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. రైల్వే 3వ ట్రాక్‌ను నిర్మాణాలను ఇటీవల పూర్తి చేశారు. అయితే రైల్వే ట్రాక్ తూర్పు వైపున కట్ట పక్కగా డ్రైనేజీ కాలువ నిర్మించాల్సి ఉంది. అయితే రైల్వే కాంట్రాక్టర్ డ్రైనేజీ కాలువ నిర్మించలేదు. దీంతో రైల్వే ట్రాక్ వైపు నుంచి వచ్చే వర్షపు నీరు వెళ్లేందుకు తూర్పు వైపున ఉన్న డొంక మెటల్ రోడ్డును పగలకొట్టి పొలాల్లోకి వేళ్లేలా కాలువ తవ్వకాలు చేశారు. దీంతో రైల్వే ట్రాక్ వైపు నుంచి వచ్చే వర్షపు నీరు పొలాల్లోకి వెళ్లి నిలిచిపోవడంతో మూడు నెలలు నుంచి ఎలాంటి పంటలు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీనికితోడు డొంకరోడ్డును అడ్డంగా తవ్వడంతో రైతులు పొలాలకు, కొప్పోలుకు వెళ్లలేక ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి రైల్వే ట్రాక్ పక్కగా ముదిగొండి వాగుకు కాలువ తవ్వి, డొంకరోడ్డును యథావిధిగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు

శిశుగృహ చిన్నారులను కంటికి రెప్పలా చూడాలి

● స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ హేన సుజన్



శిశువులను పరిశీలిస్తున్న పీడీ హేనసుజన్

ఒంగోలు నగరం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శిశుగృహాలో ఉన్న చిన్నారులను కంటి రెప్పలా చూడాలని స్త్రీశిశు సంక్షేమశాఖ పీడీ హేన సుజన్ సూచించారు. శుక్రవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రాజెక్టు డైరెక్టర్ హేన సుజన్ ఒంగోలులోని శిశుగృహను సందర్శించారు. ఈ సందర్భంగా శిశుగృహ సంరక్షణలో ఉన్న చిన్నారుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ శిశుగృహాలో ఉన్న శిశువులను కంటికి రెప్పలా చూడాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్యం ఏమాత్రం బాగా లేకున్నా వెంటనే ఆసుపత్రికి తరలించాలని కోరారు. చలికాలంలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా తలెత్తే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం ప్రాంగణంలో ఉన్న బాలసదన్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న ఖాళీ ప్రదేశంలో ఆకు కూరలు, కూరగాయలు సాగు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. న్యూట్రిషియన్ గార్డెన్ కింద సాగు చేసి పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు. బాలసదన్‌లోని మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బాలికలకు శానిటరీ ప్యాడ్స్‌ను అందించాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జీవిత, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటోల్లో స్కూల్ పిల్లలను తరలించవద్దు

● రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్

ఒంగోలు(క్రైం), డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఆటోల్లో స్కూల్ పిల్లలను తరలించవద్దని రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని డీటీసీ కార్యాలయంలో ఆటో డ్రైవర్లు, పాఠశాల యజమానులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీటీసీ సుశీల మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను రవాణా చేసినా, సక్రమంగా రికార్డులు లేకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారి భద్రత నియమాలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. అదే విధంగా స్కూలు బస్సులు నడిపే డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పాఠశాలలో పేరెంట్స్ కమిటీలను ఏర్పాటు చేసి వారు సూచనలను యాజమాన్యం పరిగణలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు కిరణ్‌ప్రభాకర్, రామచంద్రరావు, జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులకు కొనసాగిన శిక్షణ

టంగుటూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఎల్ఎస్‌డీజీఎస్ శిక్షణ రెండోరోజైన శుక్రవారం కూడా కొనసాగింది. ముఖ్యఅతిథిగా ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ కేశవరెడ్డి హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోకరమైన ఆంధ్రప్రదేశ్ సాధనకు పంచాయతీలే మార్గదర్శకాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవసేనకుమారి, శిక్షణ మేనేజర్ అమర్, పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలులో..

ఒంగోలు(రూరల్): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధనకు అందరూ బాధ్యతగా పనిచేయాలని ఏపీఎస్ఐఆర్‌డీపీఈఆర్ జాయింట్ డైరెక్టర్ రేగళ్ల కేశవరెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం రెండవ రోజు మండల అధికారులకు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ 2030 నాటికి అన్ని గ్రామాలు పురోభివృద్ధి సాధించాలన్నారు. ఎంపీడీవో శేషుబాబు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి జూడో జట్ల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి స్త్రీ, పురుషుల జూడో జట్లు ఎంపిక ఈనెల 15వ తేదీన ఒంగోలులోని 1వ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్దగల యోగా సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు జూడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున 13 సంవత్సరాలు వయస్సు పైబడిన క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, స్టడీ సర్టిఫికేకెతో హాజరుకావాలని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో గెలుపొందిన వారు ఈనెల 20వ తేదీ నుంచి విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు సెల్: 9398817676, 9948877412 ద్వారా సంప్రదించాలని కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



సభలో పాల్గొన్న అధికారులు

మద్దిపాడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ సృజన్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మల్లవరంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శ్రీవారి వనం కమిటీ సభ్యులు మాట్లాడుతూ మల్లవరం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ అవసరాల నిమిత్తం భూమిని కేటాయించాలని కోరారు. దీనిపై డీటీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఎంపీటీసీ బోయపాటి వీరాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో పేదలకు రేషన్‌కార్డులు చాలామందికి లేవని, వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మార్నేని రాఘవరావు, సర్పంచ్ సుబ్బారెడ్డి, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో దీపక్, మార్నేని బసవయ్య, మార్నేని సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.

రేపు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం

ఒంగోలు కార్పొరేషన్, డిసెబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈనెల 15వ తేదీన ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్స్ యూనిట్ హెడ్ డాక్టర్ నల్లూరి నితిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో గుండె, మెదడు, నరాలు, పక్షవాతం, షుగర్, థైరాయిడ్, రక్తపోటు వంటి వ్యాధులకు నిష్ణాతులైన వైద్యులు పోతినేని రమేష్‌బాబు, సెంథిల్ కుమార్, రాజా, కృష్ణమోహన్, సందీప్, జయరాం పాయ్, కుమారవేలు, పెంచల సుధీర్‌రెడ్డి, కొల్లా భారతి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. అలాగే ఈ శిబిరంలో బీపీ, బీఎంఐ, షుగర్, ఈసీజీ, గుండె స్కానింగ్, ఊపిరితిత్తుల సామర్థ్యం పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. వైద్యశిబిరానికి హాజరయ్యేవారు ముందస్తుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాలని, అలాగే తమ పాత రిపోర్టులు, యాంజియోగ్రామ్ సీడీలను వెంట తెచ్చుకోవాలని, వివరాల కోసం 08592-286777 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికకు విశేష స్పందన లభించింది. శుక్రవారం ఒంగోలులోని మినీ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వివిధ విభాగాలలో జరిగిన ఎంపిక పోటీల్లో ఎస్‌కే.ఆసీఫ్, పి.రమేష్, బి.ఏడుకొండలు, పి.కిషోర్. డి.గణేష్, కె.వంశీకృష్ణ, ఐ.జశ్వంత్, ఎ.రామస్వామి విజేతలుగా నిలిచారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20వ తేదీలలో కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగే 8వ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని కోచ్ పాణ్యం వేణు తెలిపారు.

18లోపు నకళ్లను అందజేయాలి

● డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల పేరు, అడ్రసు మార్పు చేయాల్సి ఉంటే ఈనెల 18వ తేదీలోపు సంబంధిత నకలు పత్రాలతో ప్రధానోపాధ్యాయులు అందజేయాలని డీఈవో కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అందుకు సంబంధించిన పూర్తి నకలపత్రాలతో లేఖను జత చేసి ఒంగోలులోని పరీక్షల విభాగంలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

రేపు ఒయాసిస్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని అంజయ్య రోడ్‌లోగల ఒయాసిస్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సంతానోత్పత్తి కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ యామిని చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ శిబిరంలో మహిళలకు సంతాన సమస్యలపై వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు సెల్: 9513731633 ద్వారా సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి సర్వే

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 30 గ్రామాల్లో ఈనెల 15నుంచి మూడు రోజుల పాటు ఏఎస్ఈఆర్ సర్వేను షైనంపాడు టీచర్ ట్రైనీలు నిర్వహిస్తారని డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క గ్రామంలో ఇద్దరు చొప్పున ఈ సర్వే నిర్వహిస్తారన్నారు. ఒక్కొక్క టీం గ్రామంలో ఒక పాఠశాలను, 20 గృహాలను సర్వే చేస్తారన్నారు. ఈ సర్వేబృందాలకు సర్పంచ్‌లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో 3 నుంచి 16 ఏళ్లలోపు పిల్లల పాఠశాల్లో నమోదు స్థితి, ప్రాథమిక పఠనం, గణిత పరిజ్ఞానం స్థాయిలను తెలుసుకుంటారని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెట్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న పెట్లూరు, కోయవారిపాలెం, చవటపాలెం గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జి ఏఈ హర్దీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడుతున్నదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వృద్ధులకు అండగా క్విస్ విద్యార్థులు



సరుకులను అందజేస్తున్న విద్యార్థులు

ఒంగోలు విద్య, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు దూరంగా వృద్ధాశ్రమంలో జీవనం గడుపుతున్న వృద్ధులకు క్విస్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బాసటగా నిలిచారు. స్థానిక సమత మహిళా వృద్ధుల ఆశ్రమాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులకు తమ వంతు సహాయంగా నిత్యావసరులకు అందజేశారు. మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలకు చదువుతో పాటు సామాజిక బాధ్యత పెరుగుతుందని ఎన్ఎస్ఎస్ విభాగం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మృత్యు మలుపులు

- తరచూ ప్రమాదాలు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన









ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం నుంచి హనుమాన్ జంక్షన్ వెళ్లే జాతీయ రహదారిపై ఉన్న మూలమలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. కొత్తపల్లి నుంచి జంక్షన్ వరకు సుమారు 10 మూలమలుపులు ఉన్నాయి. ఈ మూలమలుపులో 6 మూలమలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. కనీసం మూలమలుపుల వద్ద ఉన్న చెట్లను తొలగించకపోవడంతో ఎప్పుడు ఏవార్త వినాల్సి వస్తుందో తెలియడం లేదని వాహనదారుల, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అవీ..ఇవీ


ఒంగోలులో కలెక్టర్‌కు రూ. 78 వేలను విరాళంగా అందజేస్తున్న కంభం మండల మాజీసైనికులు

సాయుధ దళాల పతాక నిధికి విరాళం

కంభం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సాయుధ దళాల పతాక నిధి 2024 సంవత్సరానికి కంభం మాజీ సైనికుల సంఘం రూ. 78వేల విరాళాన్ని శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి అందజేశారు. ఈసందర్భంగా మాజీ సైనికులను కలెక్టర్ అభినందించారు. మాజీ సైనికులు మాట్లాడుతూ కంభంలో మాజీ సైనికుల కార్యాలయానికి స్థలం, గిద్దలూరులో కేంద్రీయ పాఠశాల, ఎన్‌సీసీ యూనిట్, డిఫెన్స్ వెల్ఫేర్ వెటరన్ కార్డు ఇవ్వాలని కోరారు. గత 10 సంవత్సరాలుగా రికార్డుస్థాయిలో పతాక నిధికి నిధులు సేకరిస్తున్నందుకు జెఎస్‌డబ్ల్యూవో ఎం.రజనీకుమారివారిని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎస్.వేణుగోపాల్, ఉపాధ్యక్షులు అంకయ్యగౌడ్, కార్యదర్శి పోలయ్య, ప్రసాద్, షేక్ మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ వెంకట త్రినాథ్

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

తర్లుపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రినాథ్ అన్నారు. మండలంలోని మీర్జపేటలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ భాస్కర్, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఈవోఆర్డీ సుకుమార్, దేవస్థానం ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి, వీఆర్వో మస్తాన్, రైతులు పాల్గొన్నారు.


వెంకటసుబ్బయ్యకు నివాళులు అర్పిస్తున్న మాజీ సైనికులు

వీరజవానుకు ఘనంగా నివాళి

కంభం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల మందుపాతరకు అసువులు బాసిన హవల్దార్ వరికుంట్ల వెంకటసుబ్బయ్యకు కంభం మాజీ సైనికులు శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. కంభం మాజీ సైనికుల కార్యాలయంలో వెంకటసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తన ప్రాణాలు పణంగా పెట్టి సహచరుల ప్రాణాలు కాపాడిన వెంకటసుబ్బయ్యకు కేంద్ర ప్రభుత్వం గ్యాలెంటరీ అవార్డు ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వేణుగోపాల్, పీడీ మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు అంకయ్యగౌడ్, కార్యదర్శి పోలయ్య, ప్రసాద్, పలువురు మాజీ సైనికులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడు పిచ్చయ్యను సన్మానిస్తున్న నూకసాని బాలాజీ

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

గిద్దలూరు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందిన డాక్టర్ ఎం.పిచ్చయ్యను రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న పిచ్చయ్య అవార్డుకు సరియైన వ్యక్తి అని ఒంగోలు కేటీరెస్టారెంట్‌లో నిర్వహించిన సభలో నూకసాని బాలాజీ కొనియాడారు. ఈకార్యక్రమంలో ద్రావిడదేశం పార్టీ వ్యవస్థాపకుడు కృష్ణారావు, జై కృష్ణ బీసీ సంఘం అధ్యక్షులు డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం బహిరంగకు ర్యాలీగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

సీపీఎం జిల్లా సభకు తరలిన నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో సీపీఎం జిల్లా 14వ మహాసభ సందర్భంగా మార్కాపురం పట్టణం, మండలం నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. స్థానిక పారిశ్రామిక వాడ నుంచి వివిధ వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రఫి, సోమయ్య, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు


ఎరువుల దుకాణంలో స్టాకు రికార్డులు, నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పొదిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడుఎరువుల దుకాణాలపై ఒంగోలు విజలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ తహసీల్దార్ వీఎస్ పాల్ శుక్రవారం దాడులు నిర్వహించారు. విశ్వనాథపురంలోని శ్రీకృష్ణ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, శ్రీ సాయికృష్ణ ట్రేడర్స్, హరితా సీడ్స్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో శ్రీ సాయికృష్ణ ఎరువుల షాపు గోడౌన్‌లో నిల్వలకు ఉన్న స్టాకుకు 5 టన్నులు వ్యత్యాసం ఉందని గుర్తించినట్లు తెలిపారు. దాని విలువ రూ. 2లక్షల 21వేలు ఉంటుందన్నారు. అందుకుగాను 6(ఏ) కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా స్టాకుబోర్డ్, ధరలపట్టిక చూపించనందున సెక్షన్ 6(ఏ)ఈసీ యాక్ట్ 1955 ప్రకారం షాపు యజమాని శిగారెడ్డి వెంకటేశ్వరరెడ్డిపై కలెక్టర్ కోర్టులో కేసు నమోదు చేయుటకు మండల వ్యవసాయాధికారి నిర్ధయించినట్లు తెలిపారు.శ్రీహరిత సీడ్స్‌లో పురుగుమందులకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో 48వేలరూపాయల విలువగల మందుల అమ్మకాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో అసిస్టెట్ ఎగ్జిక్యూటీవ్ చిరంజీవి, సబ్‌ఇన్‌స్పెక్టర్ జి. నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి జైన్‌లుబ్దీన్‌లు పాల్గొన్నారు. అయితే అధికారులు వస్తున్నారనే సమాచారం ముందుగానే అందడంతో పలు షాపుల యజమానులు షాపులు మూతవేశారు.

కంభంలో వీధికుక్కల స్వైర విహారం


కంభంలో విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలు

కంభం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంభం, కందులాపురం పంచాయతీలలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రెండు పంచాయతీలలోని ప్రధాన వీధులలో, జాతీయ రహదారిలో గుంపులు గుంపులుగా తిరుగుతూ ఒక దానిపై ఒకటి దాడులు చేసుకుంటుండడంతో రోడ్లపై వెళ్లే వారు తమ మీద ఎక్కడ పడి కరుస్తాయోనని హడలిపోతున్నారు. ఉదయంపూట వాకింగ్ వెళ్లేవారిని, ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తున్నాయి. వారం రోజుల్లో కందులాపురంలో పాఠశాల నుంచి ఇంటికి సైకిల్‌పై వెళుతున్న దివ్యతేజ్ అనే 6వ తరగతి విద్యార్థిని వెంబడించడంతో హడలిపోయిసైకిల్ అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. కంభంలో ఉదయం 5గంటలకు సయ్యద్ కరీముల్లా నమాజ్ చేసేందుకు మసీదుకు వెళుతుండగా రెండు కుక్కలు వెంబడించి గాయపరిచాయి. పెద్దలు, పిల్లలు, మహిళలు అనే తేడా లేకుండా రోడ్డుపైకి రావాలంటేనే కుక్కలతో హడలిపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ


సీసీ రోడ్డు వేస్తున్న కాంట్రాక్టర్

తర్లుపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లకు మహర్దశ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంతర్గత రోడ్లు, సీసీ రోడ్లు వేస్తున్నారు. మీర్జపేట, తర్లుపాడులోని కోట్ల వీధిలో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా వేసేందుకు పనులు మొదలుపెట్టారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ మహంకాలయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు దుర్గాభవాని, కాశీరెడ్డి, పిన్నిక శంకర్, కాంట్రాక్టర్‌లు కాలంగి శ్రీనివాసులు, రోశప్ప నాయకుడు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో గాయపడి గుంటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బోయలపల్లి గ్రామ సమీపంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో హైదరాబాద్‌కు చెందిన మల్లికార్జునకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆయన్ను సమీప బంధువు పోతురాజు హుటాహుటిన గుంటూరులోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ క్షతగాత్రుడు మృతిచెందాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. చౌడయ్య తెలిపారు.

రాజ్యసభ సభ్యులను కలిసిన బీసీ అధికార ప్రతినిధి


రాజ్యసభ సభ్యుడిని కలిసిన మల్లికార్జున నాయుడు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యాలయంలో రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బీద మస్తాన్‌రావు, సానా సతీష్, ఆర్. కృష్ణయ్యలను తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం అధికార ప్రతినిధి నల్లగాటి మల్లికార్జున నాయుడు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు ఎక్కువ ప్రాధ్యానత ఇస్తున్నదని అన్నారు. రాష్ట్రంలోని బీసీల సమస్యలను వారికి వివరించినట్లు ఆయన తెలిపారు.

నియోజకవర్గ పాస్టర్ల నూతన కమిటీ ఎన్నిక

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయి పాస్టర్ల నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా బరిగెల దేవయ్య, ప్రెసిడెంట్‌గా చేదూరి లక్ష్మయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా దర్శనం యోహాన్, సెక్రటరీగా బందెల పేతురు, జాయింట్ సెక్రటరీగా టి.ప్రభాకర్, ట్రెజరర్‌గా కిన్నెర దేవదానం, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

మండల కమిటీ ఏర్పాటు

ఎర్రగొండపాలెం మండల పాస్టర్ల కమిటీ గౌరవ అధ్యక్షులుగా వైదన ప్రభాకర్, ప్రెసిడెంట్‌గా మాఖం అబ్రహాం, సెక్రటరీగా కొమ్ము తిమోతి, వైస్ ప్రెసిడెంట్‌గా చేదూరి పాలంకయ్య, జాయింట్ సెక్రటరిగా యోసోబు, ట్రెజరర్‌గా అచ్చయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

బాక్సింగ్ రాష్ట్ర పోటీలకు క్రీడాకారుల ఎంపిక


బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాక్సింగ్ క్రీడాకారుల ఎంపికకు విశేష స్పందన లభించింది. శుక్రవారం ఒంగోలులోని మినీ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వివిధ విభాగాలలో జరిగిన ఎంపిక పోటీల్లో ఎస్‌కే.ఆసీఫ్, పి.రమేష్, బి.ఏడుకొండలు, పి.కిషోర్. డి.గణేష్, కె.వంశీకృష్ణ, ఐ.జశ్వంత్, ఎ.రామస్వామి విజేతలుగా నిలిచారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19, 20వ తేదీలలో కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగే 8వ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని కోచ్ పాణ్యం వేణు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ఆర్టీసీ డిపో పరిధిలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ నరసింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 9959225699 నెంబర్‌కు తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదులు తెలపాలని కోరారు.

రేపటి నుంచి ఏఎస్‌ఈఆర్ సర్వే

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని 30 గ్రామాల్లో ఈనెల 15నుంచి మూడు రోజుల పాటు ఏఎస్ఈఆర్ సర్వేను మైనంపాడు టీచర్ ట్రైనీలు నిర్వహిస్తారని డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క గ్రామంలో ఇద్దరు చొప్పున ఈ సర్వే నిర్వహిస్తారన్నారు. ఒక్కొక్క టీం గ్రామంలో ఒక పాఠశాలను, 20 గృహాలను సర్వే చేస్తారన్నారు. ఈ సర్వేబృందాలకు సర్పంచ్‌లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఈ సర్వే ద్వారా జిల్లాలో 3 నుంచి 16 ఏళ్లలోపు పిల్లల పాఠశాల్లో నమోదు స్థితి, ప్రాథమిక పఠనం, గణిత పరిజ్ఞానం స్థాయిలు తెలుసుకుంటారని ఆయన తెలిపారు.

రేపు జిల్లా జూడో జట్ల ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి స్త్రీ, పురుషుల జూడో జట్లు ఎంపిక ఈనెల 15వ తేదీన ఒంగోలులోని 1వ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్దగల యోగా సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు జూడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

16 నుంచి మండల స్థాయి అధికారులకు శిక్షణ

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బి. శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. 16,17వ తేదీలలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ, సర్వేయర్‌లకు, 18,19వ తేదీలలో వెటర్నరీ, ఇంజనీర్, డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఉద్యానవన అసిస్టెంట్, స్వచ్ఛభారత్, ఫిషనర్ అసిస్టెంట్ శాఖలకు సంబంధించి ఆయా తేదీలలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. శిక్షణ తరగతులకు ఆయా శాఖ అధికారులు, సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రేపటి నుంచి ధనుర్మాస మహోత్సవాలు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి మార్గశిర ధనుర్మాస మహోత్సవాలు ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వాహక సభ్యులు, అర్చకులు శుక్రవారం తెలిపారు. కవి, విశారద, అవధాని, విశ్రాంత అధ్యాపకులు బ్రహ్మశ్రీ దేవులపల్లి విశ్వనాథంచే ప్రతి రోజూ సాయంత్రం 6గంటల నుంచి 7గంటల వరకు మహాభారత, భగవద్గీత, రామాయణ ప్రవచనాలు ఉంటాయని తెలిపారు.సాహితీ ప్రేమికులు, ఔత్సాహికులు, ప్రజలు, ఈ మహోత్సవాలలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు

రూ.4.85 లక్షల విలువైన బంగారు, వెండి స్వాధీనం

కంభం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గత నెల 28, 29 తేదీలలో కంభం, తర్లుపాడు మండలాలలో జరిగిన దొంగతనాలలో సుమారు రూ. 4.85 లక్షల విలువైన బంగారు, వెండి నగలను స్వాధీనం చేసుకుని దొంగలను అరెస్టు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు తెలిపారు. శుక్రవారం కంభం పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 28వ తేదీ రాత్రి కంభం మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన గాలి వెంకటరావు ఇంటికి తాళం వేసి అర్ధవీడులోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇది గమనించిన మార్కాపురం మండలం భూపతిపల్లి గ్రామానికి చెందిన వెన్న ఈశ్వరరెడ్డి అనే దొంగ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని రూ. 3.22 లక్షల విలువ గల బంగారు తాళిబొట్లు సరుడు, రూ. 66,500 విలువ చేసే జత బుట్టకమ్మలు, రూ. 3,600 విలువ చేసే వెండి చైన్, కాలిమెట్టెలు దొంగిలించాడు. 29వ తేదీ తర్లుపాడు మండలం గోరుముద్దలపాడు గ్రామంలో ఓ గృహంలో రూ. 74వేల విలువ చేసే 2 బంగారు ఉంగరాలు, కమ్మలు, రూ. 14,500 విలువ చేసే పట్టీలు చోరీ చేసినట్లు డీఎస్పీ నాగరాజు తెలిపారు.

మొత్తం రూ. 4.85 లక్షల విలువ చేసే చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. డీఎస్పీతోపాటు కంభం సీఐ మల్లికార్జున రావు, ఎస్సై నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఎన్నిక బిల్లుపై హర్షం

గిద్దలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్లుకు కేంద్రం ఆమోదం తెలుపడం పట్ల బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం వలన ఖర్చు తగ్గడమే కాకుండా సమయం ఆదా అవుతుందని, అభివృద్ధి పనులు క్రమపద్ధతిలో చేసుకునేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ బిల్లు ఆమోదంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న చొరవ దేశానికి ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు.

రేపటిలోగా బీమా ప్రీమియం చెల్లించాలి

గిద్దలూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మిరప పంట సాగుచేసుకునే రైతులు పంటల బీమా పథకాన్ని ఉపయోగించుకోవాలని స్థానిక ఉద్యాన శాఖాధికారిణి విష్ణుప్రియ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరాకు 525 రూపాయల ప్రీమియాన్ని కామన్ సర్వీస్ సెంటర్లలో గాని, మీ సేవలో గాని చెల్లించి బీమా చేసుకోవాలని, ఈనెల 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. పంట నష్టపోయిన సందర్భంలో గరిష్ఠంగా రూ. 1.05 లక్షల వరకు బీమా సొమ్ము అందే అవకాశం ఉంటుందని, రైతులు వినియోగించుకోవాలని కోరారు.

నేడు 6 నీటి సంఘాలకు ఎన్నికలు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 6 నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి శనివారం ఎన్నికలు జరగనున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. ఎర్రగొండపాలెం, కొలుకుల, అమానిగుడిపాడు, గంగాపాలెం, వీరభద్రాపురం, లింగంవానిపల్లి గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతాయని తెలిపారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో సిబ్బంది ఏర్పాటు చేసి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ముఖాముఖి

స్వచ్ఛ కనిగిరిగా తీర్చిదిద్దడమే లక్ష్యం

జోసఫ్ డానియేల్, మున్సిపల్ కమిషనర్, కనిగిరి



ప్రశ్న: పారిశుధ్య సమస్యలపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: కనిగిరి పట్టణంలో పారిశుధ్య సిబ్బంది కొరత ఉంది. ప్రణాళికాబద్ధంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నాం. 20వార్డుల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తున్నాం. స్వచ్ఛ కనిగిరిగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

ప్ర: పట్టణంలో నీటి సమస్య ఉందా?

జ: గత రెండేళ్ళుగా సీపీడబ్ల్యూ స్కీం ఆగిపోయింది. రూ.20 లక్షలకు వెచ్చించి దర్శి నుంచి పైపులైన్లు, మోటర్లు వేయించి వినియోగంలోకి తెచ్చాం. ప్రస్తుతం మంచినీటి సమస్య లేదు.

ప్ర: ఆక్రమణల తొలగింపు అస్తవ్యస్తంగా చేశారని ఆరోపణలు ఉన్నాయి కదా?

జ: మున్సిపాల్టీలో ప్రధాన డ్రైనేజీలన్నీ పూడుకుపోవడంతో మురుగునీరు పారుదల లేకపోవటంతో ఆక్రమణలను తొలగించాల్సి వచ్చింది. కొంతమంది కోర్టులను ఆశ్రయించటంతో వరుస క్రమం తప్పింది. ప్రజా సమస్యల పరిష్కారం దృష్ట్యా ఆక్రమణల తొలగింపు, రోడ్డు విస్తరణలు తప్పదు.

ప్ర: ఆవులు, శునకాల బెడద ఎక్కువగా ఉందిగా?

జ: ఆవుల సంరక్షణ బాధ్యత ఆయా యజమానులదే. ఇప్పటికే వారికి హెచ్చరికలు జారీ చేశారు. గోశాలలు లేకపోవటంతో వాటిపై చర్యలు తీసుకోవటం మా పరిధిలో లేదు. శునకాల నుంచి ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యాక్సిన్ వేయించటం వరకే మున్సిపాల్టీ బాధ్యత.

దొనకొండలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుచేయాలి

దొనకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దొనకొండలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుచేయాలని సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య డిమాండ్ చేశారు. తద్వార యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపాలన్నారు. చీమకుర్తిలో జరిగే సీపీఎం 14వ జిల్లా మహాసభలకు శుక్రవారం మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుందుర్తి చిన్ననర్సింహులు, కోలా కిరణ్‌కుమార్, ఎర్రగుంట్ల ప్రభాకర్, బాలకోటయ్య, కొండా ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం

దొనకొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): దొనకొండ మండల లయన్స్ క్లబ్ నూతన కమిటీని శుక్రవారం స్థానిక రామాలయంలో రీజనల్ చైర్మన్ రామాంజనేయులు, జోనల్ చైర్మన్ జేబీ రామారావు పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లెల రామిరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ ఎం.మల్లికార్జునశర్మ, కార్యదర్శిగా కె.హనుమంతు, కోశాధికారిగా పి.రమేష్, ఉపాధ్యక్షుడిగా జె.మోహన్‌రావు, సహాయ కార్యదర్శిగా కటారు వెంకటేశ్వర్లు, పీఆర్‌వోగా హెచ్ రవి, సభ్యులను ఎన్నుకున్నారు.

రూ.11.08 లక్షలు పలికిన చేపల చెరువు వేలం

ముండ్లమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేముల చేపల చెరువుకు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. దర్శి మండలం తూర్పుచౌటపాలెంకు చెందిన ఎడమకంటి రవీంద్రారెడ్డి రూ.11.08 లక్షలకు పాడి చెరువును దక్కించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఎల్‌పీవో పద్మ మాట్లాడుతూ చేపల చెరువు ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు పెట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జల ఆదెమ్మ, ఎంపీడీవో ఆర్.జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దూబగుంటలోనే ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుచేయాలి

పామూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పామూరు మండలంల దూబగుంటలోనే ట్రిపుల్‌ఐటీని ఏర్పాటుచేయాలని డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు శంకుస్థాపన చేసినచోట నిర్మాణ పనులు చేట్టకుండా గత వైసీపీ ప్రభుత్వం ఇక్కడి నుంచి మరో ప్రాంతానికి తరలించడం దుర్మార్గమన్నారు. ఇక్కడే ట్రిపుల్‌ఐగా నిర్మాణం కోసం త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి పోరుబాట చేపడతామన్నారు. భూ సమస్యలపై జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ ఆక్రమణలు, అక్రమ ఆన్‌లైన్‌లపై దృష్టి సారించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటుచేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు చేపట్టి నిర్వాసితులకు పరిహారం చెల్లించాలన్నారు. ఈ సమస్యలపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ప్రజలపక్షాన పోరాడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు మౌలాలి, దేవరపల్లి సుబ్బారెడ్డి, సలాం సుభాని, షేక్ సాదక్‌వలి, హజరత్, పటాన్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో

భూసమస్యల పరిష్కారం

» మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి

ముండ్లమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరిస్తున్నట్టు మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మారెళ్ళలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యలపై లబ్ధిదారులు అర్జీలు ఇచ్చినట్లయితే వాటిని వెంటనే పరిష్కరించనున్నట్టు చెప్పారు. ప్రధానంగా రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్ దరఖాస్తులు, రెవెన్యూ రికార్డుల్లో తప్పుల గురించి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ కోటంరాజు, డిప్యూటీ తహసీల్దార్ ఏ.స్రవంతి, ఆర్ఐ కుమారి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సభల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు: మారెళ్ళలో అర్జీలు స్వీకరిస్తున్న మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖరరెడ్డి

నిజమైన హక్కుదారుల కోసమే సదస్సులు

పామూరు,డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిజమైన భూ హక్కుదారుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని దూబగుంట, బుక్కాపురం గ్రామాల్లో జరిగిన రెవెన్యూల సదస్సుల్లో ఆయన మాట్లాడారు. భూ సమస్యలపై వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. మ్యుటేషన్ కోసం దూబగుంటలో 19, బుక్కాపురంలో పది అర్జీలు వచ్చినట్టు తెలిపారు.

ఈసందర్భంగా భూ అక్రమాలపై విచారణ చేపట్టి వాస్తవ లబ్ధిదారులకు న్యాయం చేయాలని డీసీసీ అధ్యక్షుడు షేక్ సైదా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎం.పానకాలరావు, ఆర్ఐ బి.మల్లికార్జునరావు, వీఆర్వో వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి జి.నాగేశ్వరరావు, మండల సర్వేయర్ స్నేహ, దూబగుంట మాజీ సర్పంచ్ పోతురాజు వెంకట్రావు, బుక్కాపురం సర్పంచ్ ఎం.రాధాకృష్ణ, దైండే శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



దర్శి: రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రావణ్‌కుమార్

పీఎస్ఆర్ మూర్తి, వీఆర్‌వోలు బి.గురవయ్య, బ్రహ్మతేజ, బద్రి అయ్యపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో 3 అర్జీలు

కురిచేడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగాయపాలెంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో మూడు అర్జీలు వచ్చాయి. స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజనీ



తాళ్లూరు: అర్జీదారుడి సమస్య తెలుసుకుంటున్న అధికారులు

దర్శిలో 29 అర్జీలు

దర్శి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో సమస్యలు తక్షణమే పరిష్కార మవుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుందని తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలో బొట్లపాలెం, తూర్పువీరాయపాలెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి 29 అర్జీలు దాఖలయ్యాయి ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికశాతం అర్జీలు తక్షణమే పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. భూ వివాదాలను తక్షణమే పరిష్కరించుకునేందుకు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు

తాళ్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులకు చెందిన భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ కె.సంజీవరావు తెలిపారు. శుక్రవారం తురకపాలెంలో జరిగిన సదస్సుకు సర్పంచ్ గురవారెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూసంబంధ సమస్యలను నేరుగా గ్రామసభ దృష్టికి తీసుకువస్తే రికార్డులు పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈసందర్భంగా భూసంబంధ సమస్యలపై ఆరు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్‌వో రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ అభివృద్ధికి కృషి

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ పల్లెవనం పార్క్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం పార్క్‌ను పరిశీలించారు. అధ్వానంగా ఉన్న పార్క్‌ను చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు గోల్‌మాల్ అయిన విషయాన్ని అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లైట్లు పగులకొట్టడంతో సాయంత్రం పార్క్ తెరవటం లేదని బీట్ ఆఫీసర్ అమర తెలిపారు.



పల్లెవనం పార్క్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

అందుకు స్పందించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పోలీసు సెక్యూరిటీని తీసుకోవాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం ఒక గంట కానిస్టేబుల్‌ను అందుబాటులో ఉంచాలని పోలీసు అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బంది రెండేళ్లుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి జీతాలు అందేలా కృషి చేస్తామని డాక్టర్ లక్ష్మి భరోసా ఇచ్చారు. పార్క్ నిర్వహణను నగర పంచాయతీకి అప్పగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పార్క్‌ను అభివృద్ధి చేసి ప్రజలకు ఆనందం కల్గించే విధంగా చూస్తామన్నారు.

కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై మహేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నారపుశెట్టి మధు, పుల్లచెరువు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

» ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు

కనిగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఏపీసీపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కనిగిరిలో జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడినప్పుడు సిబ్బంది సత్వరమే స్పందించి సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. వినియోగదారుల పట్ల గౌరవభావంతో మెలగాలన్నారు. అదే సమయంలో విద్యుత్ చౌర్యం చేసే వినియోగదారులపై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఫీడర్ ట్రిప్పింగ్స్‌పై జరుగుతున్న సమస్యలను సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

నుంచి విచారించి వాటికి తగు సూచనలు, సలహాలు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు ఫెయిల్ అయితే మార్చే బదులు ఫెయిల్ కాకముందే తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ బకాయిలను వేగవంతంగా వసూలు చేయాలని ఆదేశించారు. వరుసగా మూడు దఫాలు ఆర్ఎండీ దాటిన సర్వీసులను తనిఖీ చేసి అదనపు లోడు కేసుల కింద నమోదు చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ప్రత్యేక పర్యవేక్షణతో ముందుకు సాగాలన్నారు. మారిన పరిస్థితులకు తగ్గట్టుగా సిబ్బంది పనితీరులో మార్పురాకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాగితీగ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, ఇతర సామగ్రి ఉన్నచోట నిఘా పెంచి చోరీలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం సబ్సిడీ గురించి వివరించాలన్నారు. ఈ పథకంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు.

సమావేశంలో ఈఈ వీరయ్య, డీఈఈ ఉమాకాంత్, డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు పవన్‌కుమార్, నవీన్, రసూల్, మణికంఠ, జిలాని, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం

» ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

» అధికశాతం ఏకగ్రీవమయ్యే అవకాశం?

కనిగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఇందుకుసంబంధించి అధికారులు అన్నీ ఏర్పాట్లుచేశారు. కనిగిరి నియోజకవర్గంలో 58 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కనిగిరి మండలంలోని 13 చెరువుల కింద 5,900మంది ఓటర్లు ఉన్నారు. పామూరు మండలంలోని 12 చెరువుల ఆయకట్టు కింద రైతులు దాదాపు 6,700 మంది సభ్యులుగా ఉన్నారు. సీఎస్‌పురం మండలంలో 12 చెరువుల కింద 2,100మంది, వెలిగండ్ల మండలంలో 8చెరువుల కింద 3,150 మంది, హెచ్‌ఎంపాడు మండలంలో మూడు చెరువుల కింద 1,200మంది, పీసీపల్లి మండలంలో పది చెరువుల కింద 3,400 మంది రైతులు ఓటు హక్కు కల్గి ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇరిగేషన్ చెరువులను నిర్లక్ష్యం చేయటంతో పాటు అభివృద్ధి పనులు కూడా చేపట్టలేదు. అదే సమయంలో సాగునీటి సంఘాలను కూడా నిర్వీర్యం చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం తిరిగి ఆప్రక్రియ ప్రారంభించి చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టనుంది. దాదాపు సాగునీటి సంఘాలన్నీ ఏకగ్రీవం కానున్నట్లు సమాచారం.

కురిచేడులో అన్నీ ఏర్పాట్లు

కురిచేడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. 9 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో ఆరు మేజర్ ఇరిగేషన్, మూడు మైనర్ ఇరిగేషన్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. పడమర వీరాయపాలెం సాగునీటి సంఘానికి ఎన్నికల అధికారిగా కురిచేడు తహసీల్దార్, సహాయ ఎన్నికల అధికారిగా పడమరవీరాయపాలెం సర్వేయర్‌ను నియమించారు. మిగతా సంఘాలకు కూడా ఎన్నికల అధికారులను, సహాయ ఎన్నికల అధికారులను నియమించారు.

శనివారం ఉదయం 8 గంటల నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు యాజమాన్య కమిటీని ఎన్నుకుంటారు. మండలంలోని సాగునీటి సంఘాలకు సంబంధించి దాదాపుగా ఏకగ్రీవాలు అయ్యేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని సమాచారం.

ఏర్పాట్లపై తహసీల్దార్ సమీక్ష

తాళ్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగు నీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సర్వంసిద్ధం చేశారు. తహసీల్దార్ కె.సంజీవరావు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పోలింగ్ అధికారులకు ఓటర్ లిస్టులు అందజేశారు. మండలంలో నాలుగు చెరువులు, 8 మైనర్ కాలువలకు ఎన్నికలు జరుగనున్నాయి. బొద్దికూరపాడు-1, మన్నేపల్లి-1 లక్కవరం-1, లక్కవరం-2 చెరువులకు, రజానగరండిస్ట్రిబ్యూటీకమిటీకింద గలమన్నేపల్లి-1, మన్నేపల్లి-2,తాళ్లూరు-1 మైనర్లకు, కరువది డీబీసీ కింద నాగంబొట్లపాలెం,సోమవరప్పాడు, తాళ్లూరు-2 మైనర్ కాలువలకు, బొద్దికూరపాడు-1, బొద్దికూరపాడు-2 కాలువలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఆయా టీసీ మెంబర్లకు పోటీ చేసేందుకు ఆశావహులు టీడీపీ కార్యాలయంలో కూర్చుకుని ఐకమత్యంగా సభ్యులను నిర్ణయించుకున్నారు. పోటీలో నిల్చునే వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వెళ్లి భూమిసాగు శిస్తు చెల్లించారు. అధికార పార్టీ నాయకులు అన్ని సాగు నీటి సంఘాలను ఏకగ్రీవ సాధనగా ప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ ఈ ఎన్నికలకు దూరంగా వుండటంతో స్పందన లేదు.

వైద్యం ఖర్చు భారం కాకూడదు!



బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదవారికి వైద్యం ఖర్చు భారంగా మారి అనారోగ్యంతో బాధ పడకూడదనే ప్రభుత్వం ఉద్దేశమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి కింద నగదు చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారి ఆరోగ్య పరిస్థితుల గురించి విచారించారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రవేటు ఆసుపత్రులలో చికిత్స పొందేందుకు దరఖాస్తు చేసుకున్న 8 మందికి రూ.3 లక్షల 47వేల486 మేర చెక్కులను అందజేశారు. కనిగిరి నియోజకవర్గంలో పేదవాడికి అండగా ఉండటమే తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

దర్శి సబ్ జైలును పరిశీలించిన డీఐజీ

దర్శి డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖ డీఐజీ ఎం.వరప్రసాద్ శుక్రవారం దర్శి సబ్ జైలును పరిశీలించారు. సబ్ జైలులో వసతులు, ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఖైదీలు మంచి ప్రవర్తనతో మెలిగి జనస్రవంతిలో మంచి మనుషులుగా గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. జైలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా జైళ్లశాఖ అధికారి మహమ్మద్ ఇర్ఫాన్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు



శంకరాపురంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముండ్లమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని శంకరాపురం గ్రామంలోగల కోదండ రామాలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. టీటీడీ దాన సాహిత్య ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముండ్లమూరు, తాళ్ళూరు మండలాల టీటీడీ కోఆర్డినేటర్లు జాష్టి లక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతుల నిర్వహణలో లోక కల్యాణం, గ్రామాభివృద్ధి కోసం నాలుగు రోజుల నుంచి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. పవిత్రమైన శుక్రవారం రోజున వందమంది మహిళలచే సామూహిక లక్ష్మి కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ రామిశెట్టి రవి బాబు, టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థినులను కేజీబీవీలో చేర్పించిన అధికారులు

పామూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బడి మానివేసిన నలుగురు విద్యార్థినులను అధికారులు గుర్తించి పాఠశాలలో చేర్పించారు. వెంకటాపురం ఎస్సీ కాలనీలో నలుగురిని గుర్తించారు. వీరిని ఎంఈవో కరణకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, షేక్ నాయబ్‌రసూల్ తదితరులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. విద్యార్థినులను స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చేర్పించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

దర్శి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా రికార్డుల్లో చూపిన నిల్వకు, సరుకుకు ఉన్న నిల్వకు తేడాగుర్తించి అక్రమ నిల్వలను సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ రాఘవరావు, సీటీవో రామారావు, ఏవో నాగప్రసాద్‌లు పట్టణంలోనని ఝాన్సీలక్ష్మి ఏజెన్సీస్‌లో రూ.11,500, మనికంఠ ట్రేడర్స్‌లో రూ.3,01,150 విలువ గల సరుకులను విక్రయించకుండా నిలుపుదల చేశారు. నాగార్జున ట్రేడర్స్‌లో రూ.89,100, పరమేశ్వర ఫెర్టిలైజర్స్‌లో కొన్ని సరుకులను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ మొత్తం సరుకును సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏవో బాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ కార్యాలయానికి ప్రింటర్ బహూకరణ

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ సీఎస్‌పురం మండల శాఖ కార్యాలయానికి రిటైర్డ్ ఉద్యోగి, సీఐటీయూ నాయకుడు కె.ఓబుల్‌రెడ్డి రూ.17వేలు విలువకలిగిన ప్రింటర్‌ను శుక్రవారం బహూకరించారు. ఈసందర్భంగా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ సీఐటీయూ, యూటీఎఫ్ భావసారూప్యత కలిగిన సంఘాలన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ఎనలేని కృషి చేస్తుందన్నారు. దాత ఓబుల్‌రెడ్డిని సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు నారిశెట్టి వెంకట్రామయ్య, షేక్ పాదుషా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇర్ల కొండయ్య, పాగినేని తిరుపతయ్య, డి.నాగేశ్వరరావు, జి.రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పామూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీపీవో పి.సరోజిని తెలిపారు. పామూరు మండలంలో నుచ్చుపొదలో ఆయా పోస్టు ఖాళీగా ఉందన్నారు. సీఎస్‌పురం మండలంలోని మునగలవారిపల్లిలో మినీఅంగన్‌వాడీ కార్యకర్త పోస్టు, రెడ్డిగారికొత్తపల్లిలో ఆయా పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైనవారు ఈనెల 23లోగా సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.



వివిధ పనుల నిమిత్తం సచివాలయంలో వేచివున్న మహిళలు

లోపభూయిష్టంగా సచివాలయాలు

» అందుబాటులోలేని సిబ్బంది » ఫీల్డ్ పేరుతో విధులకు డుమ్మా

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కనిగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సత్వర, మెరుగైన సేవలు అందించాల్సిన సచివాలయాల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. విధుల నిర్వహణలో అలసత్వంతో పాటు బాధ్యతారాహిత్యంగా సిబ్బంది వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫీల్డ్ వర్క్ పేరుతో ఉదయాన్నే హాజరువేసి వెళుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే దిక్కవుతున్నారు. కనిగిరి మున్సిపాల్టీ పరిధిలో 12 సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో 120 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి సచివాలయంలో పది మంది సిబ్బంది ఉన్నారు. వీరు ఆయా విభాగాలకు సంబంధించి ప్రజలకు సేవలు అందించాలి.

అయితే, ప్రతి సచివాలయంలో ఫీల్డ్ వర్క్ పేరుతో ప్రజలకు అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ (డిజిటల్ అసిస్టెంట్) ఒక్కరే కార్యాలయంలో ఉండే పరిస్థితి నెలకొంది. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలు వారికి ఫోన్ చేసి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్లాన్డ్‌గా.. ఫోకస్

- అంశాల వారీగా కలెక్టర్లకు దిశానిర్దేశం
- రెండు రోజుల సదస్సులో సూచనలు, ఆదేశాలు
- టిడ్కో ఇళ్లపై దృష్టి పెట్టాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇసుక అక్రమ తవ్వకాలు, బ్లాక్‌మార్కెటింగ్‌ని అరికట్టాలి..
- 132 ఎన్టీఆర్ టౌన్‌షిప్‌లు, మరో 5 అన్న క్యాంటీన్లకు ప్రతిపాదనలు
- పీజీఆర్‌ఎస్‌లో గుంటూరు, బాపట్ల, పల్నాడు ర్యాంక్‌లు మెరుగుపడాలని సూచన

టిడ్కో సముదాయాల్లో పెండింగ్ పనులు, లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ.. సులభ తరంగా, భారం కాకుండా, అందరికీ ఇసుక అందాలి.. రోడ్ల మరమ్మతులు.. ఎన్టీఆర్ టౌన్‌షిప్‌ల ఏర్పాటు.. మరిన్ని అన్న క్యాంటిన్లకు ప్రతిపాదనలు.. సంతృప్తి కరంగా ప్రజా సమస్యల పరిష్కారాలు.. రెవెన్యూ సదస్సులు.. ఇలా జిల్లాల ప్రాతి పదికగా ఆయా అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్లకు ముఖ్య మంత్రి చంద్రబాబుతో పాటు విభాగాధి పతులు దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల పాటు రాజధాని అమరావతి సచి వాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సు శుక్రవారం రాత్రితో ముగిసింది. ఈ సదస్సులో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేకంగా సమీక్షించారు. అభివృద్ధి.. పాలన.. ప్రజా సమస్యలు.. ఇలా అన్నింటి పైనా కలెక్టర్లకు పలు సూచనలతో పాటు ఆదేశాలు కూడా జారీ చేశారు. ఆయా అంశాల్లో సేవలు నాణ్యంగా, వేగంగా, ప్రజలు సంతృప్తి చెందేలా ఉండాలని.. అందుకు ప్రణాళికాబద్ధంగా దృష్టి సారించా లని కలెక్టర్లకు సదస్సు దిశానిర్దేశం చేసింది. ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రజల నుంచి తీసుకుంటున్న అభిప్రాయాలను కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించింది. మాతృభాషలోనే ఆదేశాలు ఇవ్వాలని, సిబ్బందికి తరచుగా ఫిర్యాదుల పరిష్కారంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి నాణ్యమైన సేవలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పీజీఆర్‌ఎస్‌లో గుంటూరు, బాపట్ల, పల్నా డు జిల్లాల ర్యాంకింగ్ మెరు గుపడాలని ప్రభుత్వం ఆదే శాలు జారీ చేసింది. మూడు జిల్లాల కలెక్టర్లు ప్రతీ సోమవారం జరిగే పీజీఆర్‌ఎస్, గ్రామసభ లు, కొద్ది రోజుల నుంచి జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న ఫిర్యాదులను విశ్లేషించుకోవాలని సూచించింది. ఇప్పటికే పూర్తయిన టిడ్కో ఇళ్లను పేదలకు అందించడం, మిగిలిన ఇళ్లను త్వరి తగతిన పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకో వాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, బ్లాక్‌మార్కెటింగ్‌ని పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు నగర, పట్టణవాసులకు ఇళ్లు నిర్మించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రెండు రోజులుగా జరిగిన కలెక్టర్ల సమావేశంలో గణాంకాలు అదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి.



పట్టణ పేదలకు ఇళ్లు ఇవ్వాలి

బాపట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదలకు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేయాలని ప్రభుత్వం రెండు రోజుల సదస్సులో కలెక్టర్లకు సూచించింది. మౌలిక వసతుల కల్పనతో పాటు రుణాల మంజూరుపై కూడా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి సూచించారు. 2014- 19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టణ పేదలకు గేటెడ్ కమ్యూనిటీ స్థాయిలో టిడ్కో గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2019 నాటికి అవి 90 శాతం పూర్తయినా గత వైసీపీ ప్రభుత్వం వాటిని పేదలకు ఇవ్వకుండా నిలిపివేసింది. గుంటూరు జిల్లాలో 5 పురపాలక సంఘాల్లో 15 చోట్ల 18,448 వేల ఇళ్లను నిర్మించ తలపెట్టగా వాటిలో ఇప్పటికి 16,048 వేల ఇళ్లు పూర్తయ్యాయి. 9,472 మంది లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యాయి. 2,592 మందికి రుణాలు మంజూరు కావాల్సి ఉంది. పూర్తయిన 16,048 ఇళ్లను పురపాలక సంఘాలకు అప్పగించగా వాటిలో 9,120 ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన పూర్తయింది. వాటిలో 7,398 ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు. కాగా పల్నాడు జిల్లాలో 6 పురపాలక సంఘాల్లో 7 చోట్ల 12,512 ఇళ్లు నిర్మించ తలపెట్టగా 6,016 వేలు పూర్తయ్యాయి. 2,934 మందికి రుణాలు మంజూరుకాగా, 3,082 మందికి రుణాలు మంజూరు కావాల్సి ఉంది. కాగా పూర్తయిన 6,016 ఇళ్లకు మౌలిక సదుపాయాల కల్పన కూడా పూర్తయింది. వాటిలో 1,152 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయగా మిగిలిన ఇళ్లను కూడా త్వరలో లబ్ధిదారులకు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. బాపట్ల జిల్లా పరిధిలో రెండు పురపాలక సంఘాల్లో 2,304 ఇళ్లను నిర్మించ తలపెట్టగా ఇప్పటి వరకు ఒక్కటి కూడా పూర్తి కాలేదు. అయితే 166 మందికి రుణాలు మంజూరయ్యాయి. మరో 794 మందికి రుణాలు మంజూరు కావాల్సి ఉంది.

స్మార్ట్ టౌన్‌షిప్‌లకు కార్యాచరణ

గుంటూరు జిల్లాలో 132 ఎకరాల్లో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ తీసుకుంది. ఒక్కో అసెంబ్లీ నియో జకవర్గంలో ఒక్కో లేఅవుట్ ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే విభజిత గుంటూరు జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో భూమిని గుర్తించాల్సి ఉండగా ఇప్పటికే 4 నియోజకవర్గాల్లో భూమిని గుర్తించారు. రెండు నియోజకవర్గాల్లో భూమిని సేకరించారు. ఒక నియోజకవర్గంలో ప్రాజెక్టును లాంచ్ చేశారు. కాగా పల్నాడు, బాపట్ల జిల్లాలో 13 నియోజకవర్గాల్లో భూములను గుర్తించగా,

(మిగతా 6వ పేజీలో..)

ఫిర్యాదులను సమీక్షించాలి

బాపట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ర్యాంకింగ్ మెరుగుపడాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జూన్ 15 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో జిల్లా ల వారీగా ర్యాంకులను ప్రక టించింది. అందులో బాపట్ల 15, గుంటూరు 17, పల్నాడు 20వ ర్యాంకులలో నిలిచాయి. బాపట్లలో 2234 వస్తే 1376(61.59 శాతం), గుంటూరులో 1730కి 1010(58.138 శాతం), పల్నాడులో 1720కి 983(57.15 శాతం) అర్జీలు పరిష్కారమయ్యా యి. పీజీఆర్‌ఎస్‌లో వస్తున్న ఫిర్యాదులను వేగంగా, సమర్థంగా పరిష్కరించేందుకు కలెక్టర్లు దృష్టి సారించాలి. ఇందుకోసం కీలకమైన అంశాలను గుర్తించి వాటిని ఏ విధంగా తగ్గించాలనే దానిపై క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గదర్శకం చేయాలని సదస్సు సూచించింది. వెబ్‌ల్యాండ్‌ని ఆర్‌ఎస్‌ఆర్‌తో పునః పరిశీలించి ప్రభుత్వ భూములేమైనా పట్టా భూములుగా మార్చారో, లేదో చూడాలి. అలానే విచారణ జరిపి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి. రికార్డులను భద్రపరిచేందుకు రెవెన్యూ కార్యాలయాల్లో వాచ్‌మన్లను పోస్టింగ్ చేయాలి. నెలలో కలెక్టర్లు ఈ విషయంలో సర్టిపై చేయాలి. కలెక్టర్లు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి. అన్ని చట్టాలు సక్రమంగా అమలు చేయాలి. సీనియర్ సిటిజన్స్, ప్రజలకు ప్రాధాన్యం ఇవ్వాలి. భూములకు సంబంధించిన అంశాల్లో పరిశీలనతో పాటు చర్యలు ఉండాలి. రీసర్వేపై నిర్వహిస్తున్న గ్రామసభలకు సంబంధించి పల్నాడులో 135 జరిగాయి. అక్కడ 3378 ఫిర్యాదులు రాగా 1309 పరిష్కరించారు. పరిష్కార శాతం 38.75గా ఉన్నది. బాపట్లలో 66 సభలు నిర్వహించగా 4253

(మిగతా 6వ పేజీలో..)

ఇసుక సులభంగా అందాలి

బాపట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నూతన విధానం ప్రకారం ఇసుక ప్రజలకు సులభతరంగా అందాలి. ఉచిత ఇసుక పుష్కలంగా అందుబాటులో ఉంచడమే కాకుండా భరించదగ్గ చార్జీలతో రవాణా చేసుకోగలిగేలా ఉండాలి. ఈ విషయంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు దృష్టి పెట్టాలని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ అధికారులు కలెక్టర్ల సదస్సులో సూచించారు. రాష్ట్రం దాటి అనధికారికంగా ఇసుక, ఇతర ఖనిజాలు రవాణా జరగకుండా చూడాలని ఆదేశించారు. అక్రమ మైనింగ్‌ని అరికట్టి ప్రభుత్వానికి ఖనిజ సంపద రూపంలో ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. మైనింగ్ లీజు దరఖాస్తుదారులు, లెటర్ ఆఫ్ ఇండెంట్ హోల్డర్స్‌కు ఎన్‌వోసీలు, ఇతర అనుమతులు వేగవంతంగా వచ్చేలా చూడాలని, వినియోగంలో లేని లీజులను తిరిగి గనుల తవ్వకాలు ప్రారంభించాలన్నారు. ఇదే సమయంలో నిఘాని పటిష్ఠం చేసుకుని సహజ వనరులను కాపాడాలని ఆదేశించారు. ప్రస్తుతం గుంటూరులో నాలుగు ఇసుక రీచ్‌లకు మూడింటిలో తవ్వకాలు జరుగుతున్నాయి. ఒక దాంట్లో వరదనీరు ప్రవహిస్తున్నది. పల్నాడు జిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లకు రెండు మాత్రమే వినియోగంలో ఉండగా నాలుగింటిలో వరదనీరు చేరింది. బాపట్లలో రెండు రీచ్‌లకు ఒకటి నిర్వహణలో ఉండగా మరొకటి వరదనీరు ప్రవాహం కారణంగా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో వరదనీరు తగ్గిపోగానే వెనువెంటనే వాటిల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభించేలా చూడాలని కలెక్టర్లకు

(మిగతా 6వ పేజీలో..)

ఇసుక ధర మళ్లీ పైపైకి

- అధికారుల వైఖరితో పెరుగుతున్న వైనం
- అద్దంకి సమీపంలో నిలిచిన ఇసుక లోడింగ్

గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులు



అద్దంకి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ పాలనలో చుక్కలనంటిన ఇసుక ధరలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దిగి వచ్చాయి. అయితే ఇటీవల అధికారుల వైఖరితో మళ్లీ ధరలు పెరుగుతున్నాయి. అద్దంకి, తిమ్మాయపాలెం సమీపంలో ఇసుక తవ్వకాలను పోలీసులు నిలిపి వేశారు. దీంతో ఇసుక ధర అమాంతం పెరిగింది. వైసీపీ హయాంలో ట్రాక్టర్ ఇసుక 3,500 నుంచి రూ.4 వేల వరకు వసూలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభంలో ఇసుక దందా కొనసాగించేందుకు కొందరు ప్రయత్నం చేశారు. అయితే మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేకంగా దృష్టి సారించడంతో వారు తగ్గారు. దీంతో ధర గత నెల రోజులుగా తగ్గి ట్రాక్టర్ ఇసుక రూ.1800 నుంచి రూ.2 వేలకే అందుబాటులోకి వచ్చింది. అయితే ఇసుక రవాణాదారుల్లో కొంతమంది ఊట బావులు, గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. వీరిని అడ్డుకోవాల్సిన అధికారులు అద్దంకి సమీపంలోని నదిలో తవ్వకాలను నిలిపి వేయించారు. దాడులు చేసి వాహనాలను అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో ఇసుక రవాణా వారం రోజులుగా నిలిచిపోయింది. దీనిని అవకాశంగా తీసుకున్న కొందరు కొటికల పూడి, వెంపరాల ప్రాంతాల నుంచి ఇసుక రవాణా చేస్తూ రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో తగ్గిన ఇసుక ధరలు నెల రోజులు తిరగకుండానే మరలా పెరుగుతుండటంపై భవన నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఊటబావులు, గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటూ ఇసుక రవాణా యథావిధిగా కొనసాగేలా చర్యలు చేపట్టాలని భవన నిర్మాణదారులు కోరుతున్నారు.



గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జి అంచున ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులు

పశుపోషణకు.. ప్రోత్సాహం

- పోషకులకు ప్రభుత్వం చేయూత
- విస్తృతంగా మినీ గోకులం షెడ్లు మంజూరు
- జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు
- మూడు జిల్లాల్లో 1836 షెడ్లకు 76 నిర్మాణం పూర్తి
- స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం

షెడ్ల మంజూరు

జిల్లా	మంజూరు	పురోగతిలో	పూర్తి
పల్నాడు	698	558	26
గుంటూరు	373	291	21
బాపట్ల	765	684	29

గోకులం.. రాయితీ ఇలా..

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారు వాటా
2 గేదలు	1,15,000	1,03,500	11,500
4 ఉంటే..	1,85,000	1,66,500	18,500
6కి మించి..	230,000	2,07,500	23,000
20 గొర్రెలు, మేకలు	1,31,000	91,000	39,000
50 దాటితే..	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు ఉంటే	87,000	60,900	26,100
200కి పైగా..	1,32,000	92,000	39,600

(నరస రావుపేట, ఆంధ్రజ్యోతి) పశుపోషణ.. పాడి పరిశ్రమ పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. పశు, పాడి పోషకులను ప్రోత్సహించేందు కు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గతంలో టీడీపీ ప్రభుత్వం 2018లో మినీ గోకులం పథకాన్ని ప్రవేశపెట్టి పశుపో షకులను ప్రోత్స హించింది. అదే పథకాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి ప్రవేశపెట్టింది. దీంతో విస్తృతంగా మినీ గోకులం నిర్మాణాల ను చేపట్టింది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమ లు చేస్తున్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు మం జూరయ్యాయి. గేదలు, కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ఆర్థికం గా చేయూత అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు 1,836 షెడ్లను మంజూరు చేశారు. ఇందుకు సంబంధించి పశుసంవర్ధక శాఖ లబ్ధి దారులను ఎంపి క చేసింది. షెడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే 76 షెడ్ల నిర్మాణం పూర్తి అయినట్లు పశుసంవర్ధక శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. షెడ్ల నిర్మాణం లో పశు పోషకులకు 90శాతం, జీవాలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం మేర రాయితీ కల్పించింది. గోకులం షెడ్లకు లబ్ధిదారుడు 10శాతం చెల్లిస్తే 90శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. కోళ్లు, గొర్రెలు, మేకల పెంపకందారులు వారి వాటా ధనం మొత్తంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం ఇస్తుంది. తొలి విడతలో మండలానికి 25 యూనిట్లు మంజూరు చేశారు. సొంత స్థలం ఉన్న చిన్న, సన్న కారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు.



గోకులం పథకం కింద నిర్మించిన షెడ్



ఏకగ్రీవాలయ్యేనా?

- నీటి సంఘాలపై కూటమి కసరత్తు
- నేడు ఎన్నిక.. ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- 2,628 టీసీలు.. 274 నీటి సంఘాలకు ఎన్నికల నిర్వహణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకోని సాగు నీటి సంఘాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ క్రమంలో ఇప్పటికి రెండు సార్లు ఎన్నికలు వాయిదా పడగా ఎట్టకేలకు శనివారం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. సాగునీటి సంఘాల్లో తొలుత టీసీలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించాయి. గ్రామాల్లో ముఖ్యంగా రైతులకు సంబంధించిన ఈ ఎన్నికలను సాధ్యమైనంత వరకు ఏకగ్రీవంగా చేసుకునేందుకు అటు రైతులు, ఇటు గ్రామ స్థాయి నాయకులు మంతనాలు జరుపుతున్నారు. మొత్తం మీద సాగు నీటి సంఘాల ఎన్నికల సందడి పల్లెల్లో నెలకొంది. శనివారం సాయంత్రం కల్లా ఎన్నికలు పూర్తి కానున్నాయి. వైసీపీ మద్దతుదారులు వారికి బలం ఉన్న సంఘాల్లో పోటీకి సమాయత్తమయ్యారు. కూటమి, వైసీపీ మద్దతుదారులైన రైతులు పోటీ చేసే నీటి సంఘాల్లో ఎన్నికలు రసవత్తరంగా మారాయి. సేవా భావం కలిగిన వారిని నీటి సంఘాలకు ఎన్నుకోవాలని ఎమ్మెల్యేలు రైతులకు పిలుపునిచ్చారు. ఏకగ్రీవంగా ఎన్నిక జరిగేలా రైతులను కూటమి నేతలు కోరుతున్నారు. కూటమిలో బీజేపీ, జనసేన మద్దతుదారులకు సంఘాలను కేటాయించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నీటి సంఘాల వారీగా కూటమి తరఫున పోటీ చేసే రైతుల జాబితాలను సిద్ధం చేశారు. ఏ సంఘానికి ఎవరు పోటీ చేయాలో నిర్ణయించి సదరు రైతులకు సమాచారం ఇచ్చారు. వారు పోటీకి కావాల్సిన పత్రాలను సిద్ధం చేసుకున్నారు. ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం అన్ని కమిటీలకు సంబంధించి ప్రాదేశిక సభ్యులకు ఎన్నిక జరగనున్నది. అనంతరం అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకునే ఆనవాయితీ ఉంది. నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగు నీటి సంఘాలు(డబ్ల్యుయూఏ) ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. పారదర్శకంగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

17న డీసీలకు ఎన్నికలు

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలోని లింగంగుంట్ల జలవనరుల సర్కిల్ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు జరగనున్నాయి. ఆయా ఎన్నికలకు సంబంధించి కూడా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డీసీ పదవులకు కూటమిలో పోటీ తీవ్రంగా ఉంది. డీసీలకు ఎన్నికైన వారు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవికి టీడీపీ సీనియర్ నేతలు పోటీ పడుతున్నారు.

హద్దురాళ్లపై జగనన్న పేర్ల తొలగింపు

అప్పట్లోనే రైతుల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత

వైసీపీ హయాంలో చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం దిద్దుబాటు

హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు

బల్లికురవ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇది నా రాజ్యం అడ్డు చెప్పేవారు ఎవరన్నట్లు గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. తాత ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన పంట భూములలో వైఎస్ఆర్ జగనన్న భూరక్ష అంటూ



రైతు పొలాల్లో పాతి ఉన్న సర్వే రాళ్లు

సర్వే హద్దు రాళ్లను జగన్ ఫొటోతో భారీ సంఖ్యలో ఏర్పాటు చేశారు. అప్పట్లోనే రైతులు ఈ రాళ్లపై తీవ్ర వ్యతిరేకత తెలిపారు. తమ వారసత్వ భూములలో జగన్ పేరు ఎమిటి అని అసహనం వ్యక్తం చేశారు. రైతుల బాధలు తెలుసుకున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తీసుకువెళ్లారు. తాము అధికారంలోకి రాగానే రాళ్లపై జగన్ పేరును తొలగిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంట భూములలో పాతిన హద్దు రాళ్లతోపాటు గ్రామాలలో నిల్వ ఉన్న రాళ్లపై జగన్ పేరు తొలగించేలా ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు నాలుగు రోజుల నుంచి అన్ని గ్రామాలలో హద్దు రాళ్లపై జగన్ పేర్ల తొలగింపు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని 22 మండలాల్లో ఉన్న 102 గ్రామాలలో ఈ ప్రక్రియ మొదలైంది. పది రోజుల్లో పూర్తి చేసేలా శరవేగంగా పనులు చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో వరి పంట ఉండటం వలన పొలాల మీదకు వెళ్లి రాళ్లపై పేర్లు తొలగించే పనులు ఆలస్యం కానున్నాయని అధికారులు అంటున్నారు.



సర్వే రాళ్లపై జగన్ పేరును తొలగిస్తున్న కూలీలు

అత్యధికంగా బల్లికురవ మండలంలో సర్వే హద్దు రాళ్లు

బల్లికురవ మండలంలో గొర్రెపాడు కొణిదెన, ముక్తేశ్వరం, ఎస్ఎల్ గుడిపాడు, బల్లికురవ, కొప్పెరపాడు, కూకట్లపల్లి, వైదన, వల్లాపల్లి, వేమవరం గ్రామాలలో రీసర్వే పనులు జరిగాయి. ఈ గ్రామాలలో జిల్లాలో కంటే అత్యధికంగా సర్వే హద్దు రాళ్లను అధికారులు ఏర్పాటు చేయించారు. సుమారు రూ. 50 వేల రాళ్ల రైతుల భూముల్లో పాతి ఉన్నాయి. ఈ రాళ్లపై ఉన్న జగన్ పేరు తొలగించేందుకు బల్లికురవ మండలానికి ప్రత్యేక టీంలు వచ్చాయి. ఈ పనులు వేగవంతంగా పూర్తి చేయిస్తామని తహసీల్దార్ రవినాయక్, సర్వేయర్ కిషోర్‌లు తెలిపారు. హద్దు రాళ్లపై ఉన్న పేర్లను తొలగిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలానే జగన్ బొమ్మలు వేసి ఉన్న పట్టాదారు పుస్తకాలను కూడా మార్చి నూతనంగా అందజేయాలని కోరుతున్నారు.



పేర్లను మిషన్‌తో తొలగిస్తున్న కూలి

విషమకాలం

గ్రామాల్లో పెరిగిన విషసర్పాల సంచారం

గుడ్లు పొదిగే సమయం కావడమే కారణం

అజాగ్రత్తతో కాటుకు గురవుతున్న ప్రజలు

గ్రామీణ వైద్యశాలల్లో అందుబాటులో లేని యాంటీ వీనమ్ ఔషధం

వైద్యానికి భారీగా అవుతున్న ఖర్చు

వర్షాలు సమృద్ధిగా కురవడం, ప్రస్తుతం సర్పాలు గుడ్లు పొదిగే కాలం కావడంతో పాముకాట్ల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. సకాలంలో వైద్యశాలకు చేరుకుని చికిత్స చేయించుకున్న వాళ్లు ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటున్నారు. కానీ కొద్దిగా అజాగ్రత్తగా ఉన్నవాళ్లు ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంత వైద్యశాలల్లో యాంటీవీనమ్ ఔషధం అందుబాటులో లేకపోవడం కూడా పాముకాటు మరణాలకు కారణమవుతోంది. కొన్ని పెద్ద వైద్యశాలల్లో మాత్రమే మందు అందుబాటులో ఉంటుంది. దీంతో అప్రమత్తంగా ఉండటం మినహా చేయగలిగేది ఏమీ లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాము కాట్లు పెరిగాయి. ప్రధానంగా మార్కాపురం డివిజన్‌లోని అటవీ సమీప ప్రాంతాల్లో విషసర్పాల సంచారం ఎక్కువైంది. గతంతో పోల్చితే కొన్నేళ్లగా విషసర్పాలు కరిచి మృతిచెందుతున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా వైద్యశాలలకు రానివాళ్లే ఎక్కువగా ఉన్నారు. మార్కాపురం డివిజన్‌లో గతేడాది 150కి పైగా కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటికే 231మంది పాముకాటుకు గురైనట్లు చెబుతున్నారు. వీరిలో మరణాలు 10శాతానికిపైగానే ఉంటున్నాయి. వాస్తవానికి అటవీ సమీప గ్రామాల్లో విషసర్పాల కేసులు ఎక్కువగా ఉంటున్నా, అవి వెలుగుచూడటం లేదు. సకాలంలో వైద్యం అందకపోవడంతో మరణాలు సంభవించడానికి ఇదే కారణమౌతోంది. దీంతోపాటు నాటువైద్యం కూడా మరణాల శాతం పెరగడానికి దోహదపడుతోంది.

కొన్నిరకాల సర్పాలతోనే ప్రమాదం

ఎక్కువగా సంచరించే సర్పాల్లో విషపూరితమైనవి, ప్రమాదకరమైనవి మూడు రకాలే. వాటిల్లో రక్తపింజరి, నాగుపాము(తాచు), కట్లపాములు మాత్రమే విషపూరితమైనవి. ఇవి కాటేస్తే ప్రాణాలకు ప్రమాదమే. వాటిల్లో కూడా రక్తపింజరి అత్యంత ప్రమాదకరమైనది. దీని కోరలు పెద్దవి కావడం లోతుగా కాటేయడం వలన ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తాచు, కట్ల పాములు కూడా విషపూరితమైనవే అయినా రక్తపింజరితో పోల్చితే తక్కువే. మిగిలిన వాటిల్లో కొండచిలువలు, జెర్రిపోతులు, మట్టిపాములు, నీరుకుట్టు పాములు తదితరాలు ఉన్నా వాటితో ప్రాణాలకు ప్రమాదం లేదు. అవి కాటేసినా హైపర్ టెన్షన్, గుండె జబ్బులు ఉన్న వాళ్లే మరణిస్తున్నారు. అంతేకాక కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలం కావడం కూడా మృత్యువాత పడటానికి కారణమవుతోంది.

గ్రామీణ వైద్యశాలల్లో లేని యాంటీ వీనమ్ ఇంజెక్షన్

విషసర్పాల కాటు గురైన వాళ్లకు ఎంత వీలైతే అంత తొందరగా యాంటీ వీనమ్ ఇంజెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అదీ కూడా ఏ రకం పాము కరిచిందో వైద్యులకు తెలియజేయాలి. పేషెంట్ కండిషన్‌ను, పాము రకాన్ని బట్టి వైద్యులు ఎంత మోతాదులో ఇంజెక్షన్ ఇవ్వాలో నిర్ణయిస్తారు. ఈ ఔషధం పెద్ద వైద్యశాలల్లో మినహా చిన్నపాటి పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండటం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చి వైద్యం చేయించుకునేలోపే చాలామంది మృత్యువాత పడుతున్నారు. పాము కరిచిన తర్వాత గంటలోపు వైద్యశాలకు చేరుకుంటే తప్పక బతికే అవకాశం ఉంటుంది. ఆ తర్వాత సమయం గడిచే కొద్ది ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు అటవీ సమీప పీహెచ్‌సీల్లో యాంటీ వీనమ్ ఔషధాన్ని జూలై నుంచి జనవరి వరకు తప్పక అందుబాటులో ఉంచేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం తప్పినట్లే

ఇతర సమయాల్లో కంటే పాములు గుడ్లు పొదిగే సమయంలోనే ఎక్కువగా వాటి సమీపానికి వెళ్లే జీవిపై కాటేస్తుంటాయి. అవి పొదిగే గుడ్లకు ప్రమాదం సంభవిస్తుందనే భయంతోనే ఆ సమయంలో పాములు విచక్షణారహితంగా కాటేసేందుకు సిద్ధమవుతాయి. ప్రతి సంవత్సరం వర్షాకాలం ప్రారంభమైన తర్వాతనే కలిసే సమయం. తర్వాత అక్టోబరు నుంచి నవంబరు వరకు గుడ్లు పెడతాయి. జనవరి వరకు పొదిగే సమయం ఉంటుంది. ఈ సమయంలోనే అవి అత్యంత క్రూరంగా ఉంటాయి. వాస్తవానికి పాములు ఇతర సమయాల్లో ఆహార సేకరణకు ఉపయోగపడే జీవులపై మాత్రమే కాటేసి వాటిని చంపిన తర్వాత తింటాయి. మనుషులను అవి కాటేసేందుకు ప్రయత్నించవు. మనుషుల అలికిడిని శబ్దగ్రహణం ద్వారా గ్రహించి దాదాపు పక్కకెళ్లిపోతాయి.

- పెద్దపాములకంటే చిన్నపాటి పాములతోనే ఎక్కువ ప్రమాదం ఉంది. పెద్దపాములు ఎంత విషం వదలాలో విచక్షణతో వ్యవహరించి కాటు వేస్తాయి. అదే తక్కువ వయసున్న పాములు భయంతో అవి ఎక్కువ మొత్తంలో విషాన్ని కాటులో చిమ్ముతాయి. మృత్యువాతపడటానికి ఇది కూడా ఒక కారణమే.
- పాము కరిచిన వాళ్లను మాట్లాడించకూడదు. అంతేకాక వైద్యశాలకు వెళ్లేలోపు ఎక్కడా పడుకోబెట్టకూడదు. కూర్చొబెట్టి మాత్రమే వాహనంలో వైద్యశాలకు చేర్చారు.
- పాము కాటు వేసిన తర్వాత చాలామంది తెలియక రక్తసరఫరా ఆపేందుకు తాడుతో కట్టడంలాంటి చేస్తుంటారు. అవి చేయడం వలన ఆ కింది ప్రాంతమంతా వేగంగా విషం రక్తనాళాల్లో చేరి విషపూరితమై ఆ అవయవాన్ని తీసేయాల్సి వచ్చే పరిస్థితులు ఏర్పడతాయి.
- చేతులకు, కాళ్లకు కాకుండా ఉదరం భాగం నుంచి తల వరకు ఎక్కడ కాటేసినా అత్యంత త్వరగా వైద్యశాలకు చేర్చాల్సి ఉంటుంది.
- పాములు చెత్తాచెదారంతో కూడిన మురుగు ఎక్కువగా ఉండే ప్రాంతాన్ని ఎంచుకుంటాయి. కాబట్టి ఇంటి పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి.
- పాములకు ప్రధానాహారం కప్పలు, ఎలుకలు. కాబట్టి వాటిని ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలి.
- పాము సంచరిస్తుందని తెలియగానే వాటిని పట్టే నిపుణులకు వెంటనే సమాచారం ఇవ్వాలి. విషపూరితమైనవే అయినా జీవవైవిధ్యం దృష్ట్యా చంపే ప్రయత్నం చేయకూడదు.

- గిద్దలూరు మండలం బురుజుపల్లికి చెందిన టి.మనోజ్ అనే చిన్నారి రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఈనెల 2వ తేదీన కట్లపాము కరిచింది. పిల్లాడి ఏడుపు విని తల్లి పరిశీలించింది. బుగ్గపై కాటు వేసినట్లు గమనించి వెంటనే చిన్నారిని వైద్యశాలకు తరలించింది. కానీ అప్పటికే చిన్నారి మృతిచెందాడు.
- తర్లుపాడు మండలం సూరేపల్లికి చెందిన పుల్లయ్య పొలం పనులు చేసుకుంటుండగా గతనెల 30న రక్తపింజరి కాలిపై కాటేసింది. దీంతో భయాందోళనకు గురైన ఆయన హుటాహుటిన ఊర్లోకి వెళ్లి బంధువులకు విషయం తెలిపాడు. ఆటోలో మార్కాపురం వైద్యశాలకు చేర్చారు. అప్పటికే ఎక్కువ సమయం గడవడంతో వైద్యశాలలో ప్రాథమిక చికిత్సలు అందిస్తున్న సమయంలోనే మృతిచెందాడు.
- యర్రగొండపాలెంకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తిని అక్టోబరు 12న ఇంట్లో పాము కాలిపై కరిచింది. విషయాన్ని ఆలస్యంగా గ్రహించిన ఆయన స్థానిక వైద్యశాలకు వెళ్తే మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరాడు. అక్కడ నాలుగు రోజులపాటు వైద్యం అందించారు. ప్రాణాపాయం తప్పినా రూ.2.50లక్షల వరకు ఖర్చయింది.



పదినెలల బాలుడు కిడ్నాప్

ఒంగోలుక్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఆడుకుంటున్న పది నెలల బాలుడిని ఓ మహిళ కిడ్నాప్ చేసింది. శుక్రవారం నగరంలోని ప్రగతీనగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒడిశాకు చెందిన మహీర్ సునానీని పక్కింట్లో ఉంటున్న దయామణి అనే మహిళ అపహరించి ఉంటుందని అనుమానిస్తున్నారు. ప్రదీప్ సునానీ గత మూడేళ్లగా ఒంగోలు కార్ కేర్‌లో పనిచేస్తున్నాడు. స్థానిక ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య ఊర్వశీ కుమారుడు మహీర్‌ను నెలక్రితం ఒడిశా నుంచి తీసుకొచ్చింది. దయామణి అనే మహిళ పక్క ఇంట్లో ఉంటోంది. నిత్యం బాలుడిని ఆడిస్తుంటుంది. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం మహీర్‌ని ఆడించేందుకు తీసుకెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి తీసుకురాలేదు. దీంతో తల్లిదండ్రులు పిల్లాడి కోసం వెతకగా అక్కడ ఇద్దరు లేరు. అంతేకాకుండా ఆమెకు సంబంధించిన దుస్తులు, వస్తువులు కూడా కనిపించలేదు. దీంతో బాలుడిని కిడ్నాప్ చేసిందని అనుమానించిన తల్లిదండ్రులు ఒంగోలు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో ఐదు బృందాలు బాలుడి కోసం గాలిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ పుటేజీని సేకరిస్తున్నారు. దయామణి ఎవరు, ఎక్కడి నుంచి వచ్చింది అనే కోణంలో కూడా పరిశీలన చేస్తున్నారు. కాగా తమ కుమారుడు కనిపిస్తే చెప్పండి అంటూ మహీర్ తల్లిదండ్రులు బాలుడు ఫొటో చూపిస్తూ నగరంలోని వీధులు వెంట తిరుగుతున్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి

బేస్తవారపేటలో రోడ్ల మరమ్మతుల పరిశీలన

బేస్తవారపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):'చంద్రబాబు అంటే అభివృద్ధికి అంబాసిడర్..ఆయన స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజల వద్దకే పాలన అందించే దిశలో ప్రభుత్వం పని చేస్తున్నదని' రోడ్లు భవనాలు,పెట్టుబడులు,మౌలిక సదుపాయల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బేస్తవారపేట మండలం కొత్తపల్లె గ్రామం వద్ద కోనపల్లె రోడ్డు మరమ్మతు పనులను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రోడ్ల మరమ్మతు పనులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చేయిస్తున్నదని అన్నారు. రోడ్ల మరమ్మతు పనులను తనిఖీ చేసేందుకు జిల్లాల వారీగా తాను పర్యటిస్తున్నానన్నారు. ఇప్పటికే అన్నమయ్య,బాపట్ల, కడప,కర్నూలు,నంద్యాల జిల్లాల్లో రోడ్ల పరమ్మతుల పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం జరిగిందన్నారు. సంక్రాంతి ఇంకా నెల రోజుల సమయం ఉన్నందున మరమ్మతు పనులను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే స్థానిక ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతున్న తీరును మంత్రి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ జితేంద్ర,ఎంపీడీవో రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి,ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ నేత జనార్దనరావు

పరామర్శించి వైద్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే కొండయ్య

ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడకు తరలింపు

చీరాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కొతవరపు జనార్దనరావు శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఒంగోలు వైపు నుంచి చీరాలకు బైక్‌పై వస్తున్న జనార్దనరావు చల్లారెడ్డిపాలెం సమీపంలో 216 హైవేలో అడ్డుగా వచ్చిన దున్నపోతును ఢీకొన్నాడు. ఈ క్రమంలో దున్నపోతు కొమ్ము అతని పొట్ట ప్రాంతంలో గీసుకుంది. సమాచారం అందుకున్న శ్రేణులు వెంటనే అతన్ని చీరాలలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య ఆసుపత్రికి వచ్చి అతన్ని పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. చిన్నపాటి ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు సమాచారం.



గాయపడిన జనార్దనరావు

అవీఇవీ

క్రీస్తువలే ప్రేమభావంతో మెలగాలి



లూథరన్ కళాశాలలో సెమీక్రిస్మస్ వేడుకలు

చీరాలటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల క్రీస్తువలే ప్రేమభావంతో మెలగాలని, కక్ష సాధింపులు విడనాడాలని స్థానిక లూథరన్ చర్చి మతబోధకులు దేవదాసు, సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజ్ చెప్పారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం గుండె వైద్య నిపుణులు ఐ.బాబురావు, సుభాషిణి దంపతులు క్యాండిల్ సర్వీస్ ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సదానందరావు, పాల్గొన్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో అన్నదానం

అద్దంకి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ టీడీపీ క్లస్టర్ ఇంచార్జి కాకాని అశోక్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం శింగరకొండ రోడ్డులోని చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌లో మనం

డాక్యుమెంటరీ ఆవిష్కరణలో పాల్గొన్న కలెక్టర్

తరలిన వివిధ సంఘాల నాయకులు, డ్వాక్రా మహిళలు



సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన విజన్ డాక్యుమెంటరీలో కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో శుక్రవారం జరిగిన స్వర్ణాంధ్ర విజన్-2047 సభకు జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి భారీగా తరలివెళ్లారు. ఒంగోలు నగరంతో పాటు సమీప గ్రామాలకు చెందిన బీసీ సంఘాల నాయకులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన నిష్ణాతులు ఈ సభకు హాజరయ్యారు. జిల్లాకేంద్రమైన ఒంగోలు నుంచి అందుకోసం ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. విజయవాడలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన ఈసభలో స్వర్ణాంధ్ర విజన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. ఒంగోలులోని డీఆర్ఆర్ఎం హైస్కూలు నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి 10 బస్సులు, 56 కార్లలో 717మంది వెళ్లారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం స్వర్ణాంధ్ర-47 డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. విజయవాడ వెళ్లిన వారిని సమన్వయం చేసేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కంట్రోలు రూమును కూడా ఏర్పాటుచేశారు. డీఆర్ఆర్ఎం స్కూలులో నగర పాలకసంస్థ ఆధ్వర్యంలో రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేషు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, మునిసిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక సులభంగా అందాలి

(5వ పేజీ తరువాయి)

మైనింగ్ శాఖ ఆదేశించింది. పట్టా భూముల్లో ఇసుక మేటల తొలగింపు కోసం గుంటూరులో 44 దరఖాస్తులు రాగా అవన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. బాపట్లలో నాలుగు, పల్నాడులో ఒకటి వచ్చాయి. గుంటూరులో కనీసం జాయింట్ ఇన్‌స్పెక్షన్ కూడా నిర్వహించలేదు. బాపట్లలో జాయింట్ ఇన్‌స్పెక్షన్‌లు నిర్వహించారు అయితే ఇంకా డీఎల్ఎస్‌సీ ఆమోదం లభించలేదు. పల్నాడులో ఒక దరఖాస్తు రాగా దీనికి కూడా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయలేదు. ఈ నేపథ్యంలో తక్షణమే మూడు జిల్లాల కలెక్టర్లు పట్టాభూముల దరఖాస్తులపై దృష్టి పెట్టి పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇసుక వినియోగదారుల నుంచి నిత్యం ఐవీఆర్ఎస్ ద్వారా తీసుకుంటున్న అభిప్రాయాలను కలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఇప్పటివరకు 86 శాతం సంతృప్తి వ్యక్తపరిచారు. ఇసుక ధర విషయంలో 10 శాతం, క్వాలిటీలో ఐదు శాతం, మోతాదులో మరో 6 శాతం మంది అసంతృప్తిగా ఉన్నారు. ఐవీఆర్ఎస్ డేటాని నిరంతరం పర్యవేక్షించాలి. ఇసుక ధర అందుబాటులో ఉండేలా చూడాలి. సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల నుంచి గరిష్ఠంగా ఇసుక సరఫరా జరిగేలా చూడాలి. రవాణా చార్జీలను పెంచకుండా నిరంతరం పర్యవేక్షించాలి. గుంటూరులో మెట్రిక్ టన్నుకు రూ.520, పల్నాడులో రూ.780 ధర ప్రస్తుతం ఉంది. ఇంకా కొంత తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గుంటూరులో నాన్ వర్కింగ్ లీజులు 61, పల్నాడు జిల్లాలో 120, బాపట్లలో 30 ఉన్నాయి. వీటిని ఆపరేషన్‌లోకి తీసుకు వచ్చేందుకు కలెక్టర్లు దృష్టి పెట్టాలని ప్రభుత్వం సూచించింది.

ఫిర్యాదులను సమీక్షించాలి

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదులు అందాయి. ఇప్పటివరకు 598 మాత్రమే పరిష్కరించారు. దీంతో పరిష్కార శాతం 14.06 శాతంగా నమోదైంది. గుంటూరు జిల్లాలో 62 గ్రామసభల్లో 3036 ఫిర్యాదులు రాగా 352(11.59) శాతం మాత్రమే పరిష్కరించారు. మూడు జిల్లాల కలెక్టర్లు వీటిపై దృష్టి పెట్టాలని సూచించింది. రీసర్వే జరిగిన గ్రామాల్లో హద్దురాళ్లపై ఉన్న రంగులు, బొమ్మలు తొలగించాలని ఆదేశించింది. అలానే రీసర్వేని కొనసాగించేందుకు వీలుగా యాక్షన్‌ప్లాన్ తయారు చేసి నివేదించాలని ప్రభుత్వం సూచించింది.

పట్టణ పేదలకు ఇళ్లు ఇవ్వాలి

(5వ పేజీ తరువాయి)

భూసేకరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది.

మరిన్ని అన్నక్యాంటిన్లు..

ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో మరో 5 అన్న క్యాంటీన్లకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 15 అన్న క్యాంటీన్లు ఉండగా మరో 2 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బాపట్ల జిల్లాలో ప్రస్తుతం 4 క్యాంటీన్లు ఉండగా, మరో రెండింటికి అవకాశం కల్పించింది. పల్నాడు జిల్లాలో ప్రస్తుతం ఉన్న 10కి తోడుగా మరో క్యాంటీన్‌ను ఏర్పాటు చేయనుంది.

రహదారులకు చికిత్స

పట్టణ ప్రాంతాల్లో రహదారుల మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. గుంటూరు జిల్లాలో 2,750 మరమ్మతు పనులు చేపట్టగా వాటిలో 1,954 పనులు పూర్తయ్యాయి. జిల్లాలో ఇప్పటి వరకూ 71.1 శాతం పనులు పూర్తవగా, మరో 796 పనులు పురోగతిలో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో 558 పనులు చేపట్టగా వాటిలో 355 పనులు పూర్తయ్యాయి. 63.6 శాతం పనులు పూర్తవగా ఇంకా 203 చోట్ల పనులు జరుగుతున్నాయి. బాపట్ల జిల్లాలో 119 పనులు చేపట్టగా, 46 పూర్తయ్యాయి. మరో 73 చోట్ల పనులు జరుగుతున్నాయి.

ఐసీడీఎస్ రక్షణలో బాలుడు


తప్పిపోయిన బాలుడు

యద్దనపూడి/మార్టూరు, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడేళ్ల వయసు ఉన్న బాలుణ్ని శుక్రవారం సాయంత్రం ఒక వ్యక్తి యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాడు. యద్దనపూడి మండలంలోని పూనూరు-గన్నవరం రోడ్డులో తిరుగుతున్నాడని, అమ్మ కావాలని ఏడుస్తున్నాడని, తల్లిదండ్రుల పేర్లు చెప్పలేకపోతున్నాడని, స్టేషన్‌కు తీసుకొచ్చానని ఆ వ్యక్తి పోలీసులకు తెలిపారు. పోలీసులు ఆ బాలుణ్ని ఏమి అడిగినా చెప్పలేకపోతున్నాడు. దీంతో ఆ బాలుణ్ని ఐసీడీఎస్ వారికి అప్పగించినట్లు ఎస్ఐ రత్నకుమారి తెలిపారు. బాలుని వివరాలు తెలిస్తే 9121102153 నంబర్‌కు తెలియచేయాలని ఎస్ఐ కోరారు.

ఓవర్‌లోడుతో వెళ్తున్న ఆటోడ్రైవర్లపై కేసు

చీరాలటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులతో వెళుతున్న రెండు ఆటోలను ఈపూరుపాలెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల మండలం పిన్నిబోయినవారిపాలెంకు చెందిన గోసబోయిన వెంకట యాదవ్, వెదుళ్లపల్లికి చెందిన దేవర రాజేష్‌లు ఓవర్ లోడు ప్రయాణికులతో ప్రయాణిస్తుండగా బాపట్ల - చీరాల రోడ్డులోని ఈపూరుపాలెం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మటుసస్తు కేసు నమోదు చేశారు.

నేడు కొత్తపేటలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట(చీరాల), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఐఎల్‌టీడీ కాలనీ, వడ్డె సంఘం, సంపత్‌నగర్, రేణుక్య కాలనీ, రామాపురం, పాపాయిపాలెం, వాకవారిపాలెం, వాడరేవు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పర్చూరులో...

పర్చూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : పర్చూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఏఈ రమేష్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్చూరు, ఉప్పుటూరు, వీరన్నపాలెం, నాగులపాలెం, నూతలపాడు, యర్రంవారిపాలెం, గొల్లపూడి, పెద్దివారిపాలెం, అన్నంబొట్లవారిపాలెం, అగ్రహారం తదితర గ్రామాలకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

15న జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

చినగంజాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో, పాతం జడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్లకు ప్రాబబుల్స్ ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, వై.హర్షవర్ధనరావులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాగుంట సుబ్బరామిరెడ్డి కళాశాలలో బాలుర జట్టును, పాతంలో బాలికల జట్టును ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. బాలుర విభాగంలో 70 కేజీలలోపు బరువు, బాలికల విభాగంలో 65 కేజీలలోపు బరువు ఉండాలని, 2005 సంవత్సరం తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఈ నెల 22, 23, 24, 25 తేదీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరగనున్న 50వ ఆంధ్ర రాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ బాలుర, బాలికల టోర్నమెంట్‌లో ఎంపికైన జిల్లా జట్లు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. బాలుర, వివరాల కోసం 9700600996, బాలికల.. వివరాల కోసం 9848606573 సెల్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

16 నుంచి సర్పంచ్‌లు, సిబ్బందికి శిక్షణ

వంగులూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనపై ఈ నెల 16వ తేదీ నుంచి సర్పంచ్‌లు, ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూపారాణి చెప్పారు. మొదటివిడత పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లతో పాటు గ్రేడ్ -1, గ్రేడ్ -4 కార్యదర్శులు, సచివాలయంలో పనిచేసే వెల్ఫేర్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్ సర్వే, ఎనర్జీ అసిస్టెంట్లకు, ఈ నెల 16, 17 తేదీల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. 18, 19 తేదీలలో పంగులూరు మండల విద్యా వనరుల కేంద్రంలో గ్రేడ్ - 5 కార్యదర్శులు, డిజిటల్, హెల్త్‌కేర్ అసిస్టెంట్స్, మహిళా సంరక్షణ కార్యదర్శులతో పాటు వీఆర్వోలు, ఏఎన్ఎంలు, మండల అధికారులకు రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

ఏకగ్రీవదిశగా అధికారపార్టీ నేతల కసరత్తు
వెనకడుగు వేస్తున్న వైఎస్సీపీ నాయకులు
కొన్నిచోట్ల టీడీపీ వర్గీయుల మధ్య నెలకొన్న పోటీ
రాజీ దిశగా చర్చలు?

మార్టూరు, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) : కోనంకి సబ్‌డివిజన్ ఎన్ఎస్పీ పరిధిలో శనివారం 27 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ సబ్‌డివిజన్ పరిధిలో పర్చూరు నియోజకవర్గం ఉంది. అందులో 4 డిస్ట్రిబ్యూషన్ కమిటీలైన కోనంకి, ఇంకొల్లు, ద్రోణాదుల, పర్చూరు ఉన్నాయి. వాటిలో కోనంకి డిస్ట్రిబ్యూషన్ కమిటీ పరిధిలో 9 సాగునీటి సంఘాలు, ఇంకొల్లు పరిధిలో 5, ద్రోణాదుల పరిధిలో 7, పర్చూరు పరిధిలో 6 సాగునీటి సంఘాలు ఉన్నాయి. దాంతో మొత్తం 27 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈ స్వామి శుక్రవారం తెలిపారు. ఆదేవిధంగా నోడల్ ఆఫీసర్‌గా అద్దంకి ఈఈ నాగమురళి వ్యవహరిస్తున్నారు.

పర్చూరులో...

పర్చూరు నియోజకవర్గంలో జరగనున్న 27 సాగునీటి సంఘాల అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవంగా జరిగేవిధంగా అధికార పార్టీనేతలు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఆయా సాగునీటి సంఘాల పరిధిలో టీడీపీ కూటమి మద్దతుదారులు ఏకగ్రీవంగా అధ్యక్షుని ఎన్నికపై సమాలోచన చేస్తున్నారు. అందుకు సంబంధించి శుక్రవారం సాయంత్రానికి ఒక కొలిక్కి వచ్చినట్లు సమాచారం.

చినగంజాంలో...

చినగంజాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని 6 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు శనివారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.ప్రభాకరరావు, చీరాల ఇరిగేషన్ శాఖ ఏఈ ఏ.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 8 నుంచి ఎన్నిక ప్రారంభమవుతుందన్నారు. 362 సంతరావూరు సంఘానికి సంబంధించి సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలలోని రూమ్ నెంబరు 05లో, 364 పెదగంజాం-1కు పెదగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలోని రూమ్ నెంబరు 10లో, 365 పెదగంజాం-2కు సంబంధించి పెదగంజాం ప్రాథమికోన్నత పాఠశాలలోని రూమ్ నెంబరు05లో, 367 చినగంజాం సంబంధించి కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రూమ్ నెంబరు 08లో, 368 పెదగంజాం-3కు చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రూమ్ నెంబరు 10లో, 369 పెదగంజాం-4కు చినగంజాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని రూమ్ నెంబరు 05లో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

అద్దంకిలో...

అద్దంకి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి సంఘాల ఎన్నికలు శనివారం జరుగనున్నాయి. దాదాపు అద్దంకి నియోజకవర్గంలో ఉన్న అన్నీ సాగునీటి సంఘాలు ఏకగ్రీవం కానున్నాయి. మొత్తం మీద ఒకటి, రెండు చోట్ల మాత్రమే వైసీపీ నేతలు పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నప్పటికీ స్థానిక పరిస్థితులను బేరీజు వేసుకొని అక్కడ కూడా వెనుకడుగు వేసినట్లు తెలుస్తోంది. కొన్ని గ్రామాలలో టీడీపీ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో నేతలు చర్చలు జరుపుతున్నారు. శనివారం నామినేషన్ల సమయానికి అన్నీ సర్దుకుపోయి ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో పెద్దగా నందడి వాతావరణ లేకుండా నే సాగునీటి సంఘాల ఎన్నికలు ముగియనున్నాయి. పోలీసులు కూడా అవసరమైన చోట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.


కోనంకి సబ్ డివిజన్ కార్యాలయం

శింగరకొండలో వైభవంగా హనుమత్ వ్రతం

ఇరుముడులు సమర్పించిన ఆంజనేయస్వామి దీక్షాధారులు

అద్దంకి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం హనుమత్ వ్రతం వైభవంగా జరిగింది. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 500 మంది ఆంజనేయస్వామి దీక్షాదారులు ఇరుముడులు సమర్పించి దీక్ష విరమణ చేశారు. ఉదయం దీక్షాదారులు ఆలయ ప్రదక్షిణ చేశారు. ఇరుముడులలో ఉన్న పూజ ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. ఈవో తిమ్మానాయుడు, ఉభయదాతలు చాలిపాళ్ల రామగోవిందు కుటుంబసభ్యులు, సిబ్బంది పంపాపాథి నిర్వహించి హనుమత్ వ్రతం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శింగరకొండ ప్రాంతం కిటకిటలాడింది. దీక్షా భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు.


పూజలలో పాల్గొన్న దీక్షాధారులు

నేడు మాధవస్వామి దేవాలయం విమాన శిఖర గోపుర ప్రతిష్ఠ

అద్దంకి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని మాధవస్వామి దేవాలయం విమాన శిఖర గోపుర పునఃప్రతిష్ఠ శనివారం ఉదయం 8-04 గంటలకు జరగనుంది. బుధవారం ప్రారంభమైన పూజా కార్యక్రమాలు 3వ రోజైన శుక్రవారమూ జరిగాయి. ఉదయం పారాయణం, పంచామృతాభిషేకం, హోమం నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.


ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అయ్యప్ప శరణు ఘోషతో మారుమోగిన ఉప్పుమాగులూరు

బల్లికురవ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామం శుక్రవారం అయ్యప్ప శరణుఘోషతో మారుమోగింది. నలభై ఒక్క రోజుల నుంచి అయ్యప్ప దీక్షలు తీసుకున్న 15 మంది స్వాములు తమ దీక్షను విరమించేందుకు ఇరుముడిని గురుస్వామి చే కట్టించుకొని గ్రామోత్సవంతో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. టీడీపీ యువనేత గొట్టిపాటి కమలకిషోర్ ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా దత్తాత్రేయ స్వామి కల్యాణ మహోత్సవం

వేటపాలెం/చీరాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : దత్త జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం దత్తాత్రేయస్వామి క్షేత్రంలో అనఘాదేవి సమేత దత్తాత్రేయ స్వామి శీలా కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. పురోహితులు కారంచేటి చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది.


కళ్యాణ మహోత్సవంలో భక్తులు

గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి కృషి

బల్లికురవ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో రైతుల సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ రవినాయక్ చెప్పారు. శుక్రవారం మండలంలోని గుంటుపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా రైతులు తమ సమస్యలపై తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళిక అవసరం

బల్లికురవ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ప్రణాళిక అవసరం అని ఎంపీడీవో కె. కుసుమకుమారి చెప్పారు. శుక్రవారం గ్రామాలలో ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులపై పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ జరిగింది. ఈవో ఆర్డీ సుమతి మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ వై కోటేశ్వరరావు(బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం

వేటపాలెం, చీరాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో వస్తున్న అర్జీలను పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ పార్వతి చెప్పారు. మండల పరిధిలోని పుల్లరిపాలెంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.


ఇంకొల్లు సదస్సులో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం

మేదరమెట్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరంగా రైతుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని తహసీల్దార్ సుబ్బారెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని తమ్మవరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 13 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

44 అర్జీలు అందజేత

ఇంకొల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పావులూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యల పరిష్కారానికి రైతులు 44 అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు వెంకటరత్నం తెలిపారు. తహసీల్దారు వెంకటరత్నం, గ్రామసర్పంచ్ లుదయ్య, దేవదయశాఖ మేనేజర్ శ్రీనివాసరావు, సర్వేయర్ లోకేశ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గుంజి వెంకట్రావు, పంచాయతీ కార్యదర్శి మాధవీలత, వీఆర్వోలు కృష్ణప్రసాద్, దానియేలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఎస్ఎస్‌సీ 2025 పుస్తకంతో ప్రయోజనం

చీరాలటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన ఎస్ఎస్‌సీ 2025 మోడల్ పుస్తకంతో 10వ తరగతి పరీక్షల్లో హాజరయ్యే విద్యార్థులకు ప్రయోజనమని పలువురు ప్రతినిధులు చెప్పారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో సంబంధిత పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారిన సిలబస్ ఆధారంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో పుస్తకాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆదుగుల శ్రీనివాసరావు, సిద్దం పాపారావు, సురేష్, సీతారామారావు, శ్రీనివాసరావు, జి. శ్రీనివాసరావు, రాజేష్ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు


బ్యారన్ వద్ద కూలీలతో మాట్లాడుతున్న వేలం కేంద్రం అధికారులు

నాణ్యమైన పొగాకుతోనే అధిక ధరలు

అద్దంకి, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన పొగాకుతోనే అధిక ధరలు పొందవచ్చని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ చెప్పారు. మండలంలోని వెంకటాపురంలో పొగాకు సాగు చేసే రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం పొలాలను, బ్యారన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటీఫ్ ఆర్ఎ అధికారులు సూచించిన పురుగు మందులను మాత్రమే అవసరమైన మేర పిచికారీ చేయాలన్నారు. పురుగు మందుల అవశేషాలు, పొగాకేతర అన్యపదార్థాలు లేని పొగాకును పండించటం ద్వారా మంచి దిగుబడితో పాటు మంచి ధరలు పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ హర్ష, వెంకటేష్, శ్యామల పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో ఔషధ మొక్కలు కీలకం

అవీఐవీ


మొక్కలు అందజేస్తున్న సుధాకరరావు

అద్దంకిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కలు ఎన్నో శతాబ్దాలుగా మన ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉన్నాయని ఎంఈవో బి. సుధాకరరావు చెప్పారు. శుక్రవారం ఐతుఈఐర్‌డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని సత్రం బడి, మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ వరణలో పలు రకాల ఔషధ మొక్కలను విద్యార్థులచేత నాటించారు. ఈ సందర్భంగా ఔషధ మొక్కల ప్రాధాన్యతను, ఉపయోగాల గురించి సంస్థ అధ్యక్షుడు బి. కిరణ్‌చంద్ అవగాహన కల్పించారు.

వక్తృత్వ పోటీలో ప్రథమ స్థానంలో అమృత


సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎంఈవో నిరంజన్

అద్దంకిటౌన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా బాపట్లలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అద్దంకి అమృత పాల్గొని పొట్టి శ్రీరాములు అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే వ్యాసరచన పోటీలలో జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. అమృతకు బాపట్ల మండల విద్యాశాఖ అధికారి నిరంజన్, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాధిక్, బాపట్ల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎంలు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన అమృతను అద్దంకి మండల విద్యాశాఖ అధికారులు గంగాధరరావు, సుధాకరరావు, హెచ్ఎం కె.వి. శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ వి. తిరుమలలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్మశానంలో చిల్లకంప తొలగించండి


శ్మశాన స్థల వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

వంగులూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జైతమంజులూరు గ్రామ శ్మశానవాటికలోని చిల్లకంపను తొలగించాలని, స్థలానికి సంబంధించిన హద్దులు నిర్ధారణకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ పి.సింగారావు గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం స్థానిక నేతలు, సిబ్బందితో కలసి గ్రామంలోని శ్మశానవాటికను పరిశీలించారు. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలలో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివరాజు, సర్వేయర్ సురేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ టీంకు సెయింట్ఆన్స్ విద్యార్థులు ఎంపిక


వాలీబాల్ టీంకు ఎంపికైన వారిని అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ వాలీబాల్ టీంకు సెయింట్‌ఆన్స్ కళాశాల విద్యార్థులు ఇరువురు ఎంపికయినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమతుల లక్ష్మణరావులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు జె.తేజ, ఆర్.రమాకాంత్ వారు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజరు ఆర్.వి. రమణమూర్తి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమానికి డ్వాక్రా మహిళలు


విజయవాడ తరలివెళ్తున్న డ్వాక్రా మహిళలు

చినగంజాం, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం జరిగే స్వర్ణాంధ్ర 2047 పది సూత్రాల కార్యక్రమానికి మండల పరిధిలోని స్వయం సహాయ గ్రూపు సభ్యులు, వీవోఏలు విజయవాడ బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించనున్న ఈ డాక్యుమెంట్ కార్యక్రమానికి చినగంజాం మండల సమాఖ్య అధ్యక్షురాలు సుశీలమ్మ ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులు, అధ్యక్షులు, వీవోఏలు, సీసీ వెంకటస్వాములు బస్సులో విజయవాడ వెళ్లినట్లు ఏపీఎం గొర్రె సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థి దశలో కీలకంగా వ్యవహరించాలి

చీరాలటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలో పాల్గొనే పోటీల్లో కీలకంగా వ్యవహరించాలని రెడ్డిజన సేవాసమితి ప్రతినిధులు చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన త్రివరం వేదశ్రీ గత నెల తమిళనాడులో నిర్వహించిన దక్షిణ భారత అండర్- 17 బాలికల పవర్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించి మూడవ స్థానంలో నిలిచింది. ఈసందర్భంగా శుక్రవారం సమితి ఆధ్వర్యంలో ఘనంగా వేదశ్రీను సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు గోపాలకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, భరత్‌రెడ్డి, బత్తుల బ్రహ్మారెడ్డి, షణ్ముఖరెడ్డి, నాగేశ్వరరెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేదశ్రీను అభినందిస్తున్న రెడ్డిజన సేవాసమితి ప్రతినిధులు

ఆంధ్రజ్యోతి

'సోమశిల'కు 7,504 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 7,504 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 72.710 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 2,550, కండలేరుకు 1,250, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 150 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.


జిల్లా సర్వతోముఖాభివృద్ధికి

దిశానిర్దేశం

రెండు రోజుల సదస్సులో సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

రెండు రోజులపాటు అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో నెల్లూరు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి చేపట్టనున్న చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఆదేశాలు జారీ చేశారు. జిల్లావాసులకు నైట్ ల్యాండింగ్ సౌకర్యంతో విమానాశ్రయం మొదలు పల్లె ప్రాంతాలకు అన్న క్యాంటీన్ల విస్తరణ వరకు పలు అభివృద్ధి పనుల పూర్తికి కాలపరిమితిని నిర్దేశిస్తూ కలెక్టర్ ఆనంద్‌కు దిశానిర్దేశం చేశారు. అనుకున్న విధంగా ఈ అభివృద్ధి పనులన్నీ పూర్తి అయితే నెల్లూరు జిల్లా కొత్త శోభ సంతరించుకోనుంది.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)





- పరుగులు పెట్టనున్న దగదర్తి విమానాశ్రయ పనులు
- రోడ్ల బాగు కోసం బృహత్తర ప్రణాళిక
- భూ ఆక్రమణదారులపై ఉక్కుపాదం
- విద్యాసంస్థల్లోనూ 'ఈగల్' నిఘా
- పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక ప్రణాళిక
- పల్లెలకూ విస్తరించనున్న అన్న క్యాంటీన్లు

జిల్లా ప్రజలకు విమానాశ్రయ సౌకర్యం కొద్దిరోజుల్లోనే కలగనుంది. దగదర్తి వద్ద చేపట్టనున్న ఈ పనులను శరవేగంగా పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. రాత్రి పూట కూడా విమానాలు దిగడానికి వీలుగా (నైట్ ల్యాండింగ్) విమానాశ్రయం రూపుదిద్దుకోనుంది. విమానాశ్రయానికి సంబంధించి జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు.

● గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా రోడ్లు దారుణంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆ ఐదేళ్ల కాలంలో రోడ్లమీద ఏర్పడిన గోతులకు తట్టెడు మన్నేసిన పాపాన పోలేదు. ప్రజలకు ప్రయాణం నరకతుల్యమైంది. ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. కూటమి ప్రభుత్వం ఈ రోడ్ల బాగు కోసం నడుం బిగించింది. రెండేళ్ల కాల పరిమితిలో జిల్లా పరిధిలోని అన్ని రహదారులను బాగుచేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు, తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌ను ఆదేశించారు.

● జిల్లాలో భూ కబ్జాల నివారణకు, భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించడానికి జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, ఎస్పీ, డీఎస్పీలు ఈ కమిటీల్లో సభ్యులుగా ఉంటారు.

● స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టనున్నారు. నెలలో ప్రతి మూడవ శనివారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్య కార్మికులతోపాటు అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యాన్ని తీసుకుంటారు.

● ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజల మన్ననలు పొందిన కూటమి ప్రభుత్వం ఇసుక ధర భారాన్ని మరింత తగ్గించాలని నిర్ణయించుకుంది. ఇళ్ల నిర్మాణదారులకు పూర్తిగా ఇసుక అందజేయడంతోపాటు ప్రస్తుతం ఉన్న రవాణా చార్జీలను కూడా మరింత తగ్గించాలని నిర్ణయించుకున్నారు.

● గత ప్రభుత్వంలో సంక్షేమ హాస్టళ్లు దయనీయ స్థితికి చేరుకున్నాయి. కనీస సౌకర్యాలు కూడా కరువయ్యాయి. ప్రత్యేకించి బీసీ హాస్టళ్ల మరింత దుర్భర పరిస్థితిని అనుభవించాయి. బీసీ హాస్టళ్లకు పూర్వవైభవం తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు హాస్టళ్ల నిర్వహణకు భారీగా నిధులు సమకూర్చనున్నారు. భోజన వసతి మెరుగుపరచడంతోపాటు హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేయనున్నారు.



● పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నుంచి సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే భోజన వసతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా!? రుచిగా, శుభ్రంగా వండి వడ్డిస్తున్నారా!? అనే అంశాలను తెలుసుకోవడానికి ప్రతి వారం విద్యార్థుల నుంచి అభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నారు.

● పట్టణాలకు మాత్రమే పరిమితమైన అన్న క్యాంటీన్లు త్వరలో పల్లెలకూ విస్తరించనున్నాయి. కేవలం ఐదు రూపాయలకే టిఫిన్, భోజనం అందించే ఈ మానవీయ కార్యక్రమానికి ప్రజల విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకాన్ని గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాలని నిర్ణయించుకున్నారు. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో వచ్చే ఏడాది మార్చి ఆరంభానికల్లా క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నారు.

● జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపన, తద్వారా ఉపాధి కల్పన దిశగా కూటమి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టుల పరిధిలో పెద్ద ఎత్తున అనుబంధ పరిశ్రమల స్థాపన దిశగా జిల్లా యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. ప్రస్తుతం ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో రూ.2500 కోట్లతో 13వేల ఎకరాల్లో క్రిష్ సిటీ (కృష్ణపట్నం ఇండస్ట్రీయల్ సిటీ) పనులు మొదలయ్యాయి. కృష్ణపట్నం పోర్టుతోపాటు అటు చెన్నై పోర్టుకు దగ్గరగా ఉండే విధంగా కోట, చిల్లకూరు మండలాల పరిధిలోని కొత్తపట్నం, తమ్మినపట్నం గ్రామాల్లో క్రిష్ సిటీ రూపుదిద్దుకోనుంది. సుదీర్ఘమైన సముద్ర తీరం ఉన్న ఉమ్మడి జిల్లాలో తీరానికి దగ్గరగా ఉన్న మండలాల పరిధిలో పలు పరిశ్రమల ఏర్పాటుకు కృషి జరుగుతోంది. యువతకు ఉపాధి కల్పన కోసం జిల్లాలో నైపుణ్య

- మిగతా 6లో..



భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న మౌనిక, పక్కన పిల్లలు

ఆత్మహత్యకు ముందు వినోద్ తన చావుకు గల కారణాలను వివరిస్తూ ఓ సెల్ఫీ వీడియో తీశాడు. 'భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పద్మావతి వేధింపుల వల్ల తాను విసిగిపోయాను ఫ్రెండ్స్. ఇక నేను బతకటం కూడా దండగ ఎవరూ బాధపడవద్దు. వైసీపీ ప్రభుత్వంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పరిహారం చెల్లింపులో నాకు తీవ్ర అన్యాయం చేసింది. దీంతో ఎన్నికల ముందు టీడీపీలో చేరి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజయానికి కృషి చేసినా ఆయన కూడా ఆ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుకే సపోర్టుగా మాట్లాడారు. ఇక విధిలేక ఆత్మహత్య చేసుకుంటున్నా.' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

విసిగిపోయి..

చనిపోతున్నా!

అధికారుల తీరును నిరసిస్తూ ఓ రైతు బలవన్మరణం



ఉరి వేసుకునే ముందు సెల్ఫీ వీడియోలో మాట్లాడుతున్న రైతు వినోద్

- రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూ పరిహారం చెల్లింపులో అన్యాయం
- సందేశాన్ని సెల్ఫీ వీడియో తీసి ఉరేసుకుని ఆత్మహత్య
- డిప్యూటీ కలెక్టరు వేధింపులతోనేనంటూ ఆరోపణ
- చేవూరులో విషాదం
- సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే ఇంటూరి పరామర్శ.. కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ

గుడ్లూరు/కందుకూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసేకరణ ఓ అన్నదాత ప్రాణం బలి తీసుకుంది. భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పద్మావతి పరిహారం చెల్లింపులో తనకు అన్యాయం చేస్తూ వేధింపులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ గుడ్లూరు మండలం చేవూరు గ్రామానికి చెందిన నక్కల వినోద్‌కుమార్ (40) అనే రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కావలిలోని తన నివాసంలో శుక్రవారం తెల్లవారుజామున ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉరికి అంతా సిద్ధం చేసుకుని ఒక సెల్ఫీ వీడియోలో తన ఆత్మహత్యకు గల కారణాన్ని వివరించి అనంతరం తనువు చాలించాడు. చేవూరుకు చెందిన వినోద్ కుమార్‌కు భార్య మౌనిక, కుమార్తె లాస్య (10) 6వ తరగతి, కుమారుడు (6) ఎల్‌కేజీ చదువుతున్నారు. పిల్లల చదువు కోసం కొంతకాలంగా కావలిలో కాపురం ఉంటున్నారు. వినోద్‌కు చేవూరులో 9.6 ఎకరాల భూమి ఉండగా రామాయపట్నం పోర్టు కోసం మొత్తాన్ని సేకరించారు. అయితే, ఇందులో 7 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించారు. మిగిలిన 2.6 ఎకరాలకు పరిహారం చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.60 లక్షల పరిహారం అందాల్సి ఉంది. నిబంధనల ప్రకారం అయితే సుమారు రూ.80 లక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారమే తనకు పరిహారం చెల్లించాలని కావలి భూ సేకరణ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల 40 సెంట్లకు పరిహారం తన ఖాతాలో జమ అయినా వినోద్ వెనక్కి ఇచ్చేశాడు. అధికారుల తీరుపై విసిగి వేసారిన వినోద్ శుక్రవారం తెల్లవారుజాము 3.30 గంటల ప్రాంతంలో తన ఇంట్లోని కొక్కానికి ఉరి వేసుకుని మృతి చెందాడు.

● **గ్రామస్థుల ఆగ్రహం**

శుక్రవారం ఉదయాన్నే కుటుంబసభ్యులు వినోద్‌కుమార్ మృతదేహాన్ని చేవూరుకు తరలించగా, పెద్దసంఖ్యలో గ్రామస్థులు అక్కడకు చేరుకుని అధికారుల తీరుపట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పద్మావతి వ్యవహార శైలిపై ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి వినోద్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయడంతోపాటు భూసేకరణ ప్రక్రియ తీరు మారుస్తామని స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



వినోద్‌కుమార్ నివాసం వద్ద చేవూరు గ్రామస్థులు

● **సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే పరామర్శ**

కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజ చేవూరుకు చేరుకుని మృతుడి భార్య వినోద్‌కుమార్ సతీమణి మౌనిక, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. వినోద్ కుటుంబాన్ని ఆదుకోవాలని, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతోపాటు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మృతుడి పిల్లల బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. పరిస్థితులను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని సబ్ కలెక్టరు వారికి హామీ ఇచ్చారు. అనంతరం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూడా చేవూరులో వినోద్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా రూ.50 వేల ఆర్థికసహాయం అందించారు. ఈ ఘటనపై కావలి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు గుడ్లూరు సర్కిల్ సీఐ మంగారావు, ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టరు శ్రీపూజ, వినోద్ మృతదేహం వద్ద ఎమ్మెల్యే ఇంటూరి

న్యాయం జరిగేలా చూస్తా!

పరిహారం చెల్లింపులో అన్యాయం జరుగుతోందని వినోద్ నా దగ్గరకు వచ్చి చెప్పారు. న్యాయం జరిగేలా చూస్తాను. నువ్వేమీ తొందరపడవద్దని చెప్పి పంపించా. ఆ తర్వాత అధికారులతో కూడా మాట్లాడాను. కానీ ఇంత కఠిన నిర్ణయం తీసుకుంటాడనుకోలేదు. వినోద్‌కుమార్ పిల్లలను ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఉన్నత చదువులు చదివించే బాధ్యతను నేను తీసుకుంటాను. ఆయన భార్య మౌనికకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా చూస్తాను.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

భూ సేకరణ...

లోపభూయిష్టం

రైతుల మొరను ఆలకించని యంత్రాంగం

కందుకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :రామాయపట్నం పోర్టు అనుబంధంగా పరిశ్రమల స్థాపన కోసం ఏపీ మారిటైమ్ బోర్డు చేపట్టిన భూసేకరణ ప్రక్రియ అంతా లోపభూయిష్టంగా ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. భూసేకరణ గ్రామాలలో ఒకటైన చేవూరుకు చెందిన రైతు నక్కల వినోద్‌కుమార్ ఆత్మహత్యతో భూసేకరణ ప్రక్రియ సర్వత్రా చర్చనీయాంశమైంది.

కందుకూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న చేవూరు, రావూరు, ఏలూరుపాడు గ్రామాలతోపాటు కావలి నియోజకవర్గ పరిధిలోని రుద్రకోట, చెన్నాయపాలెం, మద్దూరుపాడు తదితర గ్రామాల పరిధిలో 9వేల ఎకరాలను రైతుల నుంచి సేకరించాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించి ఆయా గ్రామాలలో భూ క్రయవిక్రయాలను నిలిపివేసింది. కనీసం గ్రామసభలు, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండానే భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చేసింది. అయితే తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా బలవంతపు భూసేకరణను అనుమతించేది లేదని ఆందోళన చెలరేగటంతో అప్పట్లో ఆయా గ్రామాలలో గ్రామసభలు పెట్టారు. ఈ గ్రామసభల్లో తాము పరిశ్రమలకు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని రైతులు ముక్తకంఠంతో చెప్పినా అవేమీ పట్టించుకోకుండా అధికారు లు బలవంతపు భూసేకరణకు తెరతీశారు. అప్పటి అధికార పార్టీ నాయకులను అడ్డం పెట్టుకుని డబ్బు అత్యవసరం ఉన్న రైతుల ను మభ్యపెట్టి భూసేకరణ ప్రారంభించిన అధికారులు నేటికీ నిర్విరామంగా అదేవిధానం అమలు చేస్తున్నారు. ప్రభుత్వం మారినా భూసేకరణ అధికారులు వారే కొనసాగుతుండటంతో నేటికీ అదేపరంపర కొనసాగుతోంది. దీంతో పది రోజులుగా భూసేకరణ ప్రక్రియ తీరును నిరసిస్తూ తాను ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరిస్తూ వచ్చిన వినోద్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజామున అన్నంతపని చేశాడు.

● **భూసేకరణ ప్రక్రియ అన్యాయం**

మృతుడు వినోద్‌కుమార్ స్వగ్రామమైన చేవూరు గ్రామ రెవెన్యూ పరిధిలో 7వేల ఎకరాలకుపైనే భూమి ఉంది. ఇందులో అటవీభూములు, చెరువులు, డొంకలు, కుంటలు, ప్రభుత్వ భూములుపోను 3వేల ఎకరాలకుపైగా రైతుల స్వాధీనంలో పట్టా, అసైన్‌మెంటు భూములు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ధరల ప్రకారం మెట్ట, మాగాణి భూములు ఎకరం రూ.7.7 లక్షలు, పండ్ల తోటలు రూ.11 లక్షలు, జాతీయ రహదారి పక్కన రూ.18.7 లక్షలు, ఇళ్ల స్థలాలు రూ.31.95 లక్షలు, నివాసస్థలాలకు అనువైన భూముల ధర ఎకరం రూ.15.4 లక్షలు ఉంది. వాస్తవంగా మార్కెట్ ధర చూస్తే జాతీయ రహదారి సమీపంలో ఎకరం రూ.కోటిన్నరకుపైగా పలుకుతుండగా మిగిలిన భూములు కూడా ఎకరం రూ.50 లక్షలకు తక్కువ లేదు. క్రయవిక్రయాలకు అనుమతిస్తే ఆ మేరకు కొనుగోలుదారులు సిద్ధంగా ఉన్నారు. అయితే గ్రామస్థులు పరిశ్రమల ఏర్పాటు, ఈ ప్రాంత అభివృద్ధికి తాము సహకరిస్తామని భూసేకరణ చట్టం ప్రకారం తమ భూములు సేకరించుకోవాలని మొదటి నుంచీ డిమాండ్ చేస్తున్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్

- మిగతా 6లో..

సాగునీటి సంఘాలకు

నేడు ఎన్నికలు

- 486 డబ్ల్యూఏలకు పాలకవర్గాల ఎన్నిక
- పోలింగ్ విధుల్లో 3926 మంది సిబ్బంది
- ఏకగ్రీవాలకు అధికార పార్టీ నేతల ప్రయత్నాలు

వ్యవసాయ రంగంలో కీలకమైన సాగునీటి సంఘాలకు ఎన్నికలు శనివారం జరగనున్నాయి. పదేళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. జిల్లాలో మొత్తం 486 సాగునీటి సంఘా(డబ్ల్యూఏ)లకు ఎన్నిక జరగనుంది. ఇందుకు సంబంధించి 3649 మంది ప్రాదేశిక నియోజకవర్గాల (టీసీ) సభ్యులను ఎన్నుకుంటారు. ఒక్కో డబ్ల్యూఏ పరిధిలో సరాసరి 10 మంది టీసీలు ఉన్నారు. వీరిని ఆయా పరిధిలోని ఆయకట్టు రైతులు ఎన్నుకుంటారు. వీరంతా కలిసి ఆ పరిధిలోని డబ్ల్యూఏ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకుంటారు. మొత్తం 486 మంది ప్రెసిడెంట్లు, మరో 486 మంది వైస్ ప్రెసిడెంట్లకు ఎన్నిక జరగనుంది.



ముత్తుకూరు : ఎన్నికల సామగ్రిని తీసుకెళుతున్న అధికారులు

నెల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నెల్లూరు సిటీ మినహాయించి మిగిలిన 37 మండలాల్లోనూ సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. తొలుత ఒక్కో టీసీ సభ్యుడి ఎన్నిక జరుగుతుంది. తొలుత రైతులంతా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు అవకాశం కల్పిస్తారు. అది కుదరకపోతే ఆయకట్టు రైతులందరితో చేతులు ఎత్తి ఓటు వేసే విధానాన్ని నిర్వహిస్తారు. ఇది కూడా సాధ్యపడని పక్షంలో బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నిక జరుగుతుంది. టీసీ సభ్యులు, ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లుగా పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న వారి దగ్గర నుంచి నామినేషన్లు, స్క్రూటినీ ప్రక్రియ మొత్తం శనివారమే జరుగుతుంది. కాగా ఈ సాగునీటి సంఘాల ఎన్నికల విధుల్లో 3926 మంది సిబ్బంది పాల్గొంటు న్నారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. సమస్యాత్మకం అనుకున్న చోట పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వీలైనంత వరకూ డబ్ల్యూఏ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లను ఏకగ్రీవంగా ఎన్నుకునే విధంగా ప్రయత్నాలు

- మిగతా 6లో..

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంధన పొదుపు వారోత్సవాలను శనివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వీ విజయన్ తెలిపారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే కాలంలో విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇంధన పొదుపు చర్యల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పొదుపు చర్యలను పాటించడం ద్వారా పరోక్షంగా ఎక్కువ విద్యుత్ పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు అందుబాటులో ఉండి తద్వారా ఉత్పత్తి పెరిగి రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యుత్ ఆదా ఎలా చేయాలి, తీసుకోవాల్సిన చర్యలను వారోత్సవాల్లో వివరిస్తారని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులతో విద్యుత్ భవన్ నుంచి కస్తూర్బా కళాపరిషత్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇందన పొదుపుపై పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిమ్మ ధర ఢమాల్!

రోజు రోజుకు పెరుగుతున్న చలి తీవ్రత, వర్షాల వల్ల నిమ్మకాయల వినియోగం తగ్గి రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదు. ఈ ఏడాది జనవరి నుంచి 11 నెలల పాటు బస్తా (లూజు) రూ.2వేలకు తగ్గకుండా గోల్డెన్ ఇయర్‌గా రికార్డు సాధించే క్రమంలో వాతావరణంలో జరుగుతున్న మార్పుల కారణంగా మూడు రోజుల నుంచి ధర తగ్గుముఖం పట్టింది. ఈనెల ప్రారంభం లోనూ రూ.2500 నుంచి రూ.3వేల వరకు పలికిన ధర ప్రస్తుతం రూ.1200 నుంచి రూ.1500కు మించడం లేదు. ఈ ధర కూడా నాణ్యత కలిగిన నిమ్మకాయ లకే వర్తిస్తోంది. కిలోల వంతునైతే రూ.15 నుంచి రూ.20 మాత్రమే ధర పలుకుతోంది. అయితే వర్షా కాలంలో ప్రస్తుతం ఉన్న ధర తక్కువ కాదంటు న్నారు వ్యాపారులు. బీజాపూర్ కాయలు ఎక్కువ కావడం, ఇక్కడ మంచు ప్రభావంతో కాయల్లో నాణ్యత లోపించడంతో గిట్టుబాటు ధర లభించడం లేదని తెలుస్తోంది. సంక్రాంతి వరకు ఇవే ధరలు ఉండవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- పొదలకూరు,(ఆంధ్రజ్యోతి)



వైభవంగా కృత్తికా దీపోత్సవం

జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా కృత్తికా దీపోత్సవం (అఖండ జ్యోతి) వైభవంగా జరిగింది. స్వామివారికి ఉదయం, సాయంత్రం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి శ్రీచక్ర నవావరణ పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయ ముఖ మండపంపై అఖండ జ్యోతి వెలిగించారు. ఉదయం అమ్మావారి పులకాపు కార్యక్రమానికి భవానమ్మ, రాత్రి అఖండ జ్యోతి కార్యక్రమానికి ధరణీకృష్ణ, సుధారాణి, శబరీశంకర్ పద్మావతి ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి)



భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెం బరు 13 (ఆంధ్రజ్యోతి) : హను మద్వ్రతాన్ని జిల్లాలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల్లూరులోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. శబరి శ్రీరామ క్షేత్రంలో ఉదయం విశేష అభిషేకాలు, హనుమద్వ్ర తం, లక్ష నాగవల్లీ దళార్చన, హోమం నిర్వహించారు. సాయంత్రం రామకోటి పుస్తకాలకు ప్రత్యేక పూజలు చేసి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శ్రీరామ స్తూపంలో వాటిని నిక్షిప్తం చేశారు. సంతపేట ఆంజనేయ స్వామి ఆలయం, పప్పులవీధి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం, మహాత్మాగాంధీ నగర్ శ్రీకృష్ణ మందిరం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.



శ్రీరామ స్తూపంలో రామకోటి పుస్తకాలు నిక్షిప్తం చేస్తున్న నిర్వాహకులు

PRATHIBHA

కొయ్య కళ.. భళా!

- ఉదయగిరి నుంచి అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి
- చెక్కనగిషీ శిక్షణతో ఎందరికో జీవనోపాధి
- సీఎం నుంచి ప్రధాని వరకు ప్రశంసల వెల్లువ

రాచరిక సామ్రాజ్య కేంద్రంగా విరాజిల్లిన ఉదయగిరిలో ఆ ప్రాభవం ఇప్పుడు కనిపించక పోయినా హస్తకళా వైభవానికి కొదవలేదు. కొయ్యపై చెక్కిన కళాత్మక వస్తువులు ఖండాంత రాలకు ఎగుమతి అవుతున్నాయి. దేశీయంగానే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతిని సొంతం చేసుకొంటు న్నాయి. ప్రముఖ ఆన్‌లైన్ స్టోర్స్‌లోనూ కళాత్మక వస్తువుల విక్రయాలకు చోటు దక్కించుకోవడమే కాదు.. ముఖ్యమంత్రి నుంచి ప్రధానమంత్రి వరకు ప్రశంసలు అందుకుంటున్నాయి.

- ఉదయగిరి (ఆంధ్ర జ్యోతి)



తయారైన బొమ్మలకు సాన పడుతూ..



ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



కొయ్య కళకు ప్రాణం పోసిన అబ్దుల్‌బషీర్

పూర్వీకుల నుంచి చెక్కబొమ్మల తయారీని నేర్చుకున్న షేక్ అబ్దుల్ బషీర్ తన 18వ సంవత్సరం నుంచే ఈ వృత్తిలోకి ప్రవేశించి వివిధ రకాల వస్తువులను తయారు చేయడం ప్రారంభించారు. దీనిపై ఇతరులు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో తన ఇద్దరు కుమార్తెలు గౌషియా బేగం, ఫాయిదాలకు నేర్పించారు. 2003లో 15 మంది సభ్యులతో సంఘంగా ఏర్పడి చైతన్యజ్యోతి వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఉడెన్ కట్లరీ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. దీనికి హ్యాండ్‌క్రాఫ్ట్ మినిస్టర్స్ ఆఫ్ టెక్స్‌టైల్స్ ఆర్థికసాయం అందించారు. ఏడాదిన్నర క్రితం అబ్దుల్ బషీర్ మరణానంతరం ఆయన పెద్దకుమార్తె గౌసియాబేగం ఆ కేంద్రం బాధ్యతలు అందుకున్నారు.

200 రకాల వస్తువుల తయారీ

ఉదయగిరి దుర్గం కొండపై లభించే జల్లనద్ది, లద్ది, కలువ, దేవదారు తదితర అటవీ కర్రను ఉపయోగించి ఈ వస్తువులను తయారు చేస్తారు. ఈ కొయ్య ద్వారా స్పూన్లు, దువ్వెనలు, ఫోర్కులు, అట్లకర్ర, గరిటెలు, డైనింగ్ టేబుల్స్, ఫొటోఫ్రేమ్స్, పిల్లల ఆట వస్తువులు, వంటకు ఉపయోగించే ట్రేలు, చిన్న గిన్నెలు, ప్లేట్లు, తదితరవి సుమారు 200 రకాల వస్తువులు ఈ కేంద్రంలో తయారు చేస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌కు

ఉదయగిరిలో తయారవుతున్న చెక్కనగిషీ వస్తువులకు విదేశీయం గా మంచి గిరాకీ ఉంది. గౌసియాబేగం కేంద్రం బాధ్యతలు చేపట్టాక తనతోపాటు కుమారుడు జాకీర్‌హుస్సేన్‌ను భాగస్వామ్యం చేశారు. ఇది మహిళలకు నైపుణ్యంలో మరింత శిక్షణ ఇప్పించేందుకు దోహదపడింది. మొదట్లో 15 మందితో ప్రారంభమైన ఈ కేంద్రంలో ఇప్పుడు 500 మంది పని చేస్తున్నారు. ఇప్పటికే వీరు ఆన్‌లైన్ వేదికగా ఫ్లిప్‌కార్ట్, ఐటోక్రీ, బెటర్ ఇండియా, త్రివేజీ, ఓఎన్‌డీసీల ద్వారా విక్రయాలు చేస్తుండగా మరింత ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్‌లోనూ పేరు నమోదు చేసుకున్నారు. తద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించుకునే అవకాశం ఏర్పడింది. అరకు కాఫీ పొడికి ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రంలో తయారయ్యే స్పూన్ ఎంపికయ్యింది. ఇప్పటికే ఏడాదికి రూ.80 లక్షల నుంచి 90 లక్షల వరకు టర్నోవర్ జరుగుతుండగా, విక్రయాలు మరింత పెరిగితే అధికమంది మహిళలకు ఉపాధి కల్పించే అవకాశం కలుగుతుంది.



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గౌసియాబేగం

200 కుటుంబాలకు జీవనోపాధి

చెక్కనగిషీ వస్తువుల తయారీ కేంద్రంలో 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు. వందేళ్లకు పూర్వం ఒకట్రెండు కుటుంబాలు ఈ కళారంగాన్ని నమ్ముకుని జీవనాన్ని సాగించాయి. ఉదయగిరి హస్తకళల కేంద్రంలో తయారు చేసిన వివిధ రకాల వస్తువులకు రాష్ట్రంలోని కాకుండా ఉత్తరాది రాష్ట్రాల్లో కూడా మంచి గుర్తింపు ఉంది. 2020, ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగిన చేతివృత్తుల ఎగ్జిబి షన్‌లో ఉదయగిరి కళాకారులు చేసిన స్టాల్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీతోపాటు పలువురు ప్రముఖులు సందర్శించి ప్రశంసలు అందించారు.

ప్రసంశల జల్లు

ఈ కళకు ఊపిరిపోసిన అబ్దుల్‌రషీద్‌కు లేపాక్షి, హస్తకళల అభివృద్ధి సంస్థ హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసా పత్రంతోపాటు బహుమతులు అందజేశారు. ఆయన కుమార్తె గౌసియాబేగం ప్రతిభను గుర్తించి ఇదే సంస్థ వివిధ బహుమతులు అందజేసింది. అలాగే వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు సైతం సొంతం చేసుకుంది. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా యంత్రాల కోసం రూ.10 లక్షల నిధులు కూడా మంజూరు చేసింది. ప్రస్తుతం కేంద్రం నిర్వహిస్తున్న భవనం శిథిలావస్థకు చేరిం దని, ప్రభుత్వం స్పందించి నూతన భవనం మంజూరు చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.



కొయ్యతో బొమ్మలను తయారు చేస్తున్న మహిళలు



వసతులు కల్పిస్తే

చెక్కనగిషీ కేంద్రం పూర్తి శిథిలావస్థకు చేరింది. వర్షానికి ఊరుస్తూ కూలే దశలో ఉంది. గత ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినా అరకొరగానే వస్తువులు కొనుగోలు చేశారు. ప్రభుత్వం స్పందించి నూతన కేంద్రాన్ని మంజూరు చేయడంతోపాటు ఆధునిక యంత్రాలు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పిస్తే పలువురికి ఉపాధి కల్పించడంతోపాటు ఉదయగిరి చెక్కనగిషీ కేంద్రం ఖ్యాతిని నలుదిశలా చాటుతాం.

- షేక్ అప్సర



శిక్షణతో ఉపాధి

గత కొన్నేళ్లుగా చెక్కనగిషీ వస్తువుల తయారీలో మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణతోపాటు వారికి ఉపాధి కూడా చూపుతున్నాం. ఇప్పటికే 500 మందికి శిక్షణ ఇచ్చాం. కేంద్రంలో 200 రకాల వస్తువులు తయారు చేస్తున్నారు. ఈ కేంద్రం వల్ల 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. కేంద్రానికి మౌలిక వసతులు కల్పిస్తే మరింత మందికి శిక్షణ ఇచ్చి వారికి ఆర్థిక భరోసా కల్పిస్తాం.

- షేక్ గౌసియాబేగం, కేంద్రం నిర్వాహకులు



ఉపాధి పొందుతున్నాం

చెక్కనగిషీ వస్తువుల తయారీలో శిక్షణ తీసుకుని ఉపాధి పొందుతున్నాం. డిజైనర్లు కొత్త వస్తువుల తయారీలో శిక్షణ ఇచ్చారు. స్థానికంగానే ఉంటూ వస్తువుల తయారు చేసి ఎంతోకొంత సంపాదిస్తూ కుటుంబ పోషణలో భాగమవుతున్నాం. ప్రభుత్వం చేయూత ఇస్తే మరిన్ని డిజైన్లతో వస్తువులు తయారు చేస్తాం.

- షేక్ అలీయా

17న నుడా చైర్మన్‌గా కోటంరెడ్డి ప్రమాణస్వీకారం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఈ నెల 17వ తేదీన నుడా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు మాజీ కార్పొరేటర్, టీడీపీ అధికార ప్రతినిధి ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలియ చేశారు. వేదాయపాళెంలో ఉన్న నుడా కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ ప్రమాణ స్వీకారం జరుగుతుందన్నారు. నర్తకి సెంటర్ నుంచి కోంటరెడ్డికి మద్దతుగా భారీ బైక్ ర్యాలీ జరుగుతుందని అందరూ పాల్గొనాలని కోరారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి దిశానిర్దేశం

(5వ పేజీ తరువాయి)

గణన జరుగుతోంది. దీన్ని వేగంగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ గణన ఆధారంగా జిల్లాలో ఎలాంటి పరిశ్రమల స్థాపన జరిగితే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుందో ఆ పరిశ్రమలను ప్రోత్సహించనున్నారు.

● గత ఐదేళ్ల ప్రభుత్వంలో మాదకద్రవ్యాల చెలామణి విస్తృత స్థాయికి చేరుకుంది. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విద్యాసంస్థల్లోకి చొరబడ్డాయి. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే స్థాయికి చేరుకున్నాయి. వీటిని అరికట్టడం కోసం జిల్లా పరిధిలోని ప్రతి కళాశాల, పాఠశాలల్లో 'ఈగల్' కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, పరిసర ప్రాంతాల్లో నివశించే ప్రజలు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరందరి పేర్లు గోప్యంగా ఉంచుతారు. ఈ బృందం విద్యాసంస్థల్లోకి మాదకద్రవ్యాల రాకను గమనించి ఆ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు చేరవేస్తుంది.

పోలీసు క్రీడలు వాయిదా

నెల్లూరు(క్రైం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ స్పోర్ట్ అండ్ గేమ్స్ మీట్ మళ్లీ వాయిదా పడింది. శుక్రవారం నుంచి పోలీసు క్రీడల నిర్వహణకు ఆ శాఖ అన్నీ ఏర్పాట్లు చేసింది. అయితే వర్షాల కారణంగా ఒకరోజు తర్వాత శనివారం నుంచి నిర్వహిస్తామని ప్రక టించింది. అయితే నీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో బందోబస్తుకు సిబ్బంది కొరత ఏర్పడు తున్న కారణంగా స్పోర్ట్స్ మీట్ ను మరోసారి వాయిదా వేశారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.

ఎట్టకేలకు మూడు అడుగులు లేచిన కాలువ తూము గేటు

- రాళ్లపాడు కుడి కాలువలోకి 80 క్యూసెక్కుల నీటి ప్రవాహం
- మరమ్మతు పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్

లింగసముద్రం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వారంరోజులుగా మొరాయించిన రాళ్లపాడు కాలువ తూము గేటు పనుల్లో కొంత పురోగతి కనిపించింది. శుక్రవారం ఉదయం మెకానిక్ నిపుణులు షేక్ షమీంబాషా, వైజాగ్ స్కూబా డైవర్లు సంయుక్తంగా ఈ పనులను చేపట్టారు. దెబ్బతిన్న గేటు కింద ప్లేట్లు పెట్టి ఇనుప పుల్లీలతో సిబ్బంది, కొందరు రైతులు గేటును పైకి లాగడంతో మూడు అంగుళాల మేర గేటు పైకి వచ్చింది. దీంతో తూము నుండి కాలువలోకి నీరు ప్రవహించింది. అయితే శనివారం ఈ గేటును మరో ఐదారు అంగుళాల మేర పైకి లాగి కనీసం 150 క్యూసెక్కుల నీటిని ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని డీఈఈ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. నీటి విడుదల కావడంతో అక్కడకు పెద్ద ఎత్తున చేరుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పనులు పర్యవేక్షించిన ఎమ్మెల్యేలు

కాలువ తూము గేటు కొద్దిగా పైకి లేచిందని తెలియడంతో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మధ్యాహ్నం 3గంటలకు చేరుకొని పనులను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు గంగమ్మ తల్లికి చీర సారె సమర్పించి, కొబ్బరికాయ కొట్టి ప్రత్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్టు అధికారులు, మెకానిక్ బాషా, స్కూబా డైవర్లకు, సిబ్బందికి సహకరించిన రైతులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోపంల్లి మనోహర్, మద్దెల రామారావు, అడపా రంగయ్య, గాలంకి ప్రసాద్, జంపాల శివప్రసాద్ పాల్గొన్నారు.

భూ సేకరణ... లోపభూయిష్టం

(5వ పేజీ తరువాయి)

శాఖ నిర్ణయించిన ధరకు 4 రెట్లు పరిహారంగా ఇవ్వాలని, ఆ ధరలు 2015లో నిర్ధారించినవి కనుక తాజా ధరలు నిర్ధాంచి పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ఇవేమీ పట్టించుకోకుండా అన్ని భూములకు ఎకరానికి 23.2 లక్షల పరిహారం ఇచ్చేసి భూములు లాగేసుకుంటున్న దుస్థితి నెలకొంది. అలాగే భూములన్నీ తీసేసుకుని గ్రామాన్ని వదిలేస్తే వ్యవసాయం, పశుపోషణ, వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్న తాము ఎలా బతకాలని ఆయా గ్రామాల ప్రజలు వేస్తున్న ప్రశ్నలకు అధికారుల వద్ద సమాధానం లేదు. గ్రామాలకు చుట్టూ కనీసం 300 మీటర్ల మేర భూసేకరణ చేయకుండా వదిలేయాలని మిగిలిన భూములను భూసేకరణ చట్టం ప్రకారం తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకుండా బలవంతంగా భూసేకరణ చేసేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తుండటమే గాక అధికారుల చుట్టూ తిరిగి తమకు న్యాయం చేయాలని మొరపెట్టుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, అధికారులు ప్రజాభిప్రాయం తీసుకుని అందుకనుగుణంగా చర్యలు చేపట్టకుంటే ఈ గ్రామాలలో మరిన్ని అఘాయిత్యాలు జరిగే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

సాగునీటి సంఘాలకు నేడు ఎన్నికలు

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్నాయి. కాలువల నిర్వహణ, రైతాంగం సమస్యలను పరిష్కరించ డంలో సాగునీటి సంఘాలు కీలకంగా వ్యవహరిస్తాయి. అయితే చాలా కాలం నుంచి ఎన్నికలు లేకపోవడంతో అధికారులే ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరి స్తూ వస్తు న్నారు. ఇప్పుడు సాగునీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసే అవకాశం రావ డంతో గ్రామాల్లో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా ఉండేలా అధికార పార్టీ నేతలు ఏకగ్రీవాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొన్ని చోట్ల మాత్రం పోటీ జరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

జైళ్ల డీజీపీపై కేసు నమోదు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాజమండ్రి సెంట్రల్ జైలులో ఎస్‌టీపీ ఖైదీతో జైళ్ల శాఖ డీజీపీ రవికిరణ్ తన ఇంటిలో పనులు చేయించుకుంటున్నారని, రెండు మూడు రోజుల క్రితం ఆ ఖైదీని చావగొట్టారని ఆంధ్రప్రదేశ్ ఖైదీ కుటుంబ సంక్షేమ సమితి నాయకురాలు సీహెచ్ కవిత ఆరోపించారు. శుక్రవారం సమితి సభ్యులతో కలిసి ఆమె నెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జైళ్లలో జరుగుతున్నాయని తెలిపారు. నెల్లూరు జైలులో ఓ ఖైదీని కూడా చితకబాదారని, దీనిపై బాధితులమైన తాము సీబీసీఐడీకి వాంగ్మూలం ఇచ్చి ఉన్నామన్నారు. డీజీపీ రవికిరణ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసులు పెట్టకుండా అతనిని బదిలీ చేస్తే ఆందోళనకు దిగుతామన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

- 114 మందిపై కేసులు నమోదు
- రూ.4.60లక్షల అపరాధ రుసుం విధింపు

వలేటివారిపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. కందుకూరు డివిజన్ పరిధిలోని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్ అధికారులు, విద్యుత్ సిబ్బంది 32 బృందాలుగా విడిపోయి అన్నిగ్రామాల్లోని విద్యుత్ చౌర్యంపై ఆరా తీశారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 4గురుని, అలాగే అదనపు విద్యుత్ లోడ్ వినియోగిస్తున్న 105మందిని గుర్తించినట్లు తెలిపారు. 114మందిపై కేసులు నమోదు చేసి వాళ్లకు రూ.4.60వేల అపరాధ రుసుం విధించినట్లు నాగేశ్వరరావు తెలిపారు.



మాట్లాడుతున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

80 శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ


వర్షానికి దెబ్బతిన్న శనగ పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న శనగ పంట రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్లు ఉదయగిరి ఇన్‌చార్జి ఏడీఏ పీ చెన్నారెడ్డి, మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం వారు దుత్తలూరులో దెబ్బతిన్న శనగ పంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో మొలకెత్తే దశలో ఉన్న శనగ పంట వర్షాలకు దెబ్బతిందన్నారు. అలాంటి రైతులకు 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మొలక దశలో పంట దెబ్బతిన్న రైతులకు ఆయా రైతుసేవా కేంద్రాల పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులు గుర్తించి విత్తనాల పంపిణీకి చర్యలు చేపడతారన్నారు. కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సాగునీటి సంఘాల ఏకగ్రీవానికి నేతల కసరత్తు

కావలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో శనివారం జరుగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎక్కువ భాగం ఏకగ్రీవం చేసేందుకు ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి నేతలు, రైతులతో చర్చిస్తున్నారు. మొత్తం 74సాగునీటి సంఘాలుండగా అందులో కావలి మండలంలో 20, బోగోలు మండలంలో 17, దగదర్తి మండలంలో 23, అల్లూరు మండలంలో 14 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ప్రధాన ప్రతిపక్షం వైసీపీ నాయకులు ఉన్నా చాలా వరకు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వెనుకాడుతున్నారు. కూటమి నేతల్లోనే పోటీ నెలకొంది. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు శుక్రవారం ముసునూరులోని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి నివాసానికి వెళ్లి ఈ ఎన్నికల్లో తమ పార్టీ నేతలకు కూడా కొన్నిచోట్ల ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రుపు ఎన్నికలు జరుగుతుంటే ఇపుడు పేర్లు ఇస్తే వాటిని రైతులందరితో మాట్లాడి ఎలా సర్దుబాటు చేయాలని ప్రశ్నించారు. అనంతరం పోటీ చేసే అభ్యర్థుల వివరాలు తీసుకున్నారు. కొన్ని సాగునీటి సంఘాలకు టీడీపీలో కూడా ఏకాభిప్రాయం లేక పోవటంతో వారిని పిలిపించుకుని మాట్లాడి సర్దుబాటు చేశారు. దీంతో మొత్తం మీద మెజార్టీ సాగునీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి


అవగాహన కల్పిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రదీప్

కొండాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన శిక్షణలో కార్య దర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు పాల్గొని మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు దేశం పురోగతి సాధించాలంటే పంచాయతీలు కీలకమన్నారు. ఇందులో భాగంగా పంచాయతీలలో ప్రజలకు మౌలికవసతుల కల్పన తదితర విషయాలకు సంబంధించి 9రంగాలలో అభివృద్ధి సాధించేందుకు కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంఈవోలు 1,2 రవి కుమార్, ఆనంద రావు, ఈవోపీఆర్‌డీ నారాయణ, ఏపీఎమ్ కాంతా రావు, ఏవో శేషసాయి పాల్గొన్నారు.

●లింగసముద్రం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి లక్ష్యాలపై రెండోరోజు శిక్షణ తరగతులు కొనసాగించారు. పంచాయతీల అభివృద్ధి, పేదరిక నిర్మూలనకు సర్పంచులు చర్యలు తీసుకోవాలని మండలాధికారులు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజశేఖర్, పీఆర్ ఏఈ రాజశేఖర్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఏపీఎం సింహాద్రి, ఇతర అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రానికి మతి స్థిమితం లేని అనాథ మహిళ


మతిస్థిమితం లేని మహిళను ఆదరణ కేంద్రంలో చేర్పిన మోహన్‌కృష్ణ

బిట్రగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు ఆదరణ కేంద్రంలో శుక్రవారం రాత్రి మతి స్థిమితంలేని అనాథ మహిళను మోహన్ కృష్ణ చేర్పారు. రుద్రకోటకు చెందిన మోహన్‌కృష్ణ వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్నారు. స్వగ్రామానికి వచ్చిన ఆయనకు రోడ్డుపై తిరుగుతున్న ఆమెను గమనించి ఆటోలో ఆదరణ కేంద్రానికి తీసుకెళ్లి ఆదరణ కేంద్ర నిర్వాహకులు సింహాద్రిరావు, భవానీలకు అప్పగించారు.

చెరువులోకి దిగిన మతిస్థిమితం లేని వృద్ధురాలు

● కాపాడి ఇంటికి పంపిన చెంచుగానిపాలెం దంపతులు

కావలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయిన చౌదరిపాలెంకు చెందిన పోతినేని అనసూర్యమ్మ (80) శుక్రవారం దారి తప్పి చెరువులో పడింది. ఆ సమయంలో అటుగా వెళుతున్న చెంచుగానిపాలెం దంపతులు వినయ్, దీపిక దంపతులు ఆమెను చూసి బయటకు తీసుకొచ్చారు. గ్రామంలోని ఇంటికి తీసుకొచ్చి సపర్యలు చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. వృద్ధురాలు కావలిలో కుమార్తె వద్ద ఉంటుంది. చౌదరిపాలెం వెళ్లేందుకు ఆటోలో వచ్చి చెంచుగానిపాలెం క్రాస్ రోడ్డు వద్ద దిగింది. చౌదరిపాలెం బదులు దారితప్పి చెంచుగానిపాలెం వైపు వెళ్లింది. దాహార్తి తీర్చుకునేందుకు మార్గమధ్యలో ఉన్న చెరువు వద్దకు వెళ్లి జారి పడింది. తడి బట్టలతో వణకుతున్న వృద్ధురాలిని ఇంటికి తీసుకువెళ్లి స్నానాలు చేయించి బట్టలుకట్టి ఆహారం పెట్టి ఆటో లో ఎక్కించి కావలిలోని కుమార్తె వద్దకు పంపారు.

28న కావలిలో జగన్నాధుడి రథయాత్ర


మాట్లాడుతున్న డాక్టర్ సుఖదేవ్ మహరాజ్

కావలి టౌన్, డిసెంబరు 13: జగన్నాథుడి అనుగ్రహ కటాక్షం కోసమే జగన్నాథ రధయాత్ర అని, ఈ నెల 28న పట్టణంలో జగన్నాథ రథయాత్ర నిర్వహించనున్నట్లు నెల్లూరు ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ్ మహరాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఎదురు వీధిలోని ఇస్కాన్ మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భక్త జనం వేలాదిగా పాల్గొని పూరీ జగన్నాథుడి కృపకు పాత్రులు కావాలన్నారు. బృందావనం కాలనీ నుంచి ప్రారంభమై ట్రంకు రోడ్డు మీదుగా ఆర్టీసీ గాంధీ బొమ్మసెంటర్ మీదుగా వెంకటేశ్వర, లత థియేటర్ల మీదుగా వాయునంద ప్రెస్‌వీధి జెండాచెట్టు సెంటర్, పెట్రోల్ బంకు వెనుకనున్న కల్యాణ మండపం వరకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా 10వేల మందికి అన్నదానం చేస్తామన్నారు. సమావేశంలో చంద్రశేఖర్ స్వామి, నల్లూరు రవి, డాక్టర్ మాధవరెడ్డి, రమేష్, గోపికృష్ణ, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్ నాయకుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న రైల్వే మజ్దూర్ యూనియన్ సభ్యులు

బిట్రగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించడంపై సంఘం బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు మద్దిబోయిన శేఖర్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూ కార్యాలయ ఆవరణలో యూనియన్ విజయంపై సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు (ఎస్ఎస్ఈ) సురేష్, కృష్ణన్, విజయవర్ధన్, జేఈ నాగరాజు, సూరిబాబు, సుభాషిణి, శ్రీహరి, రఘు, క్రాంతి, మధు, వంశీనాయక్, రమేష్ పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పొగాకు, మినుము పంటలు

● పరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్


కూనిపాలెంలో పూర్తిగా దెబ్బతిన్న శనగ పంట

వలేటివారిపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరుస తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని కూనిపాలెం, పోలినేనిపాలెం, నేకునాంపురం, కళవళ్ల బడేవారిపాలెం పోకూరు వలేటివారిపాలెం, లింగపాలెం గ్రామాల్లోని శనగ, మినుము, పొగాకు పంటలు దెబ్బతిన్నాయి. కూనిపాలెం, కళవళ్ల, నేకునాపురంలో 70 ఎకరాలలో సాగు చేసిన శనగ పంట విత్తనం వేసినప్పటి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో పూర్తిగా దెబ్బతింది. మళ్లీ దున్ని చేసి పంట సాగు చేద్దామనుకుంటే పొలాలు తేమ ఆరడం లేదని రైతులు వాపోతున్నారు. ఈలోగా శనగ పంట సాగు అదును దాటిపోతుందని చెబుతున్నారు. పోలినేనిపాలెం, శాకవరం, శింగమనేనిపల్లె, నలదలపూరు, కళవళ్ల కూనిపాలెం గ్రామాల్లో పొగాకు పూర్తిగానూ, వలేటివారిపాలెం, లింగపాలెం, బగారక్కపాలెం, అమ్మపాలెం, జమీన్‌ఉప్పుటపాడు గ్రామాల్లో పాక్షికంగాను దెబ్బతింది. నల్లరేగడి నేలల్లో పొగాకు నాట్లు వేసినా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు పొగాకు నాట్లు కుళ్లిపోయాయి. ఎర్రరేగడి నేలల్లోని ముదురు పొగాకు తోటల్లో బొబ్బ తెగుళ్ల రావడంతో మొక్కలు పీకి వేస్తున్నారు. ముదురు పొగ తోటల్లో క్యూరింగ్ అనంతరం రంగు మారి లోగ్రేడ్ వస్తుందని చెబుతున్నారు. కూనిపాలెం, పోకూరు, బడేవారిపాలెం, కాకుటూరు, నేకునాంపురం గ్రామాల్లో సాగు చేసిన మినుము కాయదశలో ఉండడం వలన వర్షాలకు కొంతమేర దెబ్బతింది. మళ్లీ వర్షం కురిస్తే పొగాకు, శనగ, మినుము పంటలపై ఆశలు వులుకోవాల్సిందే అని చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం


ఉదయగిరి రూరల్: ఎన్నికల సామగ్రి అందజేస్తున్న చంద్రమౌళి

కావలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధం అయ్యింది. రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా వీటి పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రతి సాగునీటి సంఘానికి 6 ప్రాదేశికాలు ఉండటంతో ఎన్నికలు అనివార్యమైతే వాటిని నిర్వహించేలా ప్రతి సాగునీటి సంఘానికి ఈవో, ఏఈవో మరో నలుగురు సిబ్బందిని నియమించి వారికి ఎన్ని కల నిర్వహణ మెటీరియల్‌ను అందజేశారు.

●ఉదయగిరి రూరల్ : ఉదయగిరి సబ్ డివిజన్‌లో శనివారం జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వంసిద్ధం చేసినట్లు నోడల్ అధికారి, జలవనరుల శాఖ డీఈ కె చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్‌కు సంబంధించి సామాగ్రిని పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని గండిపాళెం జలాశయం కింద 17 డిస్ట్రిబ్యూటరీలకు, ఉదయగిరి మండలంలో 11 చెరువులకు, సీతారామపురం మండలంలో 6 చెరువులకు సంబంధించి సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : ఆర్డీవో


దుత్తలూరు సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న కావలి ఆర్డీవో

ఉదయగిరి రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గానుగపెంటపల్లి సచివాలయంలో తహసీల్దారు సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పలు సమస్యలపై ప్రజలు, రైతులు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీటీ హసీనా, ఆర్ఐ సురేంద్ర, వీఆర్వోలు మాలకొండయ్య, వెంకటేశ్వర్లు, జాఫర్, సర్వేయరు మీరావలి పాల్గొన్నారు.

●దుత్తలూరు: రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని నందిపాడు గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఈ సందర్భంగా సదస్సులో రైతులు, ప్రజలు అందజేసిన అర్జీలను పరిశీలించారు. అర్జీలకు సత్వరమే పరిష్కారమార్గం చూపాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, సర్వేయరు శివ, వీఆర్వో వెంకట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): తొడుగుపల్లి, తూర్పుపాళెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ చంచయ్య, వీఆర్వోలు నారాయణ, శ్రీనివాసులు, టీడీపీ నాయకులు తెల్లగొర్ల వెంకటయ్య, పాలకొల్లు విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చేజర్ల : గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు ఆర్డీవో పావని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నాగులవెల్లటూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చే సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మురళి, స్థానిక టిడిపి నాయకులు వేలూరు కేశవచౌదరి పాల్గొన్నారు.

●మర్రిపాడు: స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. అల్లంపాడు రెవెన్యూ పరిధిలోని రైతుల నుంచి తహసీల్దారు అనీల్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. 10 అర్జీలు అప్పటి కప్పుడే పరిష్కరించినట్లు తహసీల్దారు తెలిపారు. టీడీపి మండలధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్‌యుడు, సర్పంచ్ బీబీజాన్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● సీతారామపురం: గుండుపల్లి గ్రామ పంచాయతీలో తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని 72 అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో ఖజామొద్దీన్, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

●వలేటివారిపాలెం: రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ అబ్దుల్‌అమీద్ తెలిపారు. శాఖవరం సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి అర్జీలను రెవెన్యూ అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఆర్ఐ ప్రసాద్, ఎండోమెట్ ఈఓ పావనిపాల్గొన్నారు.

●లింగసముద్రం: రైతు భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సీతామహాలక్ష్మి తెలిపారు. పెంట్రాల పంచాయతీ చీమలపెంటలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో 6గురు రైతులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య, వీఆర్ఓ వినోద్, సర్వేయరు వెంకటేష్, నాయకులు సుధాకర్, మధు, రమణయ్య ఉన్నారు.

ఇంధన పరిరక్షణ దినోత్సవం

బిట్రగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో శుక్రవారం ఎలక్ట్రికల్ డిపార్మెంట్ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాస రచన పోటీలోని విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి, ఈఈఈ డిపార్మెంట్ హెచ్‌ఓడీ పీవీ రామ్‌కుమార్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, వాలంటీర్లు ఉన్నారు.

వర్షపు నీరు తొలగింపు

సంగం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో ఆదేశాల మేరకు స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహం ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని శుక్రవారం బయటకు తరలించారు. రాళ్లచెలికలోని బాలికల వసతిగృహం ఆవరణలోకి వర్షపు నీరు చేరి విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. సందర్శనకు వచ్చిన డీడీ విషయాన్ని డీపీవో దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి వర్షపు నీరు వెళ్లేందుకు అడ్డంగా ఉన్న సిమెంట్ రోడ్డును పగలకొట్టి నీటిని బయటలకు తరలించారు.

ఇరువర్గాలపై కేసు

అల్లూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి : స్థానిక పేట యర్రంశెట్టి వెంకట శేషయ్య, సావారపు శీనమ్మ పొలం తగాదాలో ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో శీనమ్మ భర్త శీనయ్య బావ అయిన యర్రంశెట్టి వెంకట శేషయ్యపై దాడి చేయగా రక్తగాయం అయ్యింది. ఇరువురి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిషోర్‌బాబు తెలిపారు.

రాజ్యసభ సభ్యులకు టీడీపీ నేతల సన్మానం


రాజ్యసభ సభ్యులను సన్మానిస్తున్న చెంచలబాబు యాదవ్

ఉదయగిరి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, సాన సతీష్‌లను శుక్రవారం శాసనసభ ప్రాంగణంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, మాజీ జడ్పీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, టీడీపీ యువత అధ్యక్షుడు పాముల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్లను కలిసిన జనసేన నాయకులు


జనసేన నాయకులతో సమీక్ష జరుపుతున్న కాకర్ల

కలిగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను శుక్రవారం పార్టీ కార్యాల యంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘాల ఎన్నికలో జనసేన పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థుల వివరాలు అందజేశారు. కూటమి ప్రభుత్వంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రుషికేశ్‌యాదవ్, రత్తయ్య, రాము, దిలీప్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జూడో క్రీడాభివృద్ధికి కృషి

కావలి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జూడో క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జూడో అసోసియేషన్ జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడు మురళి తెలిపారు. శుక్రవారం ఈ విషయంపై ఆయన విలేకరులతో మాట్లాడారు. జూడో క్రీడాకారులను శిక్షణ ఇచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకే ఈ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర జూడో అసోసియేషన్ సీఈవో నాగిశెట్టి వెంకట్ పర్యవేక్షణలో ఏర్పడిన కమిటీలో తనతోపాటు సురేష్, శ్రీను ఉన్నారని తెలిపారు.

హడావుడే తప్ప ఆక్రమణల తొలగింపేదీ!?


రోడ్డు వెంట వెలసిన దుకాణాలు

కావలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆక్రమణల తొలగింపుపై అధికారుల హడావుడి తప్ప ఆచరణ సాధ్యంలో చిత్తశుద్ధి లేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. స్థానిక పట్టణ ట్రంకు రోడ్డులోని ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ సముదాయంలోని సర్కిల్, రూరల్ పోలీస్‌స్టేషన్, సబ్‌జైలు, ఉప ఖజానా, సబ్‌ట్రెజరీ, వ్యవసాయశాఖ కార్యాలయాలు ఉన్నా అవి కనిపించకుండా రోడ్ల వెంబడి ఆక్రమణలను ఏర్పాటు చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల కార్యాలయాలు కనిపించకుండా అధికారులు పట్టించుకోకపోవటం దారుణం. ఇటీవల మున్సిపల్ అధికారులు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆక్రమణల తొలగింపునకు ఎక్స్‌కవేటర్ పెట్టి హడావుడి చేసినా మరుసటి రోజు నుంచే యధాప్రకారం వాటిని ఉంచారు. ఆక్రమణలతో ట్రంకు రోడ్డు కుదించుకు పోయి రాక పోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రధాన కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో కార్యాలయా లకు వచ్చే వాళ్లకు కూడా కనిపించకుండా మూసుకు పోతున్నట్లు ఆక్రమణలు వెలుస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవటం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం ప్రధాన కార్యాలయాల ముందు ఉన్న ఆక్రమణలనైనా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సత్ఫలితాల కోసమే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

● ఎంఈవో గోవిందయ్య



కావలి టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఉపాధ్యాయుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడం కోసమే ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఎంఈఓ గోవిందయ్య శుక్రవారం తెలిపారు.

? పీటీఎం ప్రధాన ఉద్దేశ్యం ఏమిటి.

! విద్యార్థుల సామర్థ్యం, ఉపాధ్యాయుల బోధన, పాఠశాలలో మౌలిక వసతులు, తదితర విషయాలపై ఇరువురిలో అవగాహన పెంచడమే ప్రధాన ఉదేశం.

? పీటీఎంతో ఎలాంటి ఫలితాలు వస్తున్నాయి.

! సత్ఫలితాలు వస్తున్నాయి. పీటీఎంతో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించుకోవడంతో పాటు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహద పడతాయి.

? డ్రాపవుట్స్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! కస్టర్ ప్రధానోపాధ్యాయులు సీఆర్ పీలతో డ్రాపవుట్స్ ఏకారణంతో పాఠశాలకు రావడం లేదో తెలుసుకుని తిరిగి పాఠశాలకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం.

న్యూస్ బాక్స్

పనుల్లో నాణ్యత పాటించాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లబోతులవారిపల్లి, రామాపురం గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్‌రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం పంచాయతీరాజ్ డీఈ మణి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లబోతులవారిపల్లిలో రూ. 7లక్షలు, రామాపురంలో రూ. 10లక్షలతో నిర్మాణ పనులు చేపట్టడం జరుగు తుందన్నారు. పనులు చేపట్టే గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఈ రవీంద్రనాథ్, సిబ్బంది రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ ఇన్‌ఫోలో విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు చైల్డ్ ఇన్‌ఫోలో నమోదు చేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం పట్టణంలోని బీసీ కాలనీలోని తెలుగు, ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీ నాగయ్య, షేక్ సర్దార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మన్నేటికి సన్మానం

వింజమూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య దర్శి మన్నేటి వెంకటరెడ్డిని మదర్‌థెరిస్సా మిరాకిల్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ సేవా కార్యక్రమాల గురించి ఫౌండర్ శ్యాంసన్‌ను అడిగి తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఈశ్వర్, మహేష్, శ్రీను, మోజస్, సాకేత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ శ్రీనివాసులు రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముసునూరు, అన్నగారిపాలెం, మద్దూరుపాడు, తుమ్మలపెంట, చెన్నాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

●బిట్రగుంట : బోగోలు మండలంలోని చెంచులక్ష్మీపురం, జక్కేపల్లిగూడూరు, ముంగమూరు, వడ్డిపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ జడరాయ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు జిల్లాస్థాయి బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక

కావలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కబడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లాస్థాయి జూనియర్స్ కబడ్డీ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 తర్వాత జన్మించి, బాలురు 70 కిలోలు, బాలికలు 65 కిలోలు లోపు ఉన్న వారు పోటీలకు అర్హులన్నారు. పోటీలలో పాల్గొన దలిచిన వారు ఆధార్ కార్డుతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన జట్టు రావులపాలెంలో నిర్వహించే 50వ జూనియర్ కబడీ రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్: 94405 03548, 92989 50860 నంబర్లను సంప్రదించాలన్నారు.